ఏపీలో పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు

ముదు తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఆంధ్రప్రదేశ్ లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి 25,375 క్యూసెక్కుల వరద నీరు చేరింది. నల్లమడ డ్రైయిన్ కు 47 వేల క్యూసెక్కులు, ఎర్రకాలువకు 19,756 క్యూసెక్కుల మేర వరద ప్రవాహం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.అలాగే తమ్మిలేరు, గోనెల వాగుకు 5500 క్యూసెక్కులు, పెద్ద వాగుకు 9500 క్యూసెక్కుల మేర వరద ప్రవాహాలు కొనసాగుతున్నాయని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. పొంగిపొర్లుతున్న వాగుల కారణంగా వివధ రూదారి మార్గాల్లో రాకపోకలపై ప్రయాణాలు జాగ్రత్తగా చేయాలని సూచిస్తున్నారు. అవసరమైతే తప్ప ప్రయాణాలు మానుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

స్వర్ణాంధ్ర

తెలుగు దినపత్రిక

సంపాదకుడు : కె.బి.జి. తిలక్

పరిషత్ ఎన్నికలు.. వర్షాలు, సాంకేతిక సమస్యలతో పలు చోట్ల ఇబ్బందులు

ఏపీలో పరిషత్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పలు చోట్ల వర్షాలు, సాంకేతిక అవాంతరాల మధ్య కొనసాగుతోంది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ, ఓటర్లు మాత్రం ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి క్యూలైన్లలో వేచి ఉంటున్నారు.కాకినాడ జిల్లా జగ్గంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం ప్రాంగణంలోకి భారీగా వర్షపు నీరు చేరడంతో ఓటర్లు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని అద్దంకి, చీరాల, వేటపాలెం, గుడ్లూరు వంటి పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పోలింగ్ కేంద్రాల వద్ద నీరు నిలిచిపోయింది. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుండగా, కావలిలోని కేంద్రాల్లో దట్టమైన మబ్బుల కారణంగా చీకట్లు అలముకున్నాయి.

R.N.I.No.APTEL/1999/1614 సంపుటి : 28 సంచిక 195 విజయవాడ 06 నవంబర్ 2026 శుక్రవారం 9 పేజీలు వెల : 2 రూపాయలు swarna_tilak@rediffmail.com´

గెలుపు ఆనందం ఒక వైపు..టెన్షన్ మరో వైపు!

(వాసిరెడ్డి శ్రీనివాస్)

ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి దుమ్ములేపింది. ఈ ఫలితాలు ఇంకా దగ్గర దగ్గర రెండున్నర సంవత్సరాలు ఉన్న కూటమి ప్రభుత్వానికి రాజకీయంగాఅద్భుత ఫలితాల కిందే లెక్క. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన తరహాలోనే మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఫలితాలు వచ్చాయి. త్వరలో జరగనున్న జడ్పీటిసి, ఎంపీటిసి ఎన్నికల్లో కూడా ఫలితాలు ఇదే ట్రెండ్ ను కొనసాగించే అవకాశం లేకపోలేదు. ఇంత వరకు బాగానే ఉంది. ఇప్పటికే కూటమిలోని కీలక నేతలు అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు ఈ ఫలితాల జోష్ తో మరింతగా మారిపోతారా అన్న చర్చ టీడీపి, జనసేన నేతల్లో సాగుతోంది. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ టర్మ్ లో సీనియర్ నేతలకు...ఎమ్మెల్యేలకు కూడా సమయం కేటాయించటం లేదు. ఎప్పుడో ఒకసారి మాత్రమే వాళ్లకు ఆయనతో మాట్లాడే ఛాన్స్ దక్కుతోంది. ఇక జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విషయానికి వస్తే ఆయన మంత్రిగా ఎప్పుడు బాధ్యతలు నిర్వహిస్తారో ఎవరికీ తెలియదు...సొంత పార్టీ ఎమ్మెల్యేలను కూడా కలవరు అనే అభిప్రాయం జనసేన నేతల్లోనే ఉంది.అనధికారికంగా ఒకటి...రెండు శాఖలు మినహా ప్రభుత్వాన్ని అంతా తానే నడిపిస్తున్నారు అనే ప్రచారం ఉన్న టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ రాబోయే రోజుల్లో మరింత దూకుడు చూపిస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది టీడీపీ నేతల్లో. చంద్రబాబు తరహాలోనే నారా లోకేష్ కూడా సీనియర్లను పెద్దగా



పట్టించుకోకుండా తన టీం తోనే అంతా నడిపిస్తున్నారు అని పార్టీ నాయకులు చెపుతున్నారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి సీట్ల కేటాయింపు విషయంలో టీడీపీ, జనసేన మధ్య పలుమార్లు విబేధాలు తలెత్తాయి. అవి ఎన్నికలపై ప్రభావం చూపిస్తాయా అనే సందేహం కొంత మంది నేతల్లో వ్యక్తం అయింది. కారణాలు ఏమైనా కూడా ఈ ఎన్నికల్లో కూడా కూటమి క్లీన్ స్వీప్ చేయటంతో ఆయా పార్టీల అగ్రనేతలు ఇక తమ వ్యూహాలకు తిరుగులేదు అనే అభిప్రాయానికి వచ్చే అవకాశం ఉంది. అంతే కాదు ఈ జోష్ తో తాము చెప్పే మాటలకు బిన్నంగా ఎవరైనా మాట్లాడితే సహించే ఛాన్సులు ఏ మాత్రం ఉండవు అనే భయం టీడీపీ నేతల్లో వ్యక్తం అవుతోంది. ఇప్పటికే పార్టీల్లో...ప్రభుత్వం లో నిర్ణయాలు అన్నీ కూడా కేంద్రీకృతంగా సాగుతున్నాయి అని... రాబోయే రోజుల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది అని భావిస్తున్నారు.

రాజకీయంగా ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. సరిగ్గా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇలాగే జరిగింది. అప్పుడు వైసీపీ కూడా స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏమైందో అంతా చూశారు. సహజంగా ఏ రాష్ట్రంలో అయినా సరే స్థానిక సంస్థల ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగానే ఉంటాయనే విషయం తెలిసిందే. ఇంకా రెండున్నర సంవత్సరాల పదవి కాలం ఉన్న ప్రభుత్వ అభ్యర్థులకు కాకుండా ప్రతిపక్షంలో ఉన్న వాళ్లకు ఓట్లు వేయటం వల్ల పెద్దగా ఎలాంటి ప్రయోజనం ఉండదు అనే కోణంలోనే పట్టణ ఓటర్లు అధికార పార్టీ వైపు మొగ్గుచూపుతారు.

ఈ సారి ఎన్నికల్లో కూడా అదే జరిగింది. మరి తాజా గెలుపును కూటమి ఎలా మార్చుకుంటుంది అన్నది భవిష్యత్ లో కానీ తేలదు. ప్రస్తుతం టీడీపీ, జనసేనల్లో పరిస్థితి ఎలా ఉంది అంటే ఒక వైపు గెలుపు ఆనందం ఉన్నా కూడా రాబోయే రోజుల్లో కీలక నేతలు మరింత కఠినంగా వ్యవహరించే అవకాశం ఉంది అనే ఆందోళన కొంత మంది నేతల్లో ఉంది.

ట్రంప్ ఓటమితో కుప్పకూలిన క్రూడాయిల్ ధరలు.. ఏకంగా 10 శాతం పతనం

అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ల జోరుకు అడ్డుకట్ట పడింది. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ (ప్రతినిధుల సభ), సెనేట్‌లో డెమోక్రాట్లు మెజార్టీ సాధించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భారీగా పడిపోయాయి. గత శుక్రవారం రోజు బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు ఏకంగా 118 డాలర్ల స్థాయిలో ఉండగా అది ఇప్పుడు 94 డాలర్ల మార్కు దిగొచ్చింది. ఈ క్రమంలో ఏకంగా 20 శాతానికిపైగా పడిపోవడం గమనార్హం. బుధవారం రాత్రి వేళనే ఏకంగా 10 శాతం పతనం అయ్యాయి. ఇప్పుడు గురువారం సెషన్ ఆరంభంలో కూడా ఇంకా పతనం అవుతూనే ఉంది. ఇది ఒక దశలో 93.46 డాలర్ల స్థాయి కనిష్ఠానికి పడిపోయింది.మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు గెలవడంతో ఇరాన్‌పై ట్రంప్ సైనిక చర్యలకు నిధుల కొరత ఏర్పడే అవకాశం ఉండటంతో, ఇరాన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు పడనుందనే అంచనాలు మార్కెట్లో పెరిగాయి. దీంతో అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం ఖరారు కావొచ్చని భావిస్తున్నారు. ఇదే ఉద్రిక్తతల్ని తగ్గించడంతో, చమురు సరఫరా వ్యవస్థలో కూడా అంతరాయాలు తొలగిపోతాయన్న అంచనాలు పెరిగాయి. దీంతో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పడిపోయాయి.ఇంకా ఎన్నికలకు ముందే ట్రంప్ దీనిపై కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. ఇరాన్ ఒక ఒప్పందాన్ని కోరుకుంటోందని, తాము కూడా అందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాజాగా ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో సైనిక చర్యల కంటే ముందుగా దౌత్య మార్గాల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని చూస్తున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. యుద్ధాన్ని ముగించేందుకు ఖతార్ కూడా మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఇటు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, సౌదీ, యూఏఈ, కువైట్, ఇరాక్ దేశాల ముడి చమురు ఎగుమతులన్నీ కలిపి అక్టోబరులో 10 శాతం పెరిగి రోజుకు 15.53 మిలియన్ బ్యారెళ్లకు చేరడం కూడా ధరల తగ్గుదలకు కారణమైంది. ఇదే మరిన్ని రోజులు కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.



దూసుకెళ్లిన అమెరికా స్టాక్ మార్కెట్లు

మధ్యంతర ఎన్నికల ఫలితాల ప్రభావం అమెరికా స్టాక్ మార్కెట్లపైనా పడింది. ఏఐ, సెమీకండక్టర్, డేటా సెంటర్ బేస్డ్ స్టాక్స్ పతనమైనా సంప్రదాయ ఐటీ/టెక్, ఇతర రంగాల షేర్లు దూసుకెళ్లాయి. దీంతో స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయి. ఎస్ అండ్ పీ 500 119.81 పాయింట్లు (1.58 శాతం) పెరిగి 7688.73 వద్ద స్థిరపడింది. నాస్‌డాక్ కాంపోజిట్ 366.26 పాయింట్లు (1.44 శాతం) పెరిగి 25736.51 పాయింట్లకు చేరింది. డో జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజి ఇండెక్స్ 1575.38 పాయింట్లు (3.04 శాతం) పెరిగి 53,362.57 వద్ద సెషన్ ముగించింది.

భారత్‌కు గుడ్‌న్యూస్‌చెప్పినఇరాన్.. పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ..

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్– అమెరికా మధ్య యుద్ధ వాతావరణం అలాగే ఉంది. అటు ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధిలో ఆంక్షలు అమలులోనే ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ఇరాన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం అవుతోంది. హార్మూజ్ జలసంధిని దాటడం కోసం కొన్ని దేశాలకు ఇరాన్ పర్మిషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ లిస్టులో భారత్ కూడా ఉంది. భారత్ తో పాటు చైనా, ఇరాక్, ఖతార్ తదితర దేశాలకు ప్రత్యేక మినహాయింపు ఇచ్చినట్లు ఇరాన్ కు చెందిన లా మేకర్ అమిర్ హయత్ మొఘద్దామ్ పేర్కొన్నారు. ఈ నాలుగు దేశాలకు చెందిన నౌకలు హార్మూజ్ జలసంధి గుండా ఇప్పుడు ఉచితంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా వెళ్లొచ్చిని స్పష్టం చేశారు. అటు అమెరికా కూడా ఈ దేశాల నౌకలను అడ్డుకునే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. “ మేము ప్రస్తుతం భారత్, చైనా, ఇరాక్, ఖతార్ దేశాలను హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు అనుమతించాం. దాంతో హార్మూజ్ జలసంధి గుండా ఈ నౌకలు ఎలాంటి నిర్భంధం లేకుండా వెళ్లవచ్చు. అటు అమెరికా కూడా ఈ నౌకల విషయంలో అడ్డురాదు” అని ఇరాన్ లా మేకర్, ఇరాన్ పార్లమెంట్ కు చెందిన డిప్యూటీ చైర్మన్ అమిర్ హయత్ మొఘద్దామ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇరాన్ కు చెందిన స్టూడెంట్స్ న్యూస్ ఏజెన్సీకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు. ఈ దేశాల విషయంలో ఇరాన్ కు ఆసక్తి కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే భారత్ నుంచి ఔషధాల దిగుమతిని సులభతరం చేసేందుకు.. ఇక చైనా నుంచి రాజకీయ మద్దతు పొందడానికి ఈ చర్యలు చేపట్టినట్లు అమీర్ హయత్ వెల్లడించారు. ఇక ప్రస్తుతం ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గంగా ఉన్న హార్మూజ్ జలసంధిలో నౌకాయానంపై ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మిగతా దేశాలను పక్కనపెట్టి భారత్ తో పాటు మిత్రదేశాల నౌకలకు ఇరాన్ ప్రత్యేక మినహాయింపు ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గాల గుండా రవాణా అయ్యే చమురులో దాదాపు 20 శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతోంది. ఇక భారత్ తన అవసరాల కోసం దిగుమతి చేసుకునే ముడి చమురులో అత్యధిక శాతం ఈ హార్మూజ్ జలసంధి గుండానే రవాణా జరుగుతుంది.

“చెన్నైలో సుప్రీంకోర్టు బెంచ్..” ప్రధాని మోడీకి విజయ్ కీలక డిమాండ్



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ఉత్తరాదికీ, దక్షిణాదికీ మధ్య గ్యాప్ పెరుగుతుందన్న ఆరోపణలు ఇప్పటికే ఉన్నాయి. ముఖ్యంగా పార్లమెంట్, సుప్రీంకోర్టు, ఇతర సంస్థలన్నీ ఢిల్లీలో కేంద్రీకృతం చేసుకుంటే, దక్షిణాది రాష్ట్రాలకు అవి అందుబాటులో లేకుండా పోతున్నాయన్న ఆందోళన ఇక్కడి నేతల్లో కనిపిస్తుంటుంది. ఇదే క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్.. ఇప్పుడు ఇలాంటిదే ఓ వాదనను తెరపైకి తెచ్చారు. ఈ మేరకు ప్రధాని మోడీ ముందు విజయ్ కీలక డిమాండ్ పెట్టారు. సుప్రీంకోర్టు ఢిల్లీలో ఉండటం వల్ల దక్షిణాది రాష్ట్రాల నుంచి కక్షిదారులు ప్రతీసారీ హస్తినకు వెళ్లాల్సి రావడం ఇబ్బందిగా మారిందని సీఎం విజయ్.. ప్రధాని మోడీ దృష్టికి తెచ్చారు. కాబట్టి చెన్నైలో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయ్ ప్రధాని మోదీకి ఓ లేఖ రాశారు. ఇది తమిళనాడు యొక్క దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ అని ఇందులో గుర్తుచేశారు. దీన్ని మొదటిసారిగా 1980లో లేవనెత్తారని విజయ్ తన లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 130ను ఈ సందర్భంగా ప్రధానికి రాసిన లేఖలో విజయ్ ప్రస్తావించారు. దక్షిణ భారతదేశంలోని వ్యాజ్యదారులు పరిష్కారం కోసం న్యూఢిల్లీకి ప్రయాణించవలసి వస్తోందని, చెన్నైలో బెంచ్ ఏర్పాటు చేయడం వల్ల అన్ని దక్షిణ రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుందని విజయ్ తెలిపారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులు, లా కమిషన్ నివేదికలు , దేశ సమాఖ్య స్వరూపాన్ని ఉటంకిస్తూ, ఈ విషయంపై సుప్రీంకోర్టు తన వైఖరిని పునఃపరిశీలించేలా ప్రధానిని కోరాలని సీఎం విజయ్ ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి మరి.

“సుప్రియా చూసుకుంటారు.. ఇక మీరు విశ్రాంతి తీసుకోండి”

అనారోగ్యంతో బాధపడుతున్న శరద్ పవార్‌ను ఫోన్ చేసి పలకరించిన మోదీ...దేశ బాధ్యతలను సుప్రియా చూసుకుంటుందని ప్రధాని అన్నట్లు పార్టీలవర్గాలసమాచారం...దీంతో ఎన్సీపీవర్గాలవిలీనం, సుప్రియాసూలేకు కేంద్రమంత్రివర్గంలోచోటువంటిఅంశాలపై ఊహాగానాలు



మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి పవార్ కుటుంబం చుట్టూ చర్చ మొదలైంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేయడం ఆసక్తికర పరిణామాలకు దారితీసింది. ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే ప్రస్తావన రావడం రాజకీయ వర్గాల్లో మరింత చర్చకు కారణమైంది. “సుప్రియా సిద్ధంగా ఉన్నారు. దేశ బాధ్యతలను ఆమె చూసుకుంటారు. మీరు విశ్రాంతి తీసుకోండి” అని మోదీ చెప్పినట్లు శరద్ పవార్ సన్నిహితుడు విఠల్ మణియార్ వెల్లడించారు. దీంతో ఎన్సీపీ వర్గాల విలీనం, సుప్రియా సూలేకు కేంద్ర మంత్రివర్గంలో చోటు వంటి అంశాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి.శరద్ పవార్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు బుధవారం ఉదయం మోదీ ఫోన్ చేసినట్లు మణియార్ తెలిపారు. ఇటీవల దగ్గు, ఛాతీ నొప్పితో నవంబర్ 2న పుణెలోని రూబీ హాల్ క్లినిక్‌లో పవార్ చేరారు. అక్కడ వైద్య పరీక్షలు పూర్తయ్యాక డిశ్చార్జ్ అయ్యారు. అనంతరం ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో తదుపరి పరీక్షల కోసం చేరారు. మోదీ ఫోన్‌లో విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు మణియార్ చెప్పారు.2023లో అజిత్ పవార్ తిరుగుబాటుతో ఎన్సీపీ రెండు వర్గాలుగా విడిపోయింది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో అజిత్ వర్గం కొనసాగింది. 2026 జనవరిలో విమాన ప్రమాదంలో అజిత్ మరణించడంతో విలీన చర్చలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆయన భార్య సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఇటీవల అజిత్ వర్గానికి చెందిన నేతలు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమవడం కూడా చర్చకు దారితీసింది.ముంబయిలో జరిగిన కోర్ కమిటీ సమావేశం అనంతరం రెండు వర్గాల విలీనానికి అవకాశం లేదని మహారాష్ట్ర ఎన్సీపీ అధ్యక్షుడు సునీల్ తట్కరే ప్రకటించారు. సునేత్ర పవార్ నాయకత్వంలోనే పనిచేస్తామని స్పష్టం చేశారు. అయితే అమిత్ షాతో జరిగిన సమావేశంలో విలీన అంశం ప్రస్తావనకు వచ్చిందని తెలిపారు. మరోవైపు శరద్ పవార్ గతంలో ఎన్డీయేకు అనుకూలంగా ఉన్న ఎన్సీపీ వర్గంతో విలీనం ఉండదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మోదీ ఫోన్ రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

పులివెందులలో ఉద్రిక్తత.. రాళ్లు, సీసాలతో దాడులు ... ఒకరికి గాయాలు

వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందుల నియోజకవర్గంలో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పలు గ్రామాల్లో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

ఈ ఘటనలతో పులివెందుల పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.పులివెందుల మండలంలోని ఆర్. తుమ్మలపల్లి గ్రామంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది.


ఈ క్రమంలో జరిగిన రాళ్ల దాడిలో కృష్ణారెడ్డి అనే వైసీపీ కార్యకర్త తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా టెన్షన్ పెరిగింది.ఇదిలా ఉండగా, లింగాల మండలం పార్నపల్లెలో పోలింగ్ ఏజెంట్ల విషయంలో వివాదం చెలరేగింది. తమ ఏజెంట్లను కేంద్రంలోకి అనుమతించడం లేదని వైసీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు.

విషయం తెలుసుకొని అక్కడికి వెళ్తున్న ఎంపీ అవినాష్ రెడ్డిని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. మరోవైపు, పెద్దముడియం మండలం గుండ్లకుంటలో వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, టీడీపీ ఏజెంట్లను బయటకు పంపించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఎర్రపల్లిలో పోలీసులు ఓటర్లను అడ్డుకుంటున్నారంటూ ఆరోపణలు రావడంతో అక్కడ కూడా కొంతసేపు ఉద్రిక్తత కనిపించింది.

వరుస ఘటనల నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

ప్రకృతి చక్రాన్ని మార్చేసిన మనిషి.. వేల ఏళ్ల ప్రక్రియకు అడ్డుకట్ట!



మానవ చర్యల వల్ల సంభవిస్తున్న వాతావరణ మార్పులు భూమిపై మొదలవ్వాల్సిన ఓ కొత్త హిమయుగం ప్రారంభ దశను అడ్డుకున్నాయని ఓ తాజా అధ్యయనం సంచలన విషయాలను వెల్లడించింది. భూమి సహజంగా శీతలీకరణ దశలోకి ప్రవేశిస్తున్నప్పటికీ, మానవ ప్రేరిత గ్లోబల్ వార్మింగ్ ఆ ప్రక్రియను పూర్తిగా తిప్పికొట్టిందని ఈ పరిశోధన స్పష్టం చేసింది. ఈ ఆసక్తికర అధ్యయనం ప్రముఖ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది.కొలంబియా యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు కెనడాలోని బాఫిన్ ద్వీపంలో ఉన్న బార్న్స్ ఐస్ క్యాప్‌పై ఈ పరిశోధనలు జరిపారు. ఇది ఒకప్పుడు ఉత్తర అమెరికా ఖండాన్ని కప్పి ఉంచిన అతిపెద్ద లారెన్టైడ్ మంచు పలకకు చివరి అవశేషం. శాస్త్రవేత్తలు మంచు కింద వేల ఏళ్లుగా భద్రంగా ఉన్న పురాతన మొక్కలపై రేడియోకార్బన్ డేటింగ్ పరీక్షలు నిర్వహించారు. తద్వారా గత కొన్ని వేల సంవత్సరాలుగా ఆ మంచు పొర ఎలా విస్తరించిందో, ఎలా తగ్గిందో విశ్లేషించారు.వారి పరిశోధన ప్రకారం.. సుమారు 3,000 సంవత్సరాల క్రితం ఈ మంచు పొర అత్యంత కనిష్ఠ స్థాయికి చేరుకుంది. ఆ తర్వాత, భూమి సహజ కక్ష్యా చక్రాల కారణంగా వేసవికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గి, మంచు పేరుకుపోవడం మొదలైంది. దీంతో సుమారు 2,000 సంవత్సరాల క్రితం నుంచి ఈ మంచు పొర నెమ్మదిగా విస్తరించడం ప్రారంభించింది. ఈ సహజ ప్రక్రియ దాదాపు 20వ శతాబ్దం మధ్యకాలం వరకు కొనసాగింది.అయితే, 1960ల నుంచి పరిస్థితి పూర్తిగా తారుమారైంది. శిలాజ ఇంధనాలను విపరీతంగా మండించడం వల్ల వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల స్థాయిలు పెరిగిపోయాయి. దీంతో భూమి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగి, సహజంగా కొనసాగుతున్న శీతలీకరణ ప్రక్రియను పూర్తిగా అధిగమించాయి. ఫలితంగా వేల ఏళ్లుగా విస్తరిస్తున్న మంచు పొర వేగంగా కరగడం ప్రారంభించింది.వెంటనే ఓ భారీ హిమయుగం ముంచుకొచ్చేదని ఈ అధ్యయనం చెప్పడం లేదు. పూర్తిస్థాయి హిమయుగం ఏర్పడటానికి వేల సంవత్సరాలు పడుతుంది. కానీ, భూమి సహజ కక్ష్యా చక్రాలకు అనుగుణంగా మొదలైన ఒక దీర్ఘకాలిక ప్రక్రియను మానవ చర్యలు ఎలా అడ్డుకున్నాయో ఈ అధ్యయనం స్పష్టంగా నిరూపించింది. భూమి సహజ వాతావరణ గమనాన్ని సైతం మార్చేంత శక్తిమంతంగా మానవ ప్రేరిత మార్పులు ఉన్నాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

ఎరుపు రంగు నీరు.. రాయిలా మారుతున్న పక్షులు.. ఈ ప్రమాదకర సరస్సు గురించి తెలుసా?



ప్రకృతిలో కొన్ని ప్రాంతాలు చూడటానికి ఎంతో అందంగా ఉంటాయి. కానీ వాటి వెనుక దాగి ఉండే ప్రమాదాలు మాత్రం ఊహించలేం. అలాంటి వింత ప్రదేశమే ఆఫ్రికా దేశం టాంజానియాలోని 'నాట్రాన్' సరస్సు. దూరం నుంచి చూస్తే ఎర్రటి రంగులో మెరిసే ఈ సరస్సు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. చుట్టూ గులాబీ రంగు ఫ్లెమింగోలు గుంపులుగా కనిపిస్తాయి. అయితే ఇదే సరస్సులోని నీరు చాలా ప్రమాదకరం. సాధారణ జీవులు ఆ నీటిలోకి వెళ్తే తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. మరి ఇంతటి ప్రమాదకరమైన సరస్సు ఫ్లెమింగోలకు మాత్రం ఎలా సురక్షితమైన నివాసంగా మారింది? నీటిలో చనిపోయిన పక్షులు రాతి బొమ్మల్లా ఎందుకు కనిపిస్తాయి?

అగ్నిపర్వతాల ప్రభావంతో ఏర్పడిన సరస్సు

నాట్రాన్ సరస్సు ఉత్తర టాంజానియాలో ఉంది. సుమారు 15 లక్షల ఏళ్ల క్రితం భూగర్భంలో జరిగిన అగ్నిపర్వత విస్ఫోటనాలు, భూమి పొరల్లో వచ్చిన మార్పుల కారణంగా ఈ ప్రాంతంలో సరస్సు ఏర్పడింది. సమీపంలోనే ఒల్ డొయిన్యో లెంగాయ్ అనే చురుకైన అగ్నిపర్వతం ఉంది. మాసాయి భాషలో దీనికి 'దేవుడి పర్వతం' అని అర్థం.ఈ ప్రాంతంలోని కొండలు, భూగర్భ వేడి నీటి బుగ్గల నుంచి వివిధ లవణాలు, ఖనిజాలు సరస్సులోకి చేరుతుంటాయి. ఇందులో సోడియం కార్బోనేట్ వంటి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సరస్సుకు నీరు చేరినా బయటకు వెళ్లే నదులు, కాలువలు లేవు. వచ్చిన నీటిలో ఎక్కువ భాగం ఎండ వేడికి ఆవిరైపోతుంది. దీంతో నీటిలోని లవణాలు, ఖనిజాల సాంద్రత పెరుగుతూ ఉంటుంది.

నీరు అంత ప్రమాదకరంగా ఎందుకు మారింది?

నాట్రాన్ సరస్సులోని నీరు సాధారణ నీటిలా ఉండదు. ఇందులో క్షార గుణం చాలా ఎక్కువ. నీటి పీహెచ్ స్థాయి సుమారు 10.5 నుంచి 12 వరకు ఉండవచ్చు. అంటే అమ్మోనియా ద్రావణం తరహాలో చర్మం, కళ్లకు హాని కలిగించేంత తీవ్రంగా ఉంటుంది. సరస్సు లోతు కూడా చాలా తక్కువ. ఎండాకాలంలో నీటి ఉష్ణోగ్రత 60 డిగ్రీల సెల్సియస్ వరకు చేరుతుంది.ఇలాంటి నీటిలోకి అలవాటు లేని జంతువులు దిగితే చర్మం, కళ్లకు తీవ్ర నష్టం కలగవచ్చు. నీటిని తాగినా ప్రమాదమే. అందుకే చాలా జీవులు ఈ సరస్సుకు దూరంగా ఉంటాయి. అయితే సరస్సులోని పరిస్థితులకు అలవాటుపడిన కొన్ని సూక్ష్మజీవులు, ప్రత్యేక జాతి చేపలు మాత్రం అక్కడ జీవించగలుగుతున్నాయి.

పక్షులు రాతి బొమ్మల్లా ఎలా మారుతున్నాయి?

నాట్రాన్ సరస్సు గురించి ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరగడానికి ప్రధాన కారణం అక్కడ కనిపించే పక్షులు, గబ్బిలాల మృతదేహాల ఫొటోలు. అవి అచ్చం రాతితో చేసిన బొమ్మల్లా కనిపిస్తాయి. 2013లో ఫొటోగ్రాఫర్ నిక్ బ్రాండ్ తన 'ఎక్రాస్ ద రావేజ్డ్ ల్యాండ్' పుస్తకంలో ఈ చిత్రాలను ప్రచురించారు. దీంతో ఈ సరస్సు జంతువులను రాళ్లుగా మార్చేస్తుందనే ప్రచారం మొదలైంది.కానీ వాస్తవం అది కాదు. సరస్సులో పడిన జీవులు వెంటనే రాళ్లుగా మారిపోవు. ప్రమాదకరమైన నీరు, ఇతర కారణాలతో చనిపోయిన జీవుల మృతదేహాలపై సోడియం కార్బోనేట్, ఇతర లవణాలు పేరుకుపోతాయి. అవి మృతదేహాలను గట్టిపరచి, కుళ్లిపోకుండా కొంతకాలం సంరక్షిస్తాయి. ఎండలో తేమ తగ్గడంతో అవి మరింత గట్టిగా మారతాయి. అందుకే రాతి విగ్రహాల్లా కనిపిస్తాయి.ఈ జీవులు ఎలా చనిపోయాయనే విషయం మాత్రం పూర్తిగా స్పష్టంగా తెలియదు. నీటి ఉపరితలం అద్దంలా మెరవడం వల్ల పక్షులు దాన్ని నేలగా భావించి కిందికి దిగే క్రమంలో ప్రమాదానికి గురై ఉండవచ్చని ఒక అంచనా ఉంది. అయితే దీనికి నిర్ధారిత ఆధారాలు లేవు.

ప్రపంచంలోనే అత్యధిక మంచు కురిసే నగరం ఇదే



ప్రపంచంలో అత్యధికంగా మంచు కురిసే నగరం ఏది? అని ప్రశ్నిస్తే, జపాన్‌లోని ఆమోరి నగరం పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఉత్తర జపాన్‌లోని ఆమోరి ప్రిఫెక్చర్‌కు రాజధాని అయిన ఈ నగరం, ఏటా సగటున 6 నుంచి 7 మీటర్ల (దాదాపు 23 అడుగులు) మంచుపాతాన్ని నమోదు చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.జపాన్‌లోని ప్రధాన ద్వీపమైన హోన్షుకు ఉత్తర కొనలో ఆమోరి నగరం ఉంది. శీతాకాలంలో సైబీరియా నుంచి వీచే అత్యంత చల్లని గాలులు, జపాన్ సముద్రం మీదుగా ప్రయాణిస్తాయి. ఈ క్రమంలో సముద్రంలోని తేమను గ్రహించి, ఈ ప్రాంతంలోని పర్వతాలను ఢీకొన్నప్పుడు భారీగా మంచు రూపంలో కురుస్తాయి. ఇదే ఆమోరిలో ఇంతటి హిమపాతానికి ప్రధాన కారణం. 2020 నుంచి 2024 మధ్యకాలంలో ఆమోరిలో సగటున ఏటా 505.6 సెంటీమీటర్ల మంచు కురిసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇది సమీప నగరాలైన అసహికావా, సపోరో కంటే కూడా ఎక్కువ. ఇంతటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ, ఇక్కడ జనజీవనం ఎక్కడా ఆగదు.ప్రభుత్వం అత్యాధునిక యంత్రాల సహాయంతో నిరంతరం మంచును తొలగిస్తూ రహదారులను, రవాణా వ్యవస్థను అందుబాటులో ఉంచుతుంది. దీంతో ప్రజలు తమ రోజువారీ కార్యకలాపాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగిస్తారు.

కొత్త అధ్యయనం...భూమిపైకి జీవం అంతరిక్షం నుంచి రాలేదా?

అనంతమైన విశ్వంలో భూమి ఒక్కటే జీవం ఉన్న గ్రహమా? అసలు మన గ్రహంపై జీవం ఎలా పుట్టింది? కోట్లాది సంవత్సరాల క్రితం భూమిపైకి దూసుకొచ్చిన తోకచుక్కలే జీవానికి అవసరమైన ముడి పదార్థాలను తీసుకొచ్చాయా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతున్న శాస్త్రవేత్తలకు తాజాగా ఓ పరిశోధన కొత్త ఆలోచనలను ముందుకు తెచ్చింది. భూమిపై జీవం ఆవిర్భావానికి తోకచుక్కలే కారణమన్న దీర్ఘకాలిక సిద్ధాంతంపై సందేహాలు వ్యక్తం చేసింది. అంతేకాదు.. జీవానికి అవసరమైన రసాయనాలు భూమిపైనే ఏర్పడి ఉండొచ్చని అభిప్రాయపడింది. మరి ఇన్నాళ్లూ శాస్త్రవేత్తలు నమ్మిన సిద్ధాంతంలో ఉన్న లోపాలేంటి? కొత్త పరిశోధన చెబుతున్న విషయాలేంటి?

తోకచుక్కలే జీవానికి బీజం వేశాయా?

భూమిపై జీవం ఎలా మొదలైందన్నది శాస్త్రవేత్తలకు ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నే. అయితే ఒకప్పుడు భూమిపై జీవం ఆవిర్భావానికి అవసరమైన కార్బన్, నైట్రోజన్ వంటి మూలకాలు అంతరిక్షం నుంచి వచ్చి ఉండొచ్చని భావించారు. ముఖ్యంగా తోకచుక్కలు వీటిని భూమికి చేరవేసి ఉంటాయని ఓ సిద్ధాంతం ప్రతిపాదించింది. మంచు, ధూళి, కార్బన్ సమ్మేళనాలతో కూడిన ఈ ఖగోళ వస్తువులు ఆదిమ భూమిని ఢీకొన్నప్పుడు జీవానికి అవసరమైన సేంద్రియ అణువులు ఇక్కడికి చేరి ఉంటాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఈ భావనలే జీవానికి అవసరమైన పదార్థాలు అంతరిక్షం నుంచి వచ్చాయనే సిద్ధాంతంలో భాగంగా చూస్తారు.

ఢీకొన్నప్పుడు ఏమవుతుంది?

అయితే కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ వాదనను పరీక్షించారు. తోకచుక్కలు భూమిని ఢీకొన్నప్పుడు వాటిలోని సున్నితమైన సేంద్రియ అణువులు సురక్షితంగా భూమిపైకి చేరగలవా? అన్నది పరిశీలించారు. ఈ క్రమంలో ఢీకొనే సమయంలో ఏర్పడే విపరీతమైన వేడి, పీడనంపై దృష్టి సారించారు. వాటి ప్రభావానికి లోనైతే జీవానికి అవసరమైన సున్నితమైన అణువులు నాశనమయ్యే ప్రమాదం ఉందని గుర్తించారు. అంటే తోకచుక్కలు మోసుకొచ్చిన పదార్థాలు భూమిపై జీవానికి బీజం వేయడం అంత సులభం కాదన్నమాట. ఈ పరిశోధన ఫలితాలు 'సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

అరుదైన పరిస్థితుల్లోనే సాధ్యం!

పరిశోధనకు నేతృత్వం వహించిన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ రిచర్డ్ ఆస్లో కీలక విషయాన్ని వెల్లడించారు. తోకచుక్కల ద్వారా జీవానికి



అవసరమైన పదార్థాలు భూమికి చేరడం పూర్తిగా అసాధ్యమని చెప్పలేమని స్పష్టం చేశారు. అయితే అందుకు ఎన్నో అనుకూల పరిస్థితులు ఒకేసారి కలవాలని వివరించారు. తోకచుక్క సరైన వేగంతో, సరైన కోణంలో భూమిని ఢీకొనాలి. ఆ తర్వాత కూడా అవసరమైన రసాయనాలు తగిన మోతాదులో ఉండాలి. జీవం ఏర్పడేందుకు అనుకూలమైన రసాయన ప్రక్రియలు వేగంగా సాగాలి. ఇన్ని అంశాలు కలిసి రావడం చాలా అరుదని, పది లక్షల్లో ఒకసారి జరిగే ఘటనలా భావించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

గ్రహశకలాల పాత్రపై కొత్త అశలు

తోకచుక్కల సిద్ధాంతంపై సందేహాలు పెరగడంతో శాస్త్రవేత్తలు మరో అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. అదే గ్రహశకలాలు (ఆస్టరాయిడ్లు). ఆదిమ భూమిపై ఇవి తోకచుక్కల కంటే ఎక్కువగా ఢీకొన్నాయి. అంతేకాదు.. వాటి ప్రభావం తోకచుక్కల ఢీకొట్టడాలతో పోలిస్తే తక్కువ విధ్వంసకరంగా ఉండే అవకాశం ఉంది. అందువల్ల జీవానికి అవసరమైన కొన్ని రసాయన పదార్థాలను గ్రహశకలాలు భూమికి చేరవేసి ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. మరో అవకాశం ఏంటంటే.. జీవానికి అవసరమైన రసాయన పదార్థాలు భూమిపైనే ఏర్పడి ఉండొచ్చు.

అంగారకుడిపైనా ఇదే పరిస్థితా?

ఈ పరిశోధనలో శాస్త్రవేత్తలు అంగారక గ్రహంపైనా దృష్టి సారించారు. అక్కడ కూడా తోకచుక్కల ఢీకొట్టడాల ద్వారా జీవానికి అవసరమైన పదార్థాలు చేరడం అంత సులభం కాదని అంచనా వేశారు. ఒకవేళ భూమిపై ఈ ప్రక్రియ జరగడం ఇంత అరుదైతే అంగారకుడిపై కూడా జరిగి ఉండే అవకాశాలు తక్కువేనని డాక్టర్ ఆస్లో పేర్కొన్నారు.

భారతదేశంలో నిప్పులు చెరుగుతున్న ఏకైక అగ్నిపర్వతం

చాలా దేశాల్లో మహా విపత్తులకు, అనేక వాతావరణ మార్పులు అగ్నిపర్వతాలు ప్రధాన కారణంగా ఉంటాయి. అగ్నిపర్వత్పం విస్ఫోటనం అయ్యి..ఇళ్ల మీదకు లావా పొంగడం, గాలి కలుషితం అవడం, చాలా మంది ప్రాణాలు కోల్పోవడం చాలా సందర్భాల్లో వార్తల్లో మనం చూస్తుంటాం. ఇండోనేషియా, జపాన్, ఇటలీ ఇలీ విదేశాల్లో ఉండే అగ్నిపర్వతాల గురించే మనం ఎక్కువగా విని ఉంటాం..కానీ మనదేశంలో అగ్నిపర్వతం బద్దలవడం అయ్యి పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారనే వార్తలు ఎప్పుడూ వినలేదు కాబట్టి ఇక్కడ అసలు అగ్నిపర్వతాలు లేవు అని చాలామంది అనుకుంటారు.

ఈ భూమి మీద 1500కి పైగా అగ్నిపర్వతాలు ఉండగా,మన దేశంలో ఏకంగా 7 అగ్నిపర్వతాలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఇప్పటికీ నిప్పులు చెరుగుతున్న సజీవ(యాక్టివ్) అగ్నిపర్వతం కూడా. ఎప్పుడైనా విస్ఫోటనం చెందే ప్రమాదం ఉన్న లావా పొరలతో కూడిన ఆ అగ్నిపర్వతం ఎక్కడుందో, దాని వివరాలు ఏంటో ఇక్కడ చూడండి. పక్క రాష్ట్రంలో భర్త జాబ్..మరిది ప్రైవేట్ పార్ట్ కొరికిన వదిన..55 కుట్లు పడ్డాయ్

అందమైన బీచ్ లు ఉన్న ప్రదేశంలో..

అందమైన సముద్ర తీరాలకు, ఆహ్లాదకరమైన వాతావరణానికి కేరాఫ్ అడ్రస్ అయిన అండమాన్ నికోబార్ దీవుల్లోనే ఈ అగ్నిపర్వతం దాగి ఉంది. అండమాన్ రాజధాని శ్రీ విజయపురం (పోర్ట్ బ్లెయిర్) కు ఈశాన్యంగా సుమారు 138 కిలోమీటర్ల దూరంలో సముద్రం మధ్యలో బారెన్ ఐలాండ్ అనే దీవి ఉంది. దక్షిణాసియా మొత్తంలో ఉన్న ఏకైక క్రియాశీల అగ్నిపర్వతం ఇదే కావడం విశేషం. సుమారు 3 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ ద్వీపం ఎక్కువగా బూడిద, అగ్నిపర్వత శంకువులతో కప్పబడి ఉంటుంది. ఇది ఇండియన్, పెర్మియన్ టెక్టోనిక్ ప్లేట్ల కలయిక వద్ద ఏర్పడింది.

చరిత్ర - విస్ఫోటనాలు

అధికారిక రికార్డుల ప్రకారం.. ఈ అగ్నిపర్వతం మొదటిసారిగా 1787లో బద్దలైంది. ఆ తర్వాత సుదీర్ఘ విరామాలతో 1991, 2005, 2017, ఇటీవల 2022లో కూడా చిన్న తరహా విస్ఫోటనాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా



1991లో జరిగిన విస్ఫోటనం అక్కడి పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపింది. పేరుకు తగ్గట్టుగానే బారెన్ (బంజరు,ఖాళీ) ద్వీపంలో మనుషులెవరూ నివసించరు. కానీ ఆశ్చర్యకరంగా ఈ కఠినమైన వాతావరణంలోనూ కొన్ని జాతుల మేకలు, ఎలుకలు, పావురాలు జీవిస్తున్నాయి. గతంలో బంగాళాఖాతంలో జరిగిన ఏదైనా ఓడ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మేకలు ఇక్కడికి చేరుకుని ఉంటాయని, అగ్నిపర్వత వాలులో ఊరే మంచినీటి బుగ్గల ఆధారంగా అవి ప్రాణాలు నిలుపుకుంటున్నాయని శాస్త్రవేత్తల అంచనా.

పర్యాటకులు అక్కడికి వెళ్లొచ్చా?

మా కంపెనీలో ఎందుకు పని చేయాలనుకుంటున్నారు? అభ్యర్థి ఆన్సర్ తో నెట్టింట రచ్చ.. హ్యాటకులు షిఫ్ లు లేదా బోట్లలో ఈ ద్వీపం చుట్టూ ప్రయాణిస్తూ, సురక్షితమైన దూరం నుంచి అగ్నిపర్వతం పొగలు కక్కడాన్ని కనులారా వీక్షించవచ్చు. కానీ ద్వీపం నేల మీద అడుగుపెట్టడం మాత్రం పూర్తిగా నిషేధం. అగ్నిపర్వతం ఎప్పుడైనా బద్దలయ్యే ప్రమాదం ఉన్నందున పర్యాటకుల భద్రత దృష్ట్యా అధికారులు ఈ నిషేధాన్ని విధించారు.

ప్రమాదం తెచ్చిన ప్రయోగం.. సముద్ర రహస్యాలను ఛేదించిన రబ్బర్ బొమ్మలు



ఒక ప్రమాదం కొన్నిసార్లు ఊహించని శాస్త్రీయ ఆవిష్కరణలకు దారితీస్తుంది. సరిగ్గా 34 ఏళ్ల క్రితం సముద్రంలో కలిసిపోయిన వేలాది రబ్బర్ బొమ్మలు, ఇప్పటికీ సముద్ర గర్భంలోని ప్రవాహాల గురించి కీలక సమాచారాన్ని అందిస్తూ శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఈ సంఘటన సైన్స్‌కు అందిన ఒక అనూహ్య వరంగా నిలిచిపోయింది.వివరాల్లోకి వెళితే.. 1992 జనవరిలో హాంకాంగ్ నుంచి వాషింగ్టన్‌లోని టాకోమాకు ఒక కార్గో షిప్ ప్రయాణిస్తోంది. ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో ప్రయాణిస్తున్నప్పుడు పెద్ద తుపాను కారణంగా ఓడలోని 12 షిప్పింగ్ కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. వాటిలో ఒక కంటైనర్ పగిలి, అందులో ఉన్న 28,800 రబ్బర్ ఆటబొమ్మలు నీటిలో కలిసిపోయాయి.వీటిలో పసుపు రంగు బాతులు, ఎరుపు రంగు నీటి కుక్కలు, ఆకుపచ్చ కప్పలు, నీలం తాబేళ్లు ఉన్నాయి. 'ఫ్రెండ్లీ ఫ్లోటీస్'గా పిలిచే ఈ బొమ్మలకు రంధ్రాలు లేకపోవడంతో అవి తేలికగా నీటిపై తేలుతూ ప్రయాణాన్ని ప్రారంభించాయి.అదే ఏడాది చివరిలో ఈ బొమ్మలు మొదటిసారిగా అలాస్కా తీరానికి కొట్టుకువచ్చాయి. ఈ విషయాన్ని గమనించిన సముద్ర శాస్త్రవేత్తలు కర్టిస్ ఎబ్బెస్‌మేయర్, జేమ్స్ ఇంగ్రాహం దీనిని ఒక గొప్ప అవకాశంగా గుర్తించారు. సముద్ర ఉపరితల ప్రవాహాలను అధ్యయనం చేయడానికి ఇది సరైన సమయమని భావించారు. సముద్ర తీరాల్లో తిరిగే వారి సహాయంతో ఎక్కడెక్కడ ఈ బొమ్మలు దొరుకుతున్నాయో సమాచారం సేకరించడం ప్రారంభించారు.ఆ తర్వాత ఈ బొమ్మల ప్రయాణం అద్భుతంగా సాగింది. వేలాది కిలోమీటర్లు ప్రయాణించి కొన్ని హవాయికి, మరికొన్ని అమెరికా అట్లాంటిక్ తీరానికి చేరుకున్నాయి. ఆశ్చర్యకరంగా కొన్ని బొమ్మలు ఆర్కిటిక్ మంచులో ఏళ్లపాటు చిక్కుకుపోయి, ఆ తర్వాత మంచు కరిగాక బయటపడి యునైటెడ్ కింగ్‌డమ్, ఐర్లాండ్, కెనడా తీరాలకు చేరాయి. ఈ బొమ్మల ప్రయాణ మార్గాల ఆధారంగా సేకరించిన డేటా, సముద్రపు సుడిగుండాలు, సముద్రంలోని వ్యర్థాలు ఎలా ప్రయాణిస్తాయో అర్థం చేసుకునేందుకు రూపొందించిన మోడళ్లను మెరుగుపరచడానికి ఎంతగానో ఉపయోగపడింది.ఈ సంఘటన జరిగి మూడు దశాబ్దాలకు పైగా గడిచిపోయినప్పటికీ, ఇప్పటికీ అప్పుడప్పుడు ఈ బొమ్మలు ఎక్కడో ఒకచోట ఒడ్డుకు కొట్టుకువస్తూనే ఉన్నాయి. చాలా వరకు బొమ్మలు శిథిలమైపోయినా, ఈ ప్రమాదవశాత్తూ జరిగిన ప్రయోగం మాత్రం సముద్ర శాస్త్ర పరిశోధనలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

పేపర్ స్ట్రాలే ప్లాస్టిక్ కంటే ప్రమాదకరమా? తాజా అధ్యయనంలో సంచలన విషయాలు

ప్లాస్టిక్ స్ట్రాల వల్ల పర్యావరణానికి ముప్పు అని భావించి.. వాటి స్థానంలో పేపర్ స్ట్రాలను వాడుతున్నారా? అయితే ఓసారి ఆలోచించాల్సిందే! పర్యావరణహితమని భావిస్తున్న పేపర్ స్ట్రాల వల్ల కూడా సమస్యలు తలెత్తుతున్నాయని దక్షిణ కొరియాలో నిర్వహించిన తాజా అధ్యయనం వెల్లడించింది. కొన్ని పర్యావరణ ప్రభావాల విషయంలో ఇవి సంప్రదాయ ప్లాస్టిక్ స్ట్రాల కంటే ఎక్కువ హాని కలిగిస్తున్నట్లు గుర్తించింది.

క్యాన్సర్ ప్రభావ సూచికలో 6.33 రెట్లు ఎక్కువ

దక్షిణ కొరియా వాతావరణ, ఇంధన, పర్యావరణ మంత్రిత్వ శాఖ ఈ అధ్యయనాన్ని చేయించింది. పీపుల్స్ పవర్ పార్టీ ఎంపీ కిమ్ వి-సాంగ్ అక్టోబర్ 21న దీని వివరాలను వెల్లడించారు. సంప్రదాయ ప్లాస్టిక్, పేపర్, జీవ విచ్ఛిన్నమయ్యే ప్లాస్టిక్, మొక్కల ఆధారిత పాలిథిలీన్ స్ట్రాల ప్రభావాలను పరిశోధకులు పోల్చారు. తయారీ నుంచి వినియోగం, వ్యర్థాల తొలగింపు వరకు మొత్తం జీవిత చక్రాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో పేపర్ స్ట్రాల క్యాన్సర్ కారక ప్రభావ సూచిక ప్లాస్టిక్ స్ట్రాలతో పోలిస్తే 6.33 రెట్లు ఎక్కువగా నమోదైంది.

పేపర్ స్ట్రాల కంటే మరో రకం మరింత ప్రమాదకరం

మొక్కల నుంచి తయారు చేసే బయో-బేస్డ్ పాలిథిలీన్ (బయో-పీఈ) స్ట్రాల ప్రభావ సూచిక ప్లాస్టిక్‌తో పోలిస్తే 16.18 రెట్లు ఎక్కువగా ఉంది. జీవ విచ్ఛిన్నమయ్యే ప్లాస్టిక్ స్ట్రాల్లో ఈ సూచిక 3.34 రెట్లుగా నమోదైంది. అయితే ఇవి స్ట్రాలను ఉపయోగించే వ్యక్తులకు నేరుగా క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని సూచించే గణాంకాలు కావు. ఉత్పత్తుల తయారీ, వినియోగం, వ్యర్థాల నిర్వహణ సమయంలో వెలువడే ఉద్గారాల ఆధారంగా అంచనా వేసిన ప్రభావాలు మాత్రమే.

రీసైక్లింగ్ చేయడంలోనూ ఇబ్బందులే



స్ట్రాలు ఏ పదార్థంతో తయారైనా వాటిని రీసైక్లింగ్ చేయడం కష్టమేనని అధ్యయనం పేర్కొంది. వాటి చిన్న పరిమాణం కారణంగా వ్యర్థాల వేర్పాటు కేంద్రాల్లో గుర్తించి వేరు చేయడం కష్టమవుతోంది. పూతలు, అంటుకునే పదార్థాలు కూడా రీసైక్లింగ్‌కు అడ్డంకిగా మారుతున్నాయి. అందుకే స్ట్రాల పదార్థాన్ని మార్చడం ఒక్కటే పరిష్కారం కాదని పరిశోధకులు సూచించారు. దుకాణాల్లో అడగకుండానే డిస్పోజబుల్ స్ట్రాలు ఇవ్వకుండా, వినియోగదారులు కోరినప్పుడు మాత్రమే అందించాలని సిఫారసు చేశారు.

బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో బాలీవుడ్ హీరోలకు బెదిరింపులు.. బెంగళూరు టెక్కీ అరెస్ట్

బాలీవుడ్ నటులను లక్ష్యంగా చేసుకుని, గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న ఓ ఐటీ ఇంజనీర్‌ను ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు వైభవ్ మిశ్రాను బుధవారం బెంగళూరులో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. గత కొంతకాలంగా ఆయుష్మాన్ ఖురానా, తుషార్ కపూర్ సహా పలువురు బాలీవుడ్ ప్రముఖులకు ఇతను బెదిరింపు ఈమెయిళ్లు, ఆడియో సందేశాలు పంపుతున్నట్లు గుర్తించారు.పోలీసుల కథనం ప్రకారం, వైభవ్ మిశ్రా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తిగా నటిస్తూ నటులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. నటుడు ఆయుష్మాన్ ఖురానాకు ఆడియో సందేశం పంపి కోట్లాది రూపాయలు డిమాండ్ చేశాడు. అంతకుముందు, నటుడు తుషార్ కపూర్‌కు కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడైన హ్యారీ బాక్సర్ పేరుతో బెదిరింపు సందేశం పంపాడు. అందులో రూ. 5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే, ప్రాథమిక దర్యాప్తులోనే ఆ ఆడియో సందేశం నకిలీదని పోలీసులు అనుమానించారు.ఇటీవల బాలీవుడ్‌లో నెలకొన్న భయానక వాతావరణం నేపథ్యంలో ఈ అరెస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. అక్టోబర్ 18న నటుడు సైగర్ ష్రాఫ్‌పై జరిగిన కాల్పుల ఘటన పరిశ్రమను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడికి తామే బాధ్యులమని లారెన్స్ బిష్ణోయ్ గ్రూప్ ప్రకటించుకుంది. ఆ గ్రూప్ ప్రతినిధి అనిల్ పండిట్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేస్తూ, సల్మాన్ ఖాన్‌తో సన్నిహితంగా పనిచేసే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించాడు.సల్మాన్ ఖాన్ క్షమాపణ చెప్పాలంటూ ఒక ఆడియో క్లిప్‌ను కూడా విడుదల చేశాడు. "సల్మాన్ ఖాన్, నేను చెప్పేది జాగ్రత్తగా విను. మా అన్న లారెన్స్ బిష్ణోయ్‌కు గానీ, బిష్ణోయ్ సమాజానికి గానీ నువ్వు క్షమాపణ చెప్పకపోతే, నీ ఇంట్లో కుక్కను కూడా వదిలిపెట్టం. నీ కుటుంబాన్ని మొత్తం నాశనం చేస్తాం. ఇది గుర్తుపెట్టుకో. నీకు భద్రత ఉందని, ఏమీ జరగదని అనుకోవద్దు" అని ఆ క్లిప్‌లో తీవ్రంగా హెచ్చరించాడు. ఈ వరుస ఘటనలతో అప్రమత్తమైన పోలీసులు, బెదిరింపుల కేసులను సీరియస్‌గా దర్యాప్తు చేస్తున్నారు.

ఢిల్లీలో క్లాసులో అకస్మాత్తుగా కుప్పకూలిన 9 ఏళ్ల బాలిక



ప్రస్తుతం చాలా మంది ఉరుకులు, పరుగుల జీవనం సాగిస్తున్నారు. సమయానికి తిండి తినకుండా, కంటి నిండా నిద్రలేకుండా గడిపేస్తున్నారు. కొంత మంది ఉద్యోగులు రాత్రిపూట సైతం షిఫ్ట్ లు చేస్తున్నారు. దీంతో జీవగడియారంలో అనేక మార్పులు వచ్చి కొత్త కొత్త వ్యాధుల బారిన పడుతున్నారు. చిన్న వాళ్ల నుంచి పెద్ద వారికి వరకు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురౌతున్నారు. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో చెప్పలేని సిట్యుయేషన్ ఏర్పడింది.ఈ క్రమంలో కొంత మంది అప్పటి వరకు బాగానే ఉన్నా.. ఉన్నట్టుండి కుప్పకూలిపోతున్నారు. నిల్చున్న ప్రదేశంలోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతున్నారు.తాజాగా.. ఢిల్లీలోని స్కూల్లో ఒక తొమ్మిదేళ్ల బాలిక క్లాసు జరుగుతుండగానే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి కుప్పకూలీ పడిపోయింది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. ఢిల్లీలోని మయూర్ విహార్‌లోని లవ్లీ పబ్లిక్ స్కూల్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. తొమ్మిదేళ్ల బాలిక క్లాసులో పాఠాలు వింటుంది. ఇంతలో ఆమె ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లి కుప్పకూలీ పోయింది. వెంటనే ఆమెకు కొంత మంది క్లాసులో పీసీఆర్ కూడా చేశారు. కానీ ఆ బాలికలో ఎలాంటి చలనం కూడా లేదు. దీంతో వెంటనే సిబ్బంది నిర్మాణ్ విహార్‌లోని మాలిక్ రెడిక్స్ హెల్త్ కేర్‌కు తరలించారు. ఈ క్రమంలో బాలికను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే బాలిక మృతికి గల ఖచ్చితమైన కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు విచారణ చేపట్టారు. కొంత మంది మాత్రం ఆమె గుండెపోటుతో చనిపోయినట్లు చెబుతున్నారు. దీనిపై పోస్ట్ మార్టం నివేదిక వస్తే అసలు కారణం తెలుస్తుందని వైద్యులు చెబుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

దేవుడికి దండం పెట్టి.. రెప్పపాటులో వెండి ఆభరణాలతో పరారైన కేటుగాడు



ఇటీవల కొంత మంది కష్టపడి పనిచేయకుండా చోరీల బాటపట్టారు. ముఖ్యంగా బంగారం ధరలు పెరిగిపోయాయో అప్పటి నుంచి చోరీలు మరీ ఎక్కువయ్యాయి. రోడ్ల మీద, షాపుల్లోను నిత్యం చోరీల ఘటనలు వార్తలలో ఉంటున్నాయి.కొంత మంది ఇటీవల గుళ్లకు వెళ్లి దేవుడికి దండం పెట్టుకుని మరీ చోరీలు చేస్తున్నారు. కనీసం దేవుడనే భయం, పాపపుణ్యాల ఆలోచనల కూడా లేకుండా నీచంగా ప్రవర్తిస్తున్నారు. ఈ క్రమంలో రాజస్తాన్ లోని భిల్వారా జిల్లాలో ఉన్న ఒక ఆలయంలో చోటు చేసుకున్న ఘటనకు చెందిన వీడియో వైరల్గా మారింది.రాజస్తాన్ లోని భిల్వారా జిల్లాలో స్థానిక ఆలయంలో భారీ చోరీ జరిగింది. మండల్ పీఎస్ పరిధిలో ఉన్న సాంవరియా సేఠ్ ఆలయంలో జరిగిన చోరీ ఘటన వార్తలలో నిలిచింది. సాంవరియా సేఠ్ ఆలయంలో గర్భ గుడిలో దేవుడిపై ఉన్న వెండి ఆభరణాల్ని చోరీ చేసి అక్కడి నుంచి రెప్పపాటులో అక్కడి నుంచి పరారయ్యాడు. అతగాడు ఆలయంలోకి వెళ్లి దేవుడికి ప్రదక్షిణలు చేసి, చేతులు జోడించి ప్రార్థించుకుని.. ఆ తర్వాత ఆభరణాలను దొంగిలించాడు. దేవుడి మీద ఉన్న స్వామివారి వెండి కిరీటం, వేణువు, చేతులకు ఉన్న 8 కడియాలు, కాళ్లకు ఉన్న 2 కడియాలు కలిపి సుమారు రూ.2 లక్షల విలువైన సొత్తు ఎత్తుకెళ్లాడు.ఈ ఘటనకు చెందిన దొంగ కదిలకలు అక్కడే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఆలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ వీడియో వైరల్గా మారింది.

బెంగళూరులో ఇంట్లో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తుండగా భారీ పేలుడు



మనం ఇంట్లో పనులు చేస్తుండగా ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని పెద్దలు చెబుతుంటారు. కొన్నిసార్లు అనుకోకుండా ప్రమాదాలు జరుగుతాయి. ఆ సమయంలో మనం ఏవిధంగా స్పందిస్తామో అన్నదానిపై కొన్నిసార్లు ప్రమాదాల తీవ్రత ఆధార పడి ఉంది. సరైన సమయంలో చాకచక్యంగా ప్రవర్తిస్తే ఎంత పెద్ద ప్రమాదం నుంచైన ఈజీగా బైటపడవచ్చు. తాజాగా.. బెంగళూరులో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తుండగా ఒక్కసారిగా సిలిండర్ కు మంటలు అంటుకున్నాయి. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.బెంగళూరులోని మల్లేశ్వరంలోని ఊహించని భయానక ఘటన చోటు చేసుకుంది. ఎల్పీజీ సిలిండర్ డెలీవరీ చెద్దామని కార్మికుడు సిలిండర్ తో పాటు ఇంటికి వచ్చాడు. డోర్ ముందు గ్యాస్ సిలిండర్ పెట్టాడు. ఇంతలో సిలిండర్ కు మంటలు అంటుకున్నాయి. ఆ తర్వాత గ్యాస్ లీక్ కావడంతో ఆ ప్రాంతంలో మంటలు వ్యాపించాయి. వెంటనే అరుపులు పెట్టడంతో ఇంట్లోని వారు బైటకు వచ్చి డెలివరీ బాయ్ కు బకెట్లలో నీళ్లు ఇచ్చారు. అంతే కాకుండా బట్టలతో డెలీవరీ బాయ్ మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించాడు. మొత్తంగా నీళ్లు, బట్టలు సిలిండర్ మీద వేయగా మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ప్రమాదంతో చుట్టుపక్కల వారు అలర్ట్ అయి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఫైర్ అధికారులు మంటలు చెలరేగిన ఘటన స్థలంను పరిశీలించారు. అయితే.. గోడ మీద సదరు ఇంటి ఓనర్ దీపం వెలిగించి పెట్టారని, సిలిండర్ నుంచి అప్పటికే గ్యాస్ లీక్ అవుతుండటంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ షాకింగ్ ఘటన అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. పెద్ద ప్రమాదం తప్పడంతో ఇంట్లోని వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు చెందిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారింది.

ఒంగోలులో సంచలనం... కోయంబత్తూర్ వ్యాపారులే టార్గెట్‌గా భారీ స్కెచ్..

చివరికి 2 కిలోల బంగారంతో...

ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో సినీ ఫక్కీలో దారి దోపిడీ జరిగింది. ముందుగా వేసుకున్న స్కెచ్ ప్రకారం దుండగులు కోయంబత్తూరు వ్యాపారులపై దాడి చేశారు. వారు రైలు నుంచి దిగి స్టేషన్ బయటకు రాగానే అడ్డుకుని కారులో ఎక్కించుకుని తీసుకెళ్లిపోయారు. ఎవరూ లేని ప్రాంతంలోకి తీసుకెళ్లి.. వారిపై దాడి చేసి భయాందోళనకు గురి చేశారు. వారి దగ్గరున్న రెండు కేజీల బంగారంతో ఉడాయించారు. తర్వాత వ్యాపారులు పోలీసులను ఆశ్రయించారు. జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులకు రంగంలోకి దిగారు.ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో సంచలన ఘటన చోటుచేసుకుంది. బుధవారం తెల్లవారుజామున సినీ ఫక్కీలో భారీ దారి దోపిడీ జరిగింది. పక్కా స్కెచ్‌తో దుండగులు రెచ్చిపోయారు. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అయితే దీనిపై పోలీసులు రంగంలోకి దిగి.. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.



వ్యాపారులే టార్గెట్‌గా...

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన కొందరు వ్యాపారులు తరచుగా ఒంగోలు నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. స్థానికంగా ఉన్న నగల దుకాణాలకు అవసరమైన బంగారు ఆభరణాలను వీళ్లు సప్లై చేస్తుంటారు. ఇందులో భాగంగానే వీళ్లు బుధవారం ఉదయం పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలతో రైల్లో ఒంగోలుకు చేరుకున్నారు. అయితే వ్యాపారుల కదలికల గురించి ముందే సమాచారం సేకరించిన ఒక ముఠా రైల్వే స్టేషన్ సమీపంలో మాటు వేసి.. వీరిని అడ్డుకున్నారు.వ్యాపారులు స్టేషన్ బయటకు రాగానే వారిని అడ్డగించిన దుండగులు.. బలవంతంగా కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా వారిని ఊరి వెలుపల ఉన్న జనాలు లేని ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ వ్యాపారులపై దాడి చేసి, వారి దగ్గరున్న బంగారం ఇచ్చేయాలని బెదిరించారు. ప్రాణభయంతో ఉన్న వ్యాపారులు దగ్గర నుంచి సుమారు 2 కేజీల బంగారు నగలను లాక్కుని అక్కడి నుంచి ఉడాయించారు.

ప్రత్యేక బృందాలతో గాలింపు...

దుండగులు వెళ్లిపోయిన తర్వాత భయం నుంచి తేరుకున్న బాధితులు వెంటనే ఒంగోలు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేశారు. రెండు కేజీల బంగారం చోరీకి గురి కావడంతో పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు వేగవంతం చేశారు. అంతేకాదు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్స్‌ని రంగంలోకి దించారు. నేరస్థులను గుర్తించేందుకు రైల్వే స్టేషన్‌తో పాటు నగరంలోని ముఖ్యమైన జంక్షన్ల దగ్గర, టోల్ ప్లాజాల దగ్గర ఉన్న సీసీ టీవీ కెమెరాల ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు.

అమెరికన్లే టార్గెట్...భారీ కాల్‌సెంటర్ మోసాన్ని ఛేదించిన ఈడీ

అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న భారీ ఫేక్ కాల్ సెంటర్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కుంభకోణంలో కీలకపాత్ర పోషించిన నలుగురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసింది. హర్షిల్ నయన్ భాయ్ రావల్, జస్వంత్ సింగ్, చేతన్ ముంజల్, ప్రణవ్ పిఠాడియాలను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అదుపులోకి తీసుకున్నట్లు హైదరాబాద్ లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. నిందితులను నాంపల్లిలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా, కోర్టు వారికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

ఈ కేసులో ఇప్పటికే జూలై-ఆగస్టు నెలల్లో వికాస్ నిమార్, తారాచంద్ నిమార్, మహ్మద్ ఇర్ఫాన్ అన్సారీలను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజా అరెస్టులతో ఈ కేసులో ఈడీ అదుపులోకి తీసుకున్న వారి సంఖ్య ఏడుకు చేరింది. ఈ స్కామ్‌పై దర్యాప్తులో భాగంగా సెప్టెంబర్ 15న పాటియాలా, పుణే, చండీగఢ్‌లలో ఈడీ సోదాలు నిర్వహించింది. ఆ సమయంలో సుమారు 220 మంది సిబ్బందితో నడుస్తున్న మూడు లైవ్ కాల్ సెంటర్లను గుర్తించి, పలు డిజిటల్ పరికరాలు, నగదు, రికార్డులను స్వాధీనం చేసుకుంది.

మోసం చేసే విధానం ఇది..

ఈ ముఠా పనితీరు అత్యంత వ్యవస్థీకృతంగా సాగినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. జర్మనీ, ఫిన్లాండ్‌లలోని సర్వర్ల ద్వారా సుమారు 20 లక్షల మంది అమెరికన్ల ఫోన్ నంబర్ల జాబితాను ఉపయోగించి ఆటో-డయలర్లతో కాల్స్ చేసేవారు. బాధితులకు వారి ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని లేదా వారి కంప్యూటర్‌లో వైరస్ ఉందని నమ్మించేవారు.

అనంతరం, భారత్‌లోని కాల్ సెంటర్లకు కనెక్ట్ అయ్యే టోల్-ఫ్రీ నంబర్లకు కాల్ చేయమని సూచించేవారు.కాల్ మాట్లాడే సిబ్బంది తమను డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ , డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, ట్రెజరీ వంటి అమెరికా ప్రభుత్వ సంస్థల అధికారులమని పరిచయం చేసుకునేవారు. నకిలీ ఐడీ కార్డులు, అధికారిక లేఖలు చూపించి బాధితులను భయపెట్టేవారు. డ్రగ్స్ లేదా మనీలాండరింగ్ కేసులతో సంబంధం ఉందని, అరెస్ట్ చేస్తామని, బ్యాంకు ఖాతాలు స్తంభింపజేస్తామని బెదిరించేవారు. ఈ వ్యవహారాన్ని రహస్యంగా ఉంచాలని చెప్పి, వారి డబ్బును 'ప్రభుత్వం వద్ద భద్రపరచాలి' అని నమ్మించి కొల్లగొట్టేవారు.

హవాలా, క్రిప్టో మార్గాల్లో నగదు బదిలీ

బాధితుల నుంచి బంగారం కడ్డీలు, కొరియర్లలో పంపిన నగదు, మనీ మ్యూల్ ఖాతాలకు బదిలీలు, బిట్‌కాయిన్ ఏటీఎంలలో డిపాజిట్లు, గిఫ్ట్ కార్డుల రూపంలో డబ్బును వసూలు చేశారు. అమెరికాలో సేకరించిన ఈ డబ్బును దుబాయ్, హాంకాంగ్‌లలోని కంపెనీల ఖాతాల ద్వారా, క్రిప్టో ఆస్తుల రూపంలోకి మార్చి, చివరకు హవాలా, అంగడియా మార్గాల ద్వారా భారత్‌కు తరలించినట్లు ఈడీ గుర్తించింది. ఈ ముఠా జూలై 2025 నుంచి సెప్టెంబర్ 2026 మధ్య కాలంలో 927 లావాదేవీల ద్వారా సుమారు 27.39 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 261 కోట్లు) కొల్లగొట్టినట్లు తేలింది. ఇప్పటివరకు 549 మంది బాధితులను గుర్తించగా, వారిలో చాలామంది 1940లలో జన్మించిన వృద్ధులే కావడం గమనార్హం.అరెస్ట్ అయిన ప్రణవ్ పిఠాడియా పాటియాలాలోని కాల్ సెంటర్లకు యజమానిగా, మేనేజర్‌గా వ్యవహరించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేరంలో ప్రమేయమున్న మరికొందరిని గుర్తించేందుకు, అక్రమంగా సంపాదించిన ఆస్తుల జాడను కనుగొనేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

కర్వాచౌత్‌రోజే భర్తమృతి..కోడలిపై అత్త ఆరోపణలు



భర్త ఆయురారోగ్యాలతో ఉండాలని భార్యలు కర్వా చౌత్ ఉపవాసం ఉంటారు. ఓ మహిళకు పండుగ రోజున తీరని విషాదం ఎదురైంది. విద్యుదాఘాతంతో భర్త ప్రాణాలు కోల్పోవడంతో ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. బాధలో ఉన్న ఆమెకు ఓదార్పు ఇవ్వాల్సిన కుటుంబ సభ్యులు విచిత్రంగా ఆరోపణలు చేశారు. ఉపవాసం మధ్యలో ఏమైనా తిన్నావా? అందుకే నీ భర్త చనిపోయాడంటూ ఆరోపించారు. భర్త మరణంతో దుఃఖంలో ఉన్న మహిళను మరింత కుంగదీశారు. ఈ ఘటన గురించి ఓ వైద్య విద్యార్థిని సోషల్ మీడియాలో వెల్లడించడంతో తీవ్ర చర్చ జరుగుతోంది.

విద్యుదాఘాతంతో భర్త మృతి.. ఆస్పత్రికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు

అక్టోబర్ 29న కర్వా చౌత్ పండుగ సందర్భంగా ఈ ఘటన జరిగింది. ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ విభాగంలో డ్యూటీలో ఉన్న ఎంబీబీఎస్ ఇంటర్న్ డాక్టర్ ఆకాంక్ష సింగ్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. విద్యుదాఘాతానికి గురైన ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు గుర్తించారు. భర్త మరణవార్తతో అతడి భార్య కన్నీరుమున్నీరుగా విలపించింది. కర్వా చౌత్ సందర్భంగా ఆమె భర్త క్షేమం కోసం ఉపవాసం ఉంది. అయితే ఆమె అత్త ప్రవర్తన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

ఉపవాసం విరమించావా? అందుకే ఇలా జరిగిందా?

భర్త మరణంతో బాధపడుతున్న కోడలిని ఓదార్చాల్సిన అత్త ఆమె ఉపవాసం గురించి ప్రశ్నించడం ప్రారంభించింది. 'నువ్వు కచ్చితంగా ఏదో ఒకటి తినే ఉంటావు కదా?' అంటూ నిలదీసినట్లు వైద్య విద్యార్థిని వెల్లడించింది. తాను ఏమీ తినలేదని ఆ మహిళ పదేపదే చెప్పినా అత్త ఆరోపణలు ఆపలేదని తెలిపారు. చుట్టూ ఉన్న కుటుంబ సభ్యులు కూడా ఆమెను ప్రశ్నించడంతో భర్తను కోల్పోయిన బాధలో ఉన్న మహిళ మరింతగా ఏడ్చిందని వివరించారు. కొన్ని ప్రాంతాల్లో భర్తకు ఏదైనా అపాయం జరిగినా, మరణించినా భార్య ఉపవాసం సరిగా చేయలేదనే మూఢనమ్మకంతో ఆమెనే బాధ్యురాలిగా చూస్తారని డాక్టర్ ఆకాంక్ష అన్నారు.

సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం

ఈ ఘటనను డాక్టర్ ఆకాంక్ష సింగ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకోవడంతో నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. భర్త మరణానికి విద్యుదాఘాతమే కారణమని స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ, ఉపవాసం పేరుతో భార్యను నిందించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. 'ఇప్పటికే భర్తను కోల్పోయి బాధలో ఉన్న మహిళను ఓదార్చాల్సింది పోయి, ఆమెనే నిందించడం ఎంతవరకు న్యాయం?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. '21వ శతాబ్దంలో కొందరి ఆలోచనలు 17, 18వ శతాబ్దాల్లోనే ఉన్నాయి' అని మరొకరు వ్యాఖ్యానించారు. మరికొందరు మహిళలపై సమాజం విధిస్తున్న ఆచారాలు, నమ్మకాల ఒత్తిడిని ప్రశ్నించారు. చదువుకున్న, ఆర్థిక స్వేచ్ఛ ఉన్న మహిళలు సైతం సామాజిక ఒత్తిడితో ఇలాంటి ఆచారాలను పాటిస్తున్నారని అభిప్రాయపడ్డారు.మొత్తానికి భర్త మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న మహిళను ఉపవాసం పేరుతో నిందించిన ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒక వ్యక్తి మరణానికి కారణం తెలుసుకోవాల్సింది పోయి, సంప్రదాయాల పేరుతో మహిళనే బాధ్యురాలిగా చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏఐ తో భూ వివాదాల పరిష్కారమా.. జనగామ కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం

భూ వివాదాల పరిష్కారంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భూమి హక్కులకు సంబంధించిన కేసుల్లో నిజానిజాలను పరిశీలించకుండా.. సంబంధిత వ్యక్తుల వాదనలు వినకుండా ఏఐ ఆధారంగా ఉత్తర్వులు జారీ చేయడంపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఓ భూ వివాదంలో జనగామ జిల్లా కలెక్టర్.. ఏఐ రూపొందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఆదేశాలు ఇచ్చారన్న ఆరోపణలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేస్తూ, బాధ్యుల వివరణ కోరింది.ఈ వ్యవహారంపై జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పెద్దమడూరు గ్రామానికి చెందిన మేడిపల్లి కొమురయ్య హైకోర్టును ఆశ్రయించారు. తన భూ వివాదానికి సంబంధించి ప్రత్యర్థులు సమర్పించిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ సెప్టెంబర్ 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారని పిటిషనర్ తెలిపారు. అయితే తన వాదనలను వినకుండా.. సంబంధిత భూమి రికార్డులు, వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.ఏఐ టూల్స్‌ను ఉపయోగించి ఉత్తర్వులు తయారు చేశారని.. అధికారులు తమ సొంత విచక్షణతో వ్యవహరించలేదని పిటిషనర్ తరఫు లాయర్ ఎం. మాధవరెడ్డి హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నిర్ణయం వల్ల తనకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని వాదించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్‌వి శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. ఆస్తి హక్కులు, భూములకు సంబంధించిన వివాదాల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సామాన్య ప్రజలు, రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించారు. కేవలం ఏఐతో రూపొందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఇలాంటి కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. కేసులోని వాస్తవాలను స్వయంగా పరిశీలించడం, సంబంధిత పత్రాలను అధ్యయనం చేయడం, బాధితుల వాదనలు వినడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. జనగామ కలెక్టర్ సెప్టెంబర్ 8వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జనగామ జిల్లా కలెక్టర్, దేవరుప్పుల తహసీల్దార్‌తో పాటు సంబంధిత ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేసింది. వారి వివరణలు సమర్పించాలని ఆదేశించింది. రెవెన్యూ శాఖ తరఫున హాజరైన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ హరిత.. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని కోర్టుకు తెలిపారు. రెవెన్యూ వ్యవహారాలను చూసే ప్రభుత్వ లాయర్ ఈ విషయంలో తదుపరి చర్యలపై సలహా కోరుతూ అడ్వకేట్ జనరల్ కార్యాలయాన్ని సంప్రదించినట్లు వివరించారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోయే చర్యలేమిటో వివరించాలని అడ్వకేట్ జనరల్ ఏ. సుదర్శన్ రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను కూడా కోర్టుకు తెలియజేయాలని సూచించింది.

తదుపరి విచారణను నవంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫిర్యాదుల పరిష్కారం, ఉత్తర్వుల తయారీలో ఏఐ, ఆటోమేషన్ సాధనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ కేసు తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంది. కొన్ని చోట్ల ప్రజలు సమర్పించిన ఫిర్యాదు పత్రాలకు సంబంధించిన ఫొటోలను తీసి.. ఏఐ టూల్స్ ద్వారా నమోదు చేసి.. వాటి ఆధారంగా సమాధానాలు, ఉత్తర్వుల ముసాయిదాలు తయారు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న వేళ.. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అయితే అలా రూపొందించిన సమాచారాన్ని సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించకపోతే సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పరిపాలనలో వేగం పెంచేందుకు టెక్నాలజీ ఉపయోగపడినా.. ప్రజల ఆస్తి హక్కులను ప్రభావితం చేసే నిర్ణయాల్లో అధికారుల స్వతంత్ర పరిశీలన, బాధ్యతాయుతమైన వ్యవహారం తప్పనిసరి అని ఈ ఘటన ద్వారా అర్థమవుతోంది. జనగామ భూ వివాదంపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఈ అంశంపై ప్రభుత్వ యంత్రాంగం అనుసరించాల్సిన విధానాలపై చర్చకు దారితీశాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY K.B.G.TILAK, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA, AND PUBLISHED FROM VIJAYAWADA, D.NO.28-1-22, II FLOOR, SHAIK MOHIUDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520 002. EDITOR : K.B.G.TILAK. PH : 0866 - 6620870. R.N.I.NO.APTEL/1999/1614

దామోదర-లక్ష్మీకాంత రావులపై మహేష్ గౌడ్ సీరియస్



తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ శృతిమించుతున్న గ్రూపు తగాదాలు, బాహాటంగా రచ్చకెక్కుతున్న క్రమశిక్షణా రాహిత్యంపై టీపీసీసీ నాయకత్వం గట్టిగా దృష్టి సారించింది. పార్టీ నేతల వివాదల్ను పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తోందని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలో ఉన్న వేళ నేతలు సంయమనం పాటించాల్సింది పోయి.. వ్యక్తిగత ఆధిపత్యం, నామినేటెడ్ పదవులు, నియోజకవర్గ వ్యవహారాలపై పరస్పరం దాడులకు దిగడంపై ఆయన సీరియస్ అయ్యారు. అంతర్గత క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై ఎంతటి స్థాయి నేతలైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావుల వివాదాన్ని టీపీసీసీ చీఫ్ తీవ్రమైన అంశంగా పరిగణించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా హోటల్ లాబీలో డీసీసీ అధ్యక్ష పదవి, సంస్థాగత నియామకాల విషయంలో ఇరువురి మధ్య మాటామాట పెరిగి, సహచర ఎమ్మెల్యేల ముందే బాహాబాహీకి దిగే స్థాయికి వెళ్లడం పార్టీ వర్గాల్లో పెను దుమారం రేపింది. తోటి ఎమ్మెల్యేల సమక్షంలో మంత్రి దామోదర తనపై తీవ్ర పదజాలంతో దూషణలకు దిగారని ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా వెళ్లింది. ఈ వివాదంపై పూర్తి విచారణ జరిపేందుకు బుధవారం నాడు గాంధీ భవన్‌కు స్వయంగా హాజరుకావాల్సిందిగా మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావులకు పీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు.మంత్రి, ఎమ్మెల్యే వివాద పరిష్కారం తర్వాత.. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇటీవల చోటుచేసుకున్న వరుస క్రమశిక్షణా ఉల్లంఘనలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని పీసీసీ నిర్ణయించింది. ప్రధానంగా నియోజకవర్గ నిధుల పంపిణీ, స్థానిక సంస్థల సమన్వయం, అధికార వర్గాల బదిలీల విషయంలో మంత్రులపై బహిరంగంగా గళమెత్తుతున్న అసంతృప్త ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల వ్యవహార శైలిపై పార్టీ అధిష్ఠానం నివేదికలు సిద్ధం చేస్తోంది. మునుగోడు, జుక్కల్ వంటి స్థానాల్లో సొంత పార్టీ ప్రజాప్రతినిధులే ప్రభుత్వంపై విరుచుకుపడుతుండటం, జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల నియామకాల వేళ వర్గపోరు భగ్గుమంటున్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఆయా నేతలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు హెచ్చరికలు జారీ చేయనున్నారు.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు : కేటీఆర్ ఘాటు విమర్శలు



కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు.అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

మియాపూర్ భూములు అమ్మొద్దు, పేదలకు పంచివ్వండి

మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఈరోజు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... "మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమిలో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం" అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు.ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు.

మంత్రి శ్రీధర్ బాబు టార్గెట్‌గా ఎంపీ లెటర్..

పెద్దపల్లి కాంగ్రెస్‌లో హీటెక్కిన పాలిటిక్స్



డీఎఐబ : ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమం తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య చిచ్చురాజేసింది. ఏకంగా ఓ మంత్రి.. ఎమ్మెల్యేపై బూతులతో మాటల దాడికి దిగడం హాట్ టాపిక్ అయింది. ఇదే సమయంలో పెద్దపల్లి ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని కొందరు ఎమ్మెల్యేలు ధర్నాకు హాజరుకాకపోవడంపై.. మంత్రి శ్రీధర్ బాబును టార్గెట్ చేస్తూ ఓ ఎంపీ రాసిన లేఖ అగ్గిరాజేస్తుంది.పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని కాంగ్రెస్ పార్టీలో రెండున్నరేళ్లుగా వర్గపోరు భగ్గుమంటోంది. ఢిల్లీలో జరిగిన ధర్నా తర్వాత మరోసారి రచ్చకెక్కింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు తెరపైకి వచ్చింది. పెద్దపల్లి ఎంపీ వంశీని పార్లమెంటు పరిధిలోని ఇద్దరు మంత్రులు చాలా లైట్ తీసుకుంటున్నారట. ఎమ్మెల్యేలు, మంత్రులు వంశీని అసలు ఎంపీగా కూడా ట్రీట్ చేయక పోవడమే అంతర్గత విభేధాలకు దారి తీసిందట. ఈ కారణంగానే రెండున్నరేళ్లుగా ఎంపీ వంశీకృష్ణ తన అసహనాన్ని, అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. తనకు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ అధికార యంత్రాంగంపై ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు.తనను ఎమ్మెల్యేలు, అధికారులు పట్టించుకోకపోవడనికి కారణం మంత్రి శ్రీధర్ బాబే అనేది ఎంపీ వంశీకృష్ణ అనుమానమట. అందుకే ఆయనపై విమర్శల డోస్ పెంచుతున్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్‌పోర్ట్ రావాలని తాను చేస్తున్న ప్రయత్నాలకు సొంత పార్టీ నేతలే అడ్డుపడుతున్నారంటూ ఎంపీ వంశీకృష్ణ బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ ఎంపీగా ఉండి కేంద్రమంత్రుల చుట్టూ ఎయిర్‌పోర్ట్ కోసం తాను తిరుగుతూ ఉంటే జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాత్రం నిర్లక్ష్యం చూపిస్తున్నారని ఎంపీ ఆరోపిస్తున్నారు.పెద్దపల్లికి జూ× ఆస్పత్రిని మంజూరు చేయిస్తే..ఇప్పటివరకు స్థల పరిశీలన చేసేందుకు కూడా కలెక్టర్ ఆసక్తి చూపించట్లేదని మండిపడ్డారు ఎంపీ. ఇటీవల దసరా వేడుకల సందర్భంగా గోదావరిఖనిలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ వంశీకృష్ణను పిలవలేదని..ప్రోటోకాల్ పాటించలేదంటూ..రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ను టార్గెట్ చేస్తూ పోస్టులతో రచ్చచేశారు ఎంపీ వంశీ ఫాలోవర్స్. జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల ప్రకారమే కలెక్టర్ నడుచుకుంటారా.? ఎంపీని పట్టించుకోరా అంటూనే..నువ్వు కలెక్టర్వా లేక మంత్రి పీఏవా అంటూ ఘాటు విమర్శలు చేశారు ఎంపీ వంశీకృష్ణ తండ్రి మంత్రి వివేక్‌తో శ్రీధర్ బాబుకు ఎప్పటి నుంచో విభేదాలు ఉన్నాయనేది ఓపెన్ సీక్రెట్. కొడుకును ఎంపీగా గెలిపించుకునేందుకు శ్రీధర్ బాబుతో పాటు ఎమ్మెల్యేల సపోర్ట్ తీసుకొని గెలిపించుకున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణ సమయంలో వివేక్‌కు అధిష్ఠానం మంత్రి పదవి ఇచ్చినప్పుడు..ఆయనకు చెక్ పెట్టేందుకు శ్రీధర్ బాబు అడ్డూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి ఇప్పించుకున్నారనేది వివేక్ వర్గం ఆరోపణ. అప్పటినుంచే వంశీకి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు మధ్య గ్యాప్ పెరిగిందట.మంథని, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల్లో ఎంపీ వంశీకృష్ణకు అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానం సరిగా అందటం లేదట. అందుకే అసంతృప్తితో రగిలిపోతున్నారట ఎంపీ. వంశీకృష్ణ పెదనాన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, నాన్న వివేక్ చెన్నూర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంథని, రామగుండం, ధర్మపురి, పెద్దపల్లి, మంచిర్యాల ఐదు నియోజకవర్గాల్లో ఎంపీకి ప్రోటోకాల్ పాటించకపోవడంతో అసమ్మతి రాజుకుందట.కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి క్యాడర్‌తో పాటు, ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్, విజయ రమణారావు, ప్రేమ్‌సాగర్ రావు, మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్.. శ్రీధర్ బాబు మాటే వింటున్నారనేది ఎంపీ డౌట్ అట. అధికారులు, జిల్లా కలెక్టర్లు, పోలీసులు అంతా శ్రీధర్ బాబు చెప్పినట్లే నడుచుకుంటున్నారనేది ఎంపీ వంశీ ఆగ్రహానికి కారణమంటుంది ఆయన వర్గం. తనను ఇన్సల్ట్ చేసేలా ఎమ్మెల్యేలు, మంత్రులు వ్యవహరిస్తున్నారని రగిలిపోతున్న ఎంపీ..తన సోషల్ మీడియా టీమ్‌తో వారికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టిస్తున్నారట. మంత్రులు, ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో తనకంటూ ఓ వర్గాన్ని బలోపేతం చేసుకునే పనిలో బిజీ అయ్యారట ఎంపీ. దీంతో పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్ కాంగ్రెస్లో గ్రూప్ వార్ రాజుకుందట.వంశీ తన తాత దివంగత వెంకటస్వామి పేరుతో ఏర్పాటు చేసిన కాకా ట్రస్టు ద్వారా స్కూల్ పిల్లలకు బ్యాగులు పంపిణీ చేసినందుకు మహిళ ప్రజాప్రతినిధులను, పార్టీ కార్యకర్తలను సస్పెండ్ చేయడంపై ఎంపీ వంశీ సీరియస్ అయ్యారు. శ్రీధర్ బాబు ఆదేశాలతోనే ఇదంతా జరిగిందనే కారణంతో..ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరిగిన ధర్నాకు శ్రీధర్ బాబుతో పాటుగా ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్, విజయ రమణారావు, ప్రేమ్ సాగర్ రావు ఎందుకు రాలేదంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు.ఇదే విషయంపై ఎంపీ లెటర్ ప్యాడ్‌పై వ్యంగ్యాస్త్రాలతో రాసిన ఓ లేఖ సర్కులేట్ అవుతుంది. ఢిల్లీకి రాని వాళ్లను సస్పెండ్ చేయొద్దంటూ సైటైరికల్‌గా రాసిన లేఖ కాంగ్రెస్‌లో చర్చకు దారి తీసింది. నాయకుల మధ్య సఖ్యత లోపించినా రాష్ట్ర పార్టీ పెద్దలు సీరియస్‌గా రియాక్ట్ కాకపోవడం వెనుక కారణమేంటన్న దానిపై క్యాడర్ గుసగుసలు పెట్టుకుంటుందట. మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వంశీ మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు ఎటు దారి తీస్తుందో చూడాలి మరి.

'అమెరికాలో అబ్దుల్ గెలిచాడు.. ఉత్తరప్రదేశ్‌లో మన అస్తిత్వాన్ని చాటుకోవాలి'

మిచిగాన్ సెనేట్ ఫలితంపై అసదుద్దీన్ ఒవైసీ



అమెరికా సెనేట్‌కు తొలిసారి ఓ ముస్లిం ఎన్నికై చరిత్ర సృష్టించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో మిచిగాన్ సెనేట్ స్థానం నుంచి డెమొక్రాట్ అభ్యర్థిగా పోటీచేసిన అబ్దుల్ ఎల్-సయ్యద్ చారిత్రక విజయాన్ని అందుకున్నారు. అబ్దుల్ గెలుపును హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రస్తావిస్తూ.. ఉత్తరప్రదేశ్‌లో ముస్లింలు తమ రాజకీయ అస్తిత్వాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమ గుర్తింపుపై వచ్చే రాజకీయ విమర్శలను ఎదుర్కొంటున్న ఇక్కడి ఓటర్లకు అబ్దుల్ గెలుపు ఒక బలమైన సందేశాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు."మిచిగాన్‌లో ఒక అబ్దుల్ గెలిచాడు... ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ తన రాజకీయ గుర్తింపును, ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాల్సి ఉంది" అని ఒవైసీ ఎక్స్ (ట్విట్టర్)లో స్పందించారు. "సంఘ్ పరివార్ వర్గాలు 'అబ్దుల్' అనే పేరును ఒక ఎగతాళి పదంగా మార్చడానికి తీవ్రంగా ప్రయత్నించాయి. అబ్దుల్ అల్లాకు తప్ప మరెవరికీ తలవంచదని నిరూపించే సమయం వచ్చింది. ఇకపై మేము ఎవరికీ దాసోహం కాబోం" అని ఒవైసీ హిందీలో పోస్ట్ పెట్టారు.

ముస్లింలు ఎవరికీ దాసోహం కారు

ఎన్నికల సమయంలో మైనారిటీ ఓటర్లను ఆకట్టుకుని, ఆ తర్వాత వారికి సరైన రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వని సంప్రదాయ రాజకీయ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్ ఓటర్లలో 20 శాతం మంది ముస్లింలు ఉన్నారు. అక్కడ రాజకీయ చర్చలు, సోషల్ మీడియా సంభాషణల్లో మైనారిటీ వర్గాలను సూచించడానికి 'అబ్దుల్' అనే పేరును తరచుగా ఉపయోగిస్తుంటారు.అధికార బీజేపీ ముస్లింలను లక్ష్యంగా చేసుకుంటోందని, అలాగే సమాజ్‌వాదీ పార్టీ వంటి ప్రతిపక్షాలు ముస్లింలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నాయని ఒవైసీ పలుమార్లు ఆరోపించారు. మిచిగాన్ సెనేట్ రేసులో రిపబ్లికన్ నేత మైక్ రోజర్స్‌ను ఓడించి 42 ఏళ్ల అబ్దుల్ ఎల్-సయ్యద్ విజయం సాధించారు. సయ్యద్ గెలుపుపై అమెరికా మీడియా ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఒవైసీ ఈ వ్యాఖ్యలు చేశారు.

'ఉగ్రవాది'గా చిత్రీకరించే ప్రయత్నం

విజయంపై డెట్రాయిల్‌లోని తన కార్యాలయంలో మద్దతుదారులను ఉద్దేశించి ఎల్ సయ్యద్ మాట్లాడుతూ... "మిచిగాన్‌ను మనం సాధించాం" అని అన్నారు. "మిచిగాన్ వంటి గొప్ప రాష్ట్రానికి సెనేటర్‌గా ఇక్కడ నిలబడటం నాకు ఎంతో గర్వంగా, గౌరవంగా ఉంది" అని వ్యాఖ్యానించారు.ఉద్ధతంగా సాగిన ఎన్నికల ప్రచారంలో రిపబ్లికన్ నాయకులు.. డెమొక్రాట్ అభ్యర్థులపై 'కమ్యూనిస్టులు' అని ముద్ర వేశారు. ఎల్-సయ్యద్‌ను 'ఉగ్రవాది'గా చిత్రీకరించడానికి ప్రయత్నించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ప్రచార సభల్లో ఆయన అరబిక్ పేరును గేలి చేశారు. కానీ, ఇవేమీ సయ్యద్ గెలుపును అడ్డుకోలేకపోయాయి. కార్మిక సంఘాల మద్దతుతో సంప్రదాయ రిపబ్లికన్ కోటల్లో కూడా భారీ జనసమూహాలను ఆయన ఆకట్టుకున్నారు. బిలియన్ డాలర్ల కార్పొరేట్ వైద్య రంగానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ"రాజకీయాల నుంచి ధన ప్రభావాన్ని తొలగిస్తానని" ఆయన హామీ ఇచ్చారు. 'భారీ మెడికల్ బిల్లుల భయం లేకుండా డాక్టర్‌ను సంప్రదించే హక్కు మీకు ఉంది' అని ఎల్-సయ్యద్ తన ప్రచారంలో ఉద్ఘాటించారు.

బియ్యం ఒక్కటే.. బ్రాండ్లు 28!

రేషన్ బియ్యం రీసైక్లింగ్ మాయాజాలం బట్టబయలు



రంగారెడ్డి జిల్లా: పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి, పాలిష్ చేసి, ప్రముఖ బ్రాండ్ల పేర్లతో మార్కెట్లో విక్రయిస్తున్న భారీ రైస్ రీసైక్లింగ్ వ్యవహారం రంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి వచ్చింది. ఒకే రకం బియ్యాన్ని ఏకంగా 28 రకాల బ్రాండ్ల పేర్లతో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలోని రైస్ మిల్లులు, అనుబంధ గోదాములపై విజిలెన్స్, సివిల్ సప్లైస్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఈ అక్రమాలు బయటపడ్డాయి.సివిల్ సప్లైస్ ఎస్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రాంకుమార్ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏకకాలంలో మూడు రైస్ మిల్లులు, వాటికి అనుబంధంగా ఉన్న గోదాముల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి.

ఈ సోదాల్లో 200 క్వింటాళ్లకు పైగా పీడీఎస్ రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా రైస్ మిల్లును నిర్వహిస్తున్నట్లు కూడా గుర్తించినట్లు ఎస్పీ రాంకుమార్ తెలిపారు.ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని సేకరించి, మిల్లుల్లో పాలిష్ చేసి నాణ్యమైన సోనా మసూరి బియ్యంగా చూపిస్తూ వివిధ బ్రాండ్ల సంచుల్లో ప్యాకింగ్ చేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. జేఎస్ఆర్, ఎస్ఎస్, ఎస్‌జేఎల్, కౌబ్రాండ్, కర్నూల్, ఫ్రైవ్ స్టార్, ముబారక్, వీజీఆర్, ఆర్ఆర్ఐ, బెస్ట్ హెచ్ఎంటీ, టమాటో గోల్డ్, గజరాజ్, సూర్య తేజ, జోకర్స్, అన్నపూర్ణ తదితర బ్రాండ్ల పేర్లతో బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మిల్లుల్లో వేల సంఖ్యలో వివిధ కంపెనీల బ్రాండెడ్ సంచులు, ప్యాకింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.మంచాల మండలంలోని రాఘవేంద్ర రైస్ మిల్లుతో పాటు ఇబ్రహీంపట్నం మండలం పోచారంలోని వైష్ణవి, గణేష్ అగ్రో ఇండస్ట్రీస్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు సైతం తనిఖీల్లో పాల్గొని వే-బ్రిడ్జిలు, రికార్డులను పరిశీలించారు. వాటిలో భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం.బ్రాండెడ్ లేబుల్స్‌తో ప్యాకింగ్ చేసిన బియ్యాన్ని ప్రముఖ స్టోర్లకు సరఫరా చేస్తున్నారా? ఈ అక్రమ వ్యాపారంలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది? రేషన్ బియ్యం ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు? అనే అంశాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. తనిఖీల్లో లభించిన రికార్డులు, నిల్వలు, ప్యాకింగ్ సామగ్రిని పరిశీలించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టి వ్యాపార సరుకుగా మారిన ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఇక చూస్కోండి ... తెలంగాణలో ప్రత్యర్థులకు బీజేపీ దబిడి దిబిడే

తెలంగాణలో బీజేపీ అధికారం కోసం ప్రయత్నిస్తుంది. తెలంగాణలో పవర్ ను సాధించడానికి ప్రయత్నాలను ప్రారంభించింది. బీజేపీ వ్యూహాలన్నీ అలాగే ఉంటాయి. ఏ రాష్ట్రంలోనైనా అధికారంలోకి రావాలంటే ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచే స్పీడ్ పెంచుతుంది. అధికార పార్టీకి నిద్ర లేకుండా చేయడమే కాకుండా తమ పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి ప్రయత్నిస్తుంది. ఇప్పుడు తెలంగాణ బీజేపీ టార్గెట్ అయింది.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందులో భాగంగా తెలంగాణలో బీజేపీ తన రాజకీయ దూకుడును గణనీయంగా పెంచింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలువరిస్తూ, రాబోయే జీహెచ్ఎంసీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలపడటమే కాకుండా సాధారణ ఎన్నికల వరకూ లక్ష్యంగా జాతీయ నేతలు వరుస పర్యటనలు చేస్తున్నారు.తెలంగాణలో బీజేపీ అగ్ర నేతల ప్రయాణం మొదలయింది. నేతల పర్యటనతో క్యాడర్ లో జోష్ పెంచేందుకు తొలుత కేంద్ర హోం మంత్రి అమిత్ షా తొలుత బోణీ కొట్టారు. ఈ నెల 2వ తేదీ న కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌లో భారీ పాదయాత్ర నిర్వహిం చారు.

బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి మోజంజాహి మార్కెట్ వరకు సాగిన ఈ యాత్రలో వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చారు. ఈ నినాదంతో సాగిన యాత్రలో అమిత్ షా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని, ఢిల్లీ నేతలకు తెలంగాణ ఒక 'ఏటీఎం'లా మారిందని తీవ్ర విమర్శలు చేశారు. దాదాపు యాభై వేల మంది పార్టీ కార్యకర్తలతో ఆయన పాదయాత్ర నిర్వహించి తమ సత్తా ఇదీ అని కమలం పార్టీ నిరూపించుకుంది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ లకు కొంత భయంపుట్టేలా కదం తొక్కగలిగింది.

నేతల మధ్య ఐక్యతారాగాన్ని తీసుకు వచ్చి, సమన్వయం తో ముందుకు వెళ్లాలని అమిత్ షా హితబోధ చేసి వెళ్లారు. ఈ పర్యటన ద్వారా తెలంగాణ బీజేపీ అంతర్గత గ్రూపు తగాదాలను పక్కనపెట్టి, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావులతో కలిసి కమలదళం సమిష్టి బలాన్ని చాటింది. పార్టీ వ్యూహంలో భాగంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో మరిన్ని కీలక పర్యటనలకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా తెలంగాణలో పర్యటించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన తర్వాత వరుసగా కేంద్ర మంత్రులు, కీలక నేతలు కూడా ఇక వరుసగా పర్యటించనున్నారని తెలిసింది.

దీంతో ప్రత్యర్థులకు ఊపిరి సలపనివ్వకుండా చేయాలని కమలం పార్టీ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు ఇక వరస నేతల పర్యటనతో కమలం పార్టీ తెలంగాణలో జోరు పెంచనుంది. ముఖ్యంగా త్వరలో జరిగే ఎన్నికలతో పాటు శాసనసభ ఎన్నికల వరకూ ఇదే వేడిని కొనసాగించాలని కేంద్రంలో బీజేపీ పెద్దలు నిర్ణయించారు. మొత్తం మీద ఇక కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు దిబిడిదిబిడి తప్పదన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

గోవా నైట్‌లో దివి అందాల సందడి..



టాలీవుడ్ గ్లామరస్ నటి, బిగ్‌బాస్ ఫేమ్ దివి వద్త్యా తన సోషల్ మీడియా ఫొటోషూట్‌లతో ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌ను మెస్మరైజ్ చేస్తూనే ఉంటారు. తాజాగా ఆమె గోవాలోని ఒక సాయంత్రం వేళ షేర్ చేసిన పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. ప్రశాంతమైన వాతావరణం, వెలుగుతున్న ల్యాంతర్ల మధ్య బ్రైట్ ఆరెంజ్ డ్రెస్‌లో దివి ఇచ్చిన ఫోజులు ఫ్యాషన్ ప్రియులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ సినిమాటిక్ ఫొటోషూట్ విశేషాలు ఇప్పుడు చూద్దాం..

బ్రైట్ ఆరెంజ్ డ్రెస్‌లో మైమరిపించే గ్లామర్:

గోవా నైట్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తూ దివి షేర్ చేసిన ఈ పిక్స్‌లో ఆమె బ్రైట్ ఆరెంజ్ రంగు హాల్టర్ నెక్ డ్రెస్‌లో ఎంతో అందంగా మెరిసిపోయారు. డీప్ నెక్ లైన్, నాజూకైన ప్లీట్స్‌తో ఉన్న ఈ అవుట్‌ఫిట్‌కు సింపుల్ నెక్లెస్ జత చేసి లూజ్ హెయిర్‌తో దర్శనమిచ్చారు. ఇక పామ్ ట్రీస్, కాంతివంతమైన ల్యాంతర్ల బ్యాక్‌డ్రాప్‌లో హ్యాలోవీన్ వైబ్స్ ఇస్తూ ఆమె ఇచ్చిన స్టేట్‌మెంట్ పిక్స్ కుర్రకారును ఫిదా చేస్తున్నాయి.

చీరకట్టులోనూ నిండైన చందమామలా:

కేవలం వెస్టర్న్ డ్రెస్‌లలోనే కాకుండా, సంప్రదాయ చీరకట్టులోనూ దివి ఆకట్టుకుంటారని నిరూపించారు. పింక్, లేత గోధుమ రంగుల పూల ఎంబ్రాయిడరీ ఉన్న చీరలో ఆమె నిండైన భారతీయ నారీమణిలా కనిపించారు. చెవులకు అందమైన జుంకాలు, చేతులకు బ్రాస్‌లెట్లు, కళ్లకు బ్లాక్ ఐలైనర్ మరియు సున్నితమైన మేకప్‌తో ఎక్కువ హంగులు లేకుండానే తన మార్క్ స్టైలింగ్‌తో మెప్పించారు. ఇక కెమెరా వైపు కాకుండా పక్కకు చూస్తూ ఆమె ఇచ్చిన స్మైల్ ఈ ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'మహర్షి' నుంచి బిగ్‌బాస్ వరకు ప్రత్యేక గుర్తింపు:

మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన దివి వద్త్యా, మహేశ్‌బాబు 'మహర్షి' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'గాడ్‌ఫాదర్', 'లంబసింగి', 'సింబా', 'పుష్ప 2: ది రూల్', 'డాకు మహారాజ్' వంటి పలు చిత్రాల్లో నటించారు. ఇక 'బిగ్‌బాస్ తెలుగు 4'లో పాల్గొన్న తర్వాత ఆమె క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది. ఇక వెబ్ ప్రాజెక్టులతో పాటు రీసెంట్‌గా 'హనీ' సినిమాలోనూ నటించి ప్రేక్షకులను అలరించారు. ఇక మొత్తానికి చూస్తే, సంప్రదాయ చీరకట్టులో ఎలిగెంట్ లుక్ ఇచ్చినా లేదా గోవా బీచ్ నైట్స్‌లో గ్లామరస్ టచ్ ఇచ్చిన దివి వద్త్యా స్టైలింగ్ ఫ్యాన్స్ మనసులను గెలుచుకుంటోంది. ఇక ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ లేటెస్ట్ ఫొటోషూట్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది..

మమిత బైజు అసలు పేరు ఆ హీరోయిన్ పేరా..
మరి ఎలా మారిపోయింది?



తన సహజమైన నటన కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన యంగ్ బ్యూటీ మమితా బైజు. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు విపరీతంగా దగ్గరైన ఈ మలయాళ భామ, ప్రస్తుతం సౌత్ ఇండియాలో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. అయితే మమిత అనే పేరు ఆమెకు ఎలా వచ్చిందో తెలుసా? ఒక చిన్న పొరపాటు వల్ల తన అసలు పేరు మారిపోయిందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టింది. ఆ వివరాలు ఇలా వున్నాయి..

బర్త్ సర్టిఫికెట్‌లో జరిగిన చిన్న పొరపాటు:

మమితా బైజు పుట్టినప్పుడు ఆమె తల్లిదండ్రులు ఎంతో ఇష్టపడి సీనియర్ నటి 'నమిత' పేరును ఆమెకు పెట్టాలని నిర్ణయించుకున్నారట. అయితే బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే సమయంలో అధికారులు చేసిన చిన్న పొరపాటు కారణంగా 'నమిత' అనే పేరు కాస్తా 'మమిత'గా మారిపోయింది. ఇక ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు కూడా వెంటనే గమనించలేకపోయారు.

నాలుగేళ్ల తర్వాత బయటపడ్డ అసలు విషయం:

పాపకు నాలుగైదేళ్లు వచ్చి పాఠశాలలో చేర్పించే సమయంలో సర్టిఫికెట్లను పరిశీలించగా అసలు విషయం బయటపడిందట. అప్పటికే ఆఫీషియల్ డాక్యుమెంట్స్ అన్నింట్లోనూ మమిత అనే పేరే నమోదైపోవడంతో దాన్ని మార్చడం సాధ్యం కాలేదు. దీంతో తల్లిదండ్రులు వేరే దారి లేక 'మమిత' అనే పేరునే కొనసాగించాల్సి వచ్చింది. అలా పొరపాటుతో వచ్చిన ఆ పేరే ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో ఒక లక్కీ బ్రాండ్‌గా మారిపోయింది

'ప్రేమలు'తో కెరీర్ బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్:

2024లో విడుదలైన మలయాళ చిత్రం 'ప్రేమలు' మమితా బైజు కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ సినిమాలో ఆమె నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ యువతను పిచ్చిగా ఆకట్టుకున్నాయి. ఇక దీంతో సౌత్ ఇండియా అంతటా ఆమెకు భారీ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఆ తర్వాత 'డ్యూడ్', 'జన నాయగన్', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి సినిమాలతో తన కెరీర్‌ను మరింత విస్తరించుకుంది.

వెయ్యి కోట్ల క్లబ్‌లో మమిత సినిమాలు:

తన నటనతోనే కాకుండా బాక్సాఫీస్ వద్ద కూడా మమితా బైజు మంచి రికార్డులను సొంతం చేసుకుంది. ఆమె నటించిన ప్రముఖ చిత్రాల వసూళ్లు కలిపి రూ. 1000 కోట్ల మార్కును దాటినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఆమె తమిళంలో 'ఇరందు వానమ్', మలయాళంలో 'హలో డియర్' వంటి క్రేజీ ప్రాజెక్టులతో ఎంతో బిజీగా గడుపుతోంది. ఇక మొత్తానికి చూస్తే, చిన్నతనంలో బర్త్ సర్టిఫికెట్‌లో జరిగిన ఒక చిన్న పొరపాటు వల్ల పేరు మారినప్పటికీ, ఇప్పుడు అదే 'మమిత' పేరు సౌత్ సినీ పరిశ్రమలో ఒక స్టార్ హీరోయిన్‌గా సంచలనం సృష్టిస్తోంది. ఇక అనుకోకుండా వచ్చిన పేరే ఆమెకు అదృష్టాన్ని తెచ్చిపెట్టిందని అభిమానులు సరదాగా కామెంట్లు చేస్తున్నారు.

హీరోగా అల్లు అరవింద్,హీరోయిన్‌గా జయసుధ.. సినిమా టైటిల్ కూడా చెప్పేశారు



టాలీవుడ్‌లో అగ్ర నిర్మాతగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అల్లు అరవింద్ పేరు వినగానే భారీ చిత్రాలు, విజయవంతమైన సినిమాలు గుర్తుకొస్తాయి. మెగాస్టార్ చిరంజీవికి బావమరిది, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తండ్రిగా కూడా ఆయన అందరికీ సుపరిచితమే. అయితే అల్లు అరవింద్‌ను హీరోగా చూడాలని ఎప్పుడైనా అనుకున్నారా? తాజాగా సీనియర్ నటి జయసుధ చేసిన సరదా వ్యాఖ్యలు ఇప్పుడు ఈ ఆసక్తికరమైన చర్చకు తెరలేపాయి. 'సమ్మర్ హాలిడేస్' సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో పాల్గొన్న జయసుధ.. అల్లు అరవింద్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు అల్లు అరవింద్ అంటే ఎంతో ఇష్టమని, ఆయనతో చాలా ఏళ్ల పరిచయం ఉందని చెప్పారు. అల్లు అరవింద్ మంచి నటుడని, ఆయనలోని నటనా ప్రతిభ గురించి ఇప్పటి యువతరానికి పెద్దగా తెలియకపోవచ్చని అన్నారు.అంతటితో ఆగకుండా గతంలో తాను అల్లు అరవింద్‌కు ఒక ప్రతిపాదన కూడా చేశానని జయసుధ వెల్లడించారు. తామిద్దరం కలిసి నటించేలా ఒక సినిమా నిర్మించాలని ఆయనను అడిగినట్లు చెప్పారు. ఇప్పుడు అల్లు అరవింద్ ఆ సినిమాను నిర్మిస్తే, తామిద్దరం కలిసి నటించవచ్చని సరదాగా వ్యాఖ్యానించారు. అంతేకాదు, ఆ చిత్రానికి 'రోమన్ హాలిడే' అనే పేరు కూడా పెట్టాలని సూచించారు. జయసుధ చేసిన ఈ వ్యాఖ్యలకు అక్కడే ఉన్న అల్లు అరవింద్ నవ్వుతూ స్పందించారు. జయసుధ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అల్లు అరవింద్ నిజంగానే నటుడిగా తెరపై కనిపిస్తే చూడాలని ఉందంటూ పలువురు నెటిజన్లు స్పందిస్తున్నారు. అయితే ఇదంతా ప్రీ రిలీజ్ వేడుకలో జయసుధ సరదాగా చేసిన వ్యాఖ్యలే. అల్లు అరవింద్ హీరోగా, జయసుధ హీరోయిన్‌గా 'రోమన్ హాలిడే' సినిమా తెరకెక్కనుందనే అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు.మరోవైపు జయసుధ సినిమాలతో పాటు ఓటీటీలోనూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఎన్నో దశాబ్దాలుగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఆమె.. హీరోయిన్‌గా, ఆ తర్వాత కీలక పాత్రల్లో తనదైన ముద్ర వేశారు. తాజాగా జియో హాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న 'లవ్ ఆల్వేస్' అనే రొమాంటిక్ డ్రామాతో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో అల్లు అరవింద్‌తో కలిసి నటించాలన్న జయసుధ సరదా ప్రతిపాదన సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఇన్నాళ్లకు సెట్ లో అడుగుపెట్టిన నివేదా థామస్



చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరియర్ మొదలుపెట్టి, సీరియల్స్ ద్వారా తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నివేదా థామస్.. ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించింది. మలయాళం లోనే సినిమాలు చేస్తూ ఆకట్టుకున్న నివేదా థామస్.. తొలిసారి 2016లో జెంటిల్మెన్ అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఆ తర్వాత వచ్చిన నిన్ను కోరి సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న ఈమె.. జై లవకుశ , జూనియర్ లవర్ ఆఫ్ ఇడియట్, బ్రోచేవారెవరు, 118 వంటి చిత్రాలలో నటించి ప్రేక్షకులను మెప్పించింది. ప్రముఖ హీరోయిన్ రెజీనా కసాండ్రా తో కలసి శాకిని డాకిని అనే చిత్రంలో నటించి దాదాపు రెండేళ్ల పాటు ఇండస్ట్రీకి దూరమైన ఈమె.. మళ్లీ 35 చిన్న కథ కాదు అనే సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో తన అద్భుతమైన నటనతో గద్దర్ అవార్డ్ కూడా సొంతం చేసుకుంది. ఈ చిత్రం తర్వాత దాదాపు 3 ఏళ్లపాటు తెలుగు ఇండస్ట్రీకి దూరమైన ఈ ముద్దుగుమ్మ.. ఇన్నాళ్లకు మరో కొత్త ప్రాజెక్టు ప్రకటించింది. నివేదా థామస్ ప్రధాన పాత్రలో విశ్వక్ ఖండేరావు దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం శ్రీమతి.

ఒక చక్కని ఫ్యామిలీ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తోంది. ట్రెడిషనల్గా, హోమ్లీ లుక్ లో మరోసారి ఆకట్టుకోవడానికి సిద్ధమైంది నివేదా థామస్. దాదాపు మూడు ఏళ్ల తర్వాత మళ్లీ సెట్ లోకి అడుగుపెట్టడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు తాజాగా ఆమె తన అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఒక పోస్టు షేర్ చేశారు. నవంబర్ రెండవ తేదీన తన పుట్టినరోజు కావడంతో ఈసారి ఈ పుట్టినరోజును కుటుంబ సభ్యులకు, స్నేహితులకు దూరంగా జరుపుకున్నట్లు పంచుకుంది. ఇకపోతే శ్రీమతి షూటింగ్ సెట్లో ఉన్న విషయాన్ని అభిమానులతో పంచుకుంటూ ఒక పోస్ట్ షేర్ చేసింది నివేదా థామస్. అందులో.." ఈ ఏడాది పుట్టినరోజును కుటుంబ సభ్యులకు, స్నేహితులకు దూరంగా గడిపినప్పటికీ.. ఒక సినిమా సెట్ లో నా సొంత ఇంట్లో ఉన్న అనుభూతిని పొందాను. ఎదురు చూడాల్సిన సన్నివేశాలు, స్క్రిప్ట్ చర్చల్లో మునిగిపోయి.. సాయంత్రం 5:30 గంటలకు వర్షం కురుస్తున్న సూర్యాస్తమయాన్ని చూస్తూ.. బీన్ బ్యాగుపై ఒక కొండ అంచున కూర్చొని చేతిలో వేడి వేడి చాయ్ తో కరకరలాడుతూ మరీ నూనెగాలేని మొలగ బజ్జీలు తినడం చాలా కొత్త అనుభూతిని ఇచ్చింది. ముఖ్యంగా ఈ అనుభూతిని నేను వర్ణించలేను. నేను చూసిన, చూడని, తెలిసిన, తెలియని ప్రజలందరికీ, మీ దయగల మాటలకు శుభాకాంక్షలు. నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ మద్దతుకు, ప్రేమకు, నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ సంవత్సరం మంచి ఆరోగ్యం, సినిమా అవకాశాలు , ఆత్మ సానుభూతి, తక్కువ విమర్శలు, ఆహారం, మీ అందరి ప్రార్థనలు నాకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ ఒక పోస్టు షేర్ చేసింది. ఇకపోతే తాజాగా నివేదా థామస్ షేర్ చేసిన ఫోటోలలో తన బర్తడే సందర్భంగా షూటింగ్ సెట్లో జరుపుకున్న బర్తడే సెలబ్రేషన్స్ కేక్ అలాగే తన 5వ యేట జరుపుకున్న పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫ్యామిలీ ఫోటో ని కూడా నివేదా థామస్ షేర్ చేసింది. ఇక మరొక ఫోటోలో సినిమాకు సంబంధించి మెడలో నల్లహారాలు ధరించి శ్రీమతి లుక్ లో ఆకట్టుకుంది.

సీత పాత్రను శ్రీనిధి వదులుకుందా.. అసలు నిజం వేరే!



ఒకే సినిమాలో ప్రేమికులుగా కనిపించిన ఇద్దరు నటులు మరో సినిమాలో శత్రువులుగా మారితే ఎలా ఉంటుంది? కేజీఎఫ్ జంట యష్, శ్రీనిధి శెట్టికి అలాంటి అవకాశం దాదాపు వచ్చినంత పనైంది. అది కూడా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'రామాయణం' సినిమాలో కావడం విశేషం. అయితే సీత పాత్ర కోసం శ్రీనిధి శెట్టి ఆడిషన్ ఇచ్చినా చివరికి సాయి పల్లవి ఫైనల్ అయ్యింది. ఈ వ్యవహారంలో యష్ కోసం శ్రీనిధి అంత పెద్ద అవకాశాన్ని వదులుకున్నారంటూ సోషల్ మీడియాలో ఓ పాత వీడియో మళ్లీ వైరల్ అవుతోంది. నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా నటించిన సంగతి తెలిసిందే. ఇందులో సీత పాత్ర కోసం శ్రీనిధి శెట్టిని కూడా పరిశీలించారు. కేజీఎఫ్ 2 విడుదలైన నెలా రెండు నెలల సమయంలోనే ఆమెకు ఆడిషన్ అవకాశం వచ్చింది. మూడు సన్నివేశాలకు సిద్ధమై స్క్రీన్ టెస్ట్ ఇచ్చారు. తన పర్ఫార్మెన్స్ చూసి చిత్రబృందం కూడా మంచి స్పందన ఇచ్చిందని గతంలో ఓ ఇంటర్వ్యూలో శ్రీనిధి చెప్పారు. అయితే అప్పటికే యష్ కూడా ఈ ప్రాజెక్టులో భాగమని ఆమెకు తెలిసింది.

కేజీఎఫ్ సినిమాల్లో యష్ పోషించిన రాకీ పాత్రకు జోడీగా శ్రీనిధి కనిపించారు. ముఖ్యంగా రెండో భాగంలో వీరి ప్రేమకథకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాంటి సమయంలో రామాయణంలో యష్ రావణుడిగా, తాను సీతగా కనిపిస్తే ప్రేక్షకులు ఎలా తీసుకుంటారనే సందేహం శ్రీనిధికి కలిగిందట. అప్పటివరకు ప్రేమికులుగా చూసిన జంటను ఒక్కసారిగా ప్రత్యర్థి పాత్రల్లో చూడటం ఆడియన్స్‌కు వింతగా అనిపించవచ్చని భావించారు. ఆమె చెప్పిన ఈ మాటలతోనే యష్ కోసం సీత పాత్రను వదులుకున్నారనే ప్రచారం మొదలైంది. కానీ తర్వాత మరో ఇంటర్వ్యూలో శ్రీనిధి ఇచ్చిన క్లారిటీ మాత్రం వేరు. అసలు సీత పాత్రను తాను తిరస్కరించలేదని స్పష్టంగా చెప్పారు. ఆడిషన్ ఇచ్చానని, కానీ చిత్రబృందం తనను ఎంపిక చేయలేదని వివరించారు. అంత పెద్ద పాత్రను తిరస్కరించే స్థాయిలో తాను లేనని కూడా చెప్పుకొచ్చారు. సాయి పల్లవి సెలెక్ట్ కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దీంతో యష్ కోసం భారీ అవకాశాన్ని త్యాగం చేశారంటూ జరుగుతున్న ప్రచారానికి ఆమె మాటలతోనే సమాధానం దొరికింది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే శ్రీనిధి చెప్పిన రెండు సందర్భాల్లోనూ యష్ ప్రస్తావన ఉంది. మొదటిసారి కేజీఎఫ్ జోడిని ప్రేక్షకులు ఎలా తీసుకుంటారనే సందేహాన్ని బయటపెట్టారు. రెండోసారి మాత్రం ఆ పాత్ర తనకు రాలేదని తేల్చేశారు. కానీ సోషల్ మీడియాలో మొదటి ఇంటర్వ్యూలోని మాటలే ఎక్కువగా వైరల్ కావడంతో శ్రీనిధి కావాలనే సినిమా నుంచి తప్పుకున్నారనే అభిప్రాయం ఏర్పడింది. కొందరు అభిమానులు యష్‌పై ఆమెకున్న అభిమానానికి ఇదే నిదర్శనమంటూ పోస్టులు కూడా పెడుతున్నారు. మరోవైపు రామాయణంలో సీత పాత్ర సాయి పల్లవికి దక్కగా, శ్రీనిధి తెలుగు సినిమాల్లోనూ అవకాశాలు అందుకున్నారు. కేజీఎఫ్ తర్వాత నానితో 'హిట్ 3'లో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు.

కత్తులతో కాళికావతారం..
రష్మిక 'మైసా' పూనకాలు మామూలుగా లేవుగా!



రష్మిక మందన్న కెరీర్ లో ఎప్పుడూ చూడని కొత్త అవతారం ఇది. గ్లామర్ పాత్రలతో అలరించిన ఈ కన్నడ బ్యూటీ, మొదటిసారి పూర్తి స్థాయి లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా మైసా తో పాన్ ఇండియా రేంజ్ లో అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. లేటెస్ట్ గా ఈ సినిమా నుంచి వచ్చిన మొదటి పాట ఓ మైసా రే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. చేతిలో కత్తులు, ఒంటిపై రక్తపు మరకలతో రష్మిక ఇచ్చిన ఎంట్రీ చూస్తుంటే సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందో అర్థమవుతోంది. దర్శకుడు రవీంద్ర పుల్లె ఈ పాటను పిక్చరైజ్ చేసిన విధానం చాలా రా అండ్ రస్టిక్ గా ఉంది. దుష్టశక్తులపై పోరాటానికి దిగేముందు జరిగే ఒక గిరిజన పూజా విధానంలా ఈ పాట పైలెట్ అయ్యింది. నిప్పుల మధ్య రౌద్ర రూపంతో రష్మిక చేసిన క్లాసికల్ తరహా నృత్య భంగిమలు గూస్ బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. కాళికా మాత ఆవహించినట్లు ఆమె పలికించిన హావభావాలు, చూపులు ఆడియన్స్‌ను వెంటనే ఆకట్టుకుంటున్నాయి. ఆమె చేసిన గత సినిమాలకు ఇది పూర్తి భిన్నమైన రోల్. సంగీత దర్శకుడు జేక్స్ బిజాయ్ అందించిన ట్యూన్ పాటకు అసలైన ప్రాణం పోసింది. అడవి బిడ్డల సంస్కృతిని ప్రతిబింబించే లోకల్ వాయిద్యాలను వాడుతూ ఆయన క్రియేట్ చేసిన బ్యాక్‌గ్రౌండ్ రిథమ్ హై ఓల్టేజ్ వైబ్ ను తీసుకొచ్చింది. సింగర్ సింధూజ శ్రీనివాసన్ తన పవర్ ఫుల్ వాయిస్ తో పాటకు కావాల్సిన పవర్ ను అందించారు. వింటుంటేనే ఒంట్లో తెలియని ఒక వైబ్రేషన్ కలిగేలా మ్యూజిక్ సాగింది. సుద్దాల అశోక్ తేజ రాసిన సాహిత్యం పాటలోని భావోద్వేగాన్ని మరింత ఎలివేట్ చేసింది. శత్రువుల గుండెల్లో భయం పుట్టించేలా, న్యాయం కోసం పోరాడే ఒక వీరనారి ఆవేశాన్ని ప్రతిబింబించే పదాలతో పాటను తీర్చిదిద్దారు. తెలంగాణ జానపద యాసతో కూడిన పదాల అమరిక సన్నివేశానికి పక్కాగా సరిపోయింది. కేవలం ఆడియో విన్నప్పుడే కాకుండా, స్క్రీన్ పై విజువల్స్ తో చూసినప్పుడు ఈ లైన్స్ ఇచ్చే ఇంపాక్ట్ ఇంకాస్త ఎక్కువగా అనిపిస్తుంది. బృందా మాస్టర్ కొరియోగ్రఫీ ఇందులో స్పెషల్ గా నిలిచింది. ఒక హీరోయిన్ తో ఇంత భారీ స్థాయిలో ఫైర్ సెటప్ నడుమ డ్యాన్స్ చేయించడం అంత సులువైన విషయం కాదు. అజయ్ సయ్యపురెడ్డి, అనిల్ సయ్యపురెడ్డి, వీరసాయి గోపి ఎలాంటి కాంప్రమైజ్ కాకుండా నిర్మించిన ఈ చిత్రం విజువల్స్ లో గ్రాండియర్ ను చూపిస్తోంది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్ పై వస్తున్న ఈ ప్రాజెక్ట్ మేకింగ్ స్టాండర్డ్స్ నిజంగా చాలా బాగున్నాయి. నవంబర్ 27న ఐదు భాషల్లో భారీగా రిలీజ్ కాబోతున్న మైసా, రష్మిక కెరీర్ కు బిగ్గెస్ట్ బెట్ లాంటిది. పుష్ప, యానిమల్ సినిమాలతో ఆల్రెడీ నార్త్ లో క్రేజ్ ఉన్నప్పటికీ, సోలో హీరోయిన్ గా మార్కెట్ నిలబెట్టుకోవడానికి ఇలాంటి కంటెంట్ చాలా ముఖ్యం. మొదటి సింగిల్ తోనే అంచనాలను పెంచేసిన ఈ చిత్రం, రాబోయే రోజుల్లో ట్రైలర్ తో ఏ మేరకు సర్ప్రైజ్ చేస్తుందో చూడాలి.

గ్రీన్‌లాండ్ భద్రత ఒప్పందానికి ఆమోదం



ఆర్కిటిక్, ఉత్తర అట్లాంటిక్ ప్రాంతాల్లో భద్రతను బలోపేతం చేసేందుకు అమెరికా, డెన్మార్క్, గ్రీన్‌లాండ్ మధ్య కుదిరిన ఒప్పందానికి గ్రీన్‌లాండ్ పార్లమెంటు ఆమోదం తెలిపింది. మంగళవారం రాజధాని నూక్‌లో జరిగిన ఓటింగ్‌లో 16 మంది సభ్యులు ఒప్పందానికి అనుకూలంగా ఓటు వేయగా.. ఏడుగురు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను తమ దేశంలో కలుపుకోవాలని కొన్నాళ్లుగా ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ఒప్పందంతో గ్రీన్‌లాండ్‌లో మరిన్ని అమెరికా సైనిక స్థావరాలు ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది. అదే సమయంలో, నాటో సభ్యదేశమైన డెన్మార్క్ నియంత్రణలోనే గ్రీన్‌లాండ్ కొనసాగనుంది. భవిష్యత్తులో గ్రీన్‌లాండ్ స్వతంత్ర దేశంగా మారాలని నిర్ణయించుకున్నా ఈ ఒప్పందం అమల్లో ఉంటుంది.

అమెరికా ఒత్తిడికి తెరపడుతుందా?

గ్రీన్‌లాండ్ ఆమోదంతో అమెరికా ప్రభుత్వం కోరుకున్నది నెరవేరిందని భావిస్తున్నట్లు ఆ ద్వీపంలోని ఇలులిసాట్ పట్టణానికి చెందిన 28 ఏళ్ల నుకాకా లండ్-మాథ్యూసెన్ చెప్పారు."అమెరికా ప్రభుత్వం నుంచి ఇకపై వెనుక నుంచి బెదిరింపులు రావని ఆశిస్తున్నా" అని ఆమె అసోసియేటెడ్ ప్రెస్‌తో అన్నారు.ఇలులిసాట్‌లో చెఫ్‌గా పనిచేస్తున్న 34 ఏళ్ల విలియం తుకులా మాట్లాడుతూ.. ట్రంప్, అమెరికా సైనికుల గురించి కొంతమంది వృద్ధ గ్రీన్‌లాండ్ వాసులు ఫేస్‌బుక్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న పోస్టులను చూశానని చెప్పారు.గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు సైనిక బలగాలను ఉపయోగించే అవకాశాన్ని కూడా ట్రంప్ గతంలో తోసిపుచ్చలేదు. అమెరికా జాతీయ భద్రతకు గ్రీన్‌లాండ్‌పై నియంత్రణ కీలకమని ఆయన పేర్కొన్నారు. అయితే, గ్రీన్‌లాండ్ ప్రజలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలని కూడా చెప్పారు. ఆ తర్వాత సైనిక చర్యకు సంబంధించిన బెదిరింపుల నుంచి వెనక్కి తగ్గారు.ఒప్పందంపై గ్రీన్‌లాండ్ పార్లమెంటు ఆమోదాన్ని అమెరికా విదేశాంగ శాఖ స్వాగతించింది. ఇది అమెరికా జాతీయ భద్రతకు మరో ప్రధాన విజయమని పేర్కొంది.ఆర్కిటిక్‌లో అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడటంతో పాటు రక్షణను బలోపేతం చేస్తున్నామని, ఈ కీలక ప్రాంతంలో శత్రు దేశాల నుంచి ముప్పు లేకుండా చూస్తున్నామని విదేశాంగ శాఖ ఎక్స్‌లో తెలిపింది.ట్రంప్, డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్సెన్, గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్-ఫ్రెడరిక్ నీల్సన్ గత సెప్టెంబరులో న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల సందర్భంగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

గ్రీన్‌లాండ్ ప్రజలకు ప్రయోజనం ఏది?

ఒప్పందానికి ఆమోదం లభించిన తర్వాత గ్రీన్‌లాండ్ ప్రజలు ఐక్యంగా నిలిచారని, తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకుంటామని ప్రపంచానికి చాటారని ప్రధాని నీల్సన్ ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు.ఇతర దేశాలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని, అయితే ఆ సహకారం తమ ప్రజలు, దేశం, హక్కులను గౌరవించేలా ఉండాలని చెప్పారు. "గ్రీన్‌లాండ్ మా దేశం. ఎప్పటికీ మా దేశంగానే ఉంటుంది" అని స్పష్టం చేశారు.ఈ నెల చివర్లో డెన్మార్క్ పార్లమెంటు ఈ ఒప్పందంపై చర్చించనుంది. డెన్మార్క్, గ్రీన్‌లాండ్ పార్లమెంటరీ ప్రక్రియలు పూర్తయ్యాక ఒప్పందం అమల్లోకి వస్తుంది.అయితే, గ్రీన్‌లాండ్ పార్లమెంటు ఆమోదం తెలిపినా కొంతమంది స్థానికుల్లో ఆందోళన తగ్గలేదు. దౌత్యపరమైన వ్యవహారాల్లో సాధారణ వ్యక్తులు ఏమీ చేయలేరని లండ్-మాథ్యూసెన్ అన్నారు."దౌత్య వ్యవస్థ చాలా పెద్దది. గ్రీన్‌లాండ్‌లో నావంటి చిన్న వ్యక్తికి ఇలాంటి విషయాలపై ప్రభావం చూపడం కష్టం" అని ఆమె చెప్పారు.ఇలులిసాట్‌కు చెందిన 43 ఏళ్ల నుకారాక్ థామ్సెన్ కూడా ఈ ఒప్పందం గ్రీన్‌లాండ్ ప్రజలకు ప్రయోజనం చేకూర్చదని అభిప్రాయపడ్డారు."గ్రీన్‌లాండ్‌కు ఈ ఒప్పందం వల్ల భద్రత ఉండొచ్చు. కానీ ప్రజలకు కాదు భూమికి మాత్రమే భద్రత ఉంటుంది" అని ఆయన అన్నారు.గ్రీన్‌లాండ్‌లో సైనిక స్థావరాల ఏర్పాటు, నిర్వహణ, తొలగింపునకు అవసరమైన వస్తువులు, సేవల కోసం అమెరికా కాంట్రాక్టులు ఇచ్చేటప్పుడు వీలైనంత వరకు గ్రీన్‌లాండ్ సంస్థలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఒప్పందంలో పేర్కొన్నారు.అయితే, ఈ ఒప్పందం వల్ల గ్రీన్‌లాండ్ ప్రజలకు ప్రయోజనం ఉంటుందనే నమ్మకం అవన్నాటా మున్సిపాలిటీ మేయర్ లార్స్ ఎరిక్ గాబ్రియెల్‌సెన్‌కు లేదు."డెన్మార్క్, నాటోకు ఇది మంచి ఒప్పందం. మాకు మాత్రం కాదు. మా సమాజానికి ఎలాంటి ప్రయోజనం లేదు. ఒక్క పైసా కూడా రాదు" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఏఐపై భారతీయుల్లో ఆశావాదం.. అమెరికన్లలో మాత్రం నిరాశ: శామ్ ఆల్ట్‌మన్



కృత్రిమ మేధ (ఏఐ) విషయంలో భారతీయులు ఎంతో ఆశావాదంతో ఉన్నారని, అమెరికన్లు మాత్రం దీనిపై కొంత ప్రతికూల దృక్పథంతో ఉన్నారని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. భారత్‌లో ఏఐని కొత్త మార్గాల్లో ఉపయోగించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని ప్రశంసించారు. చాట్‌జీపీటీ వినియోగదారుల సంఖ్య పరంగా అమెరికాను అధిగమించి భారత్ తమ సంస్థకు అతిపెద్ద మార్కెట్‌గా అవతరించిందని వెల్లడించారు.ప్రముఖ వ్యాపారవేత్త రాజ్ షమానీ నిర్వహించే ఫిగరింగ్ అవుట్ పాడ్‌కాస్ట్‌లో ఆల్ట్‌మన్ ఈ విషయాలను వెల్లడించారు. అమెరికాలో సాధారణ వ్యక్తులతో మాట్లాడినప్పుడు ఏఐపై కొంత సందేహం, నిరాశ కనిపిస్తాయన్నారు. భారత్‌లో మాత్రం ఈ సాంకేతికతపై ఎక్కువ ఆశాభావం వ్యక్తమవుతోందని చెప్పారు. ఈ వ్యత్యాసం తనకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.భారత్‌లో చాలామంది ఏఐని కేవలం సమాచారం తెలుసుకోవడానికి మాత్రమే కాకుండా, వ్యాపారాలను ప్రారంభించడానికి, కొత్త ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి ఉపయోగిస్తున్నారని ఆల్ట్‌మన్ వివరించారు. నిధుల సేకరణపై గతంలో ఎలాంటి అనుభవం లేని ఓ భారతీయ విద్యార్థి.. తన పాఠశాల కోసం విరాళాలు సేకరించే మొత్తం ప్రక్రియను ఓపెన్‌ఏఐ సాధనాల సాయంతో నిర్వహించాడని ఉదాహరణగా చెప్పారు. ఏఐని ప్రజలు ఎంత సృజనాత్మకంగా ఉపయోగించుకుంటున్నారో ఈ ఘటన తెలియజేస్తోందన్నారు.అభివృద్ధి వేగంగా జరుగుతున్న దేశాల్లో ఏఐకి ఎక్కువ ఆదరణ లభించే అవకాశం ఉందని ఆల్ట్‌మన్ అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా ఎదుగుతున్న దేశాల్లో ఉత్పత్తులు, సేవలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, ఆ అవసరాలను తీర్చడంలో ఏఐ కీలక పాత్ర పోషించగలదని వివరించారు. అందుకే భారత్ వంటి దేశాల్లో ఈ సాంకేతికతను స్వీకరించేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు.ఓపెన్‌ఏఐలో తనకు వాటా లేకపోవడంపై కూడా ఆల్ట్‌మన్ స్పందించారు. ఆ నిర్ణయం పొరపాటేనని అంగీకరించారు. తాను మంచి ఉద్దేశాలతోనే అలా చేశానని, అయితే సంస్థను నడిపిస్తున్న వ్యక్తికి అందులో వాటా లేకపోవడంపై చాలామందికి సందేహాలు కలుగుతున్నాయని చెప్పారు. ఏఐ రంగంలో అధికార కేంద్రీకరణపై అమెరికాలో వ్యక్తమవుతున్న విమర్శలు కొంతవరకు సమంజసమేనని, అయితే తనపై వస్తున్న విమర్శలు హద్దులు దాటుతున్నాయని అభిప్రాయపడ్డారు.

ప్రజల కడుపు మాడుతున్నా.. సైనిక ఖర్చులకే పాకిస్థాన్ పెద్దపీట

పాకిస్థాన్‌లో ప్రజలు తీవ్రమైన ఆకలి, పోషకాహార లోపంతో బాధపడుతుంటే.. అక్కడి ప్రభుత్వం మాత్రం ప్రజారోగ్యం, ఆహార భద్రత వంటి కీలక రంగాలను విస్మరించి సైనిక సామగ్రి కొనుగోలుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం పాక్ ప్రభుత్వం తన బడ్జెట్‌లో రక్షణ రంగానికి భారీగా నిధులు కేటాయించి, ప్రజల అవసరాలను గాలికొదిలేసింది. ఈ వివరాలను 'యూరోపియన్ టైమ్స్ న్యూస్' పోర్టల్ తన కథనంలో వెల్లడించింది.2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ పాకిస్థాన్ ప్రభుత్వం రక్షణ శాఖకు ఏకంగా 3 ట్రిలియన్ల పాకిస్థానీ రూపాయలను కేటాయించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 17.6 శాతం ఎక్కువ. ముఖ్యంగా ఆయుధాలు, ఇతర సైనిక సామగ్రి కొనుగోలుకు కేటాయించే నిధిని 39.6 శాతం పెంచి 925.8 బిలియన్ రూపాయలకు చేర్చింది. మరోవైపు దేశ ప్రజలందరి ఆరోగ్యానికి కేటాయించింది కేవలం 53.3 బిలియన్ రూపాయలు మాత్రమే. ఇందులో ఆరోగ్యం, పోషకాహారం అభివృద్ధికి కేటాయించింది కేవలం 24.3 బిలియన్లు. విచిత్రం ఏంటంటే, సైనిక సిబ్బంది పెన్షన్ల కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా 822 బిలియన్ రూపాయలు కేటాయించారు. ఇది మొత్తం ఆరోగ్య బడ్జెట్ కంటే 15 రెట్లు అధికం. "ప్రజల ఆరోగ్యంపై ఒక రూపాయి ఖర్చు చేస్తే, సైన్యంపై 56 రూపాయలు ఖర్చుచేస్తూ పాక్ ప్రభుత్వం దేనికి విలువిస్తుందో స్పష్టం చేసింది" అని ఆ కథనం పేర్కొంది.ప్రభుత్వ ప్రాధాన్యతల ఫలితంగా పాకిస్థాన్‌లో ఆకలి స్థాయిలు తీవ్రంగా పెరిగాయి. 2026 ప్రపంచ ఆకలి సూచీలో 122 దేశాల్లో పాకిస్థాన్ 106వ స్థానంలో నిలిచింది. దాని స్కోరు 25.5గా నమోదైంది. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ (19.2), నేపాల్ (14.5), భారత్ (24.1) కంటే కూడా పాక్ పరిస్థితి దారుణంగా ఉంది. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంక కూడా పుంజుకుని 10.2 స్కోరుతో దక్షిణాసియాలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది.దేశంలో పోషకాహార లోపం 16.1 శాతానికి, ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల లోపం 33.6 శాతానికి, బరువు తక్కువగా ఉండటం (చైల్డ్ వేస్టింగ్) 9.8 శాతానికి చేరింది. ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటు 5.6 శాతంగా ఉంది. ఇది ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని సూచిస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీనికి తోడు గోధుమ మద్దతు ధర విధానాన్ని రద్దు చేయడంతో సేకరణ దారుణంగా పడిపోయింది. దీంతో 1 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసి సుమారు 3.5 మిలియన్ టన్నుల గోధుమలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కూడా అదే స్థాయిలో ఆహార కొరత ఉండటంతో, రాబోయే రోజుల్లో పిండి ధర సామాన్యులకు అందనంతగా పెరిగిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ట్రంప్ విధానాలకు షాకిచ్చిన అమెరికన్లు.. మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల ప్రభంజనం



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ పార్టీకి షాక్ తగిలింది. సెనేట్‌తోపాటు ప్రతినిధుల సభలోనూ ప్రతిపక్ష డెమోక్రాట్లు మెజార్టీ సాధించారు. ట్రంప్ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన ప్రజలు.. డెమోక్రాట్ల వైపు మొగ్గారు. జీవన వ్యయం పెరగడం, ఇరాన్‌తో యుద్ధం, వలస విధానం.. ఇవన్నీ రిపబ్లికన్లకు ఓటర్లను దూరం చేశాయి. డెమోక్రాట్లు గెలవడం వల్ల భారత్‌పైనా ప్రభావం పడనుంది.అమెరికా రాజకీయాల్లో 2026 మధ్యంతర ఎన్నికలు పెను రాజకీయ మార్పులకు వేదికయ్యాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగలగా, డెమోక్రటిక్ పార్టీ సెనేట్‌పై నియంత్రణ సాధించింది. ప్రతినిధుల సభలోనూ మెజారిటీకి చేరువైంది. దీంతో ట్రంప్ రెండో విడత పాలనలో మిగిలిన రెండేళ్లకు అమెరికా రాజకీయాల్లో కొత్త అధికార సమీకరణాలు ఏర్పడనున్నాయి. అధ్యక్షుడిగా ట్రంప్ కొనసాగుతున్నప్పటికీ, ఆయన నిర్ణయాలను ప్రశ్నించే, అడ్డుకునే రాజకీయ శక్తి కాంగ్రెస్ (పార్లమెంట్)లో పెరగడం ఈ ఎన్నికల ప్రధాన పరిణామం. నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, సెనేట్‌లో 35 స్థానాలకు, 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికలు అధ్యక్ష ఎన్నికలు కావు. అయినప్పటికీ అమెరికా అధ్యక్షుడి రెండేళ్ల పాలనపై ప్రజలు ఇచ్చే మధ్యంతర తీర్పుగా వీటికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. అధికారంలో ఉన్న పార్టీకి మధ్యంతర ఎన్నికల్లో ఎదురుగాలి వీచడం అన్న సంప్రదాయం ఈసారి మరింత స్పష్టంగా కనిపించింది.

జీవన వ్యయం... ట్రంప్‌కు ప్రధాన సమస్య

ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకు అనుకూలంగా ప్రజాభిప్రాయం మారడానికి ప్రధాన కారణాల్లో ఆర్థిక పరిస్థితులు ఒకటి. నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, జీవన వ్యయం అమెరికా ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేశాయి. దీనికి తోడు ఇరాన్‌తో యుద్ధం, వలస విధానాలు, వాణిజ్య సుంకాలు, ప్రభుత్వ నిర్ణయాలపై వివాదాలు ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని, అమెరికా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ సామాన్య అమెరికన్లకు జీవన వ్యయం తగ్గకపోవడం, అంతర్జాతీయ సంఘర్షణల ప్రభావం, ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి రిపబ్లికన్లకు ప్రతికూలంగా మారాయి. ఎన్నికల అనంతరం వెలువడిన ఎగ్జిట్‌పోల్ విశ్లేషణల్లోనూ ఇదే అంశం స్పష్టమైంది. అధిక ధరలు, దేశం పయనిస్తున్న దిశపై అసంతృప్తి, ట్రంప్ ప్రభుత్వ పనితీరుపై వ్యతిరేకత ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి. దాదాపు సగం మంది ఓటర్లు ఈ ఎన్నికలను అధ్యక్షుడికి వ్యతిరేకంగా తమ అసంతృప్తిని వ్యక్తం చేసే అవకాశంగా భావించినట్లు తెలుస్తోంది.

సెనేట్‌లో డెమోక్రాట్లకు కీలక విజయం

ఈ ఎన్నికల్లో అత్యంత కీలకమైన విజయం సెనేట్‌లో డెమోక్రాట్లకు లభించింది. రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న పలు రాష్ట్రాల్లో డెమోక్రటిక్ అభ్యర్థులు విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. నార్త్ కరోలినాలో మాజీ గవర్నర్ రాయ్ కూపర్, రిపబ్లికన్ అభ్యర్థి మైఖేల్ వాట్లీని ఓడించారు. జార్జియాలో జోన్ ఒసాఫ్ తిరిగి ఎన్నికయ్యారు. న్యూ హాంప్‌షైర్‌లో క్రిస్ పప్పాస్ విజయం సాధించారు. టెక్సాస్‌లో జేమ్స్ తలారికో, ఒహియోలో షెరాడ్ బ్రౌన్ విజయాలు డెమోక్రాట్లకు మరింత బలాన్ని ఇచ్చాయి. ముఖ్యంగా టెక్సాస్‌లో డెమోక్రటిక్ అభ్యర్థి జేమ్స్ తలారికో విజయం చారిత్రాత్మక పరిణామంగా నిలిచింది. 1994 తర్వాత ఆ రాష్ట్రంలో డెమోక్రాట్లు సాధించిన తొలి రాష్ట్రవ్యాప్త విజయంగా ఇది గుర్తింపు పొందింది. ఒహియోలో షెరాడ్ బ్రౌన్ తిరిగి సెనేట్‌లోకి రావడం కూడా రిపబ్లికన్లకు గట్టి ఎదురుదెబ్బ. ఈ ఫలితాలతో సెనేట్‌పై డెమోక్రాట్లకు నియంత్రణ లభించింది. అధ్యక్షుడి నామినేషన్లు, న్యాయమూర్తుల నియామకాలు, కీలక ప్రభుత్వ పదవుల ఆమోదం వంటి అంశాల్లో సెనేట్‌కు ఉన్న అధికారాల దృష్ట్యా ఈ పరిణామం ట్రంప్‌కు పెద్ద సవాలుగా మారనుంది.

ప్రతినిధుల సభలోనూ మారిన సమీకరణాలు

ప్రతినిధుల సభలోనూ డెమోక్రాట్లు గణనీయమైన పురోగతి సాధించారు. రిపబ్లికన్ల ఆధీనంలోని పలు నియోజకవర్గాలను కైవసం చేసుకుంటూ మెజారిటీ మెజార్టీ మార్క్‌ను అందుకున్నారు. ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలపై విచారణలు చేపట్టడానికి, వివిధ అంశాలపై అధికారులను ప్రశ్నించడానికి, ప్రభుత్వ ఖర్చులు, బడ్జెట్ ప్రతిపాదనలను పరిశీలించడానికి అవకాశం లభిస్తుంది. అధ్యక్షుడి పరిపాలనపై కాంగ్రెస్ పర్యవేక్షణ మరింత పెరుగుతుంది.

గవర్నర్ ఎన్నికల్లోనూ డెమోక్రాట్ల హవా

గవర్నర్ ఎన్నికల్లోనూ డెమోక్రాట్లు చెప్పుకోదగిన విజయాలు సాధించారు. టెక్సాస్‌లో గినా హినోజోసా విజయం సాధించి ఆ రాష్ట్ర తొలి లాటినా గవర్నర్‌గా చరిత్ర సృష్టించారు. రిపబ్లికన్ గవర్నర్ గ్రెగ్ అబాట్‌ను ఓడించడం మరో విశేషం. జార్జియాలో కీషా లాన్స్ బాటమ్స్, ఒహియోలో అమీ ఆక్టన్, ఐవోవాలో రాబ్ సాండ్ విజయం సాధించారు. ఈ విజయాలు డెమోక్రటిక్ పార్టీకి రాష్ట్రాల స్థాయిలోనూ కొత్త రాజకీయ బలాన్ని అందించాయి. ఈ ఎన్నికల ఫలితాలతో ట్రంప్ పాలనలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. ఇప్పటివరకు రిపబ్లికన్లకు కాంగ్రెస్‌లో ఉన్న ఆధిక్యం వల్ల అధ్యక్షుడి విధానాలకు పెద్దగా ప్రతిఘటన ఎదురుకాలేదు. ఇప్పుడు సెనేట్ డెమోక్రాట్ల చేతుల్లోకి వెళ్లడంతో పరిస్థితి మారుతుంది. ప్రభుత్వ నియామకాలు, న్యాయమూర్తుల ఎంపిక, విదేశాంగ విధానాలపై విచారణలు, బడ్జెట్, ప్రభుత్వ నిధుల కేటాయింపులు వంటి అంశాల్లో డెమోక్రాట్లు మరింత చురుగ్గా వ్యవహరించే అవకాశం ఉంది. ప్రతినిధుల సభ కూడా డెమోక్రాట్ల ఆధీనంలోకి వస్తే ట్రంప్ ప్రభుత్వంపై రాజకీయ, పరిపాలనా ఒత్తిడి మరింత పెరుగుతుంది. అయితే అమెరికా అధ్యక్షుడి అధికారాలు పూర్తిగా తగ్గిపోతాయని భావించకూడదు. ట్రంప్‌కు వీటో అధికారం, కార్యనిర్వాహక అధికారాలు కొనసాగుతాయి. కాంగ్రెస్‌లో డెమోక్రాట్లకు మెజారిటీ వచ్చినంత మాత్రాన ట్రంప్ విధానాలన్నీ రాత్రికిరాత్రే మారిపోవు. చట్టాల రూపకల్పనకు రెండు సభల సహకారం, అవసరమైన మెజారిటీలు, అధ్యక్షుడి ఆమోదం వంటి అంశాలు కీలకమవుతాయి.

భారత్‌పై ఎలాంటి ప్రభావం?

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలను భారత్ కూడా ఆసక్తిగా పరిశీలిస్తోంది. ముఖ్యంగా వాణిజ్య సుంకాలు, హెచ్-1బీ వీసాలు, గ్రీన్‌కార్డులు, భారతీయ ఐటీ నిపుణుల ఉద్యోగ అవకాశాలు, రక్షణ రంగ సహకారం వంటి అంశాల్లో ఈ రాజకీయ మార్పుల ప్రభావం ఉండవచ్చు. డెమోక్రాట్లకు కాంగ్రెస్‌లో బలం పెరగడం వల్ల ట్రంప్ వాణిజ్య, వలస విధానాలపై మరింత చర్చ, పర్యవేక్షణ జరిగే అవకాశం ఉంది. భారతీయ ఎగుమతిదారులకు ఇబ్బందులు కలిగించే సుంకాలపై కూడా కాంగ్రెస్‌లో ప్రశ్నలు ఎదురుకావచ్చు. అదేవిధంగా హెచ్-1బీ వీసాల విషయంలో కఠినమైన నిబంధనలు, భారతీయ ఐటీ ఉద్యోగులపై వాటి ప్రభావం వంటి అంశాలపై డెమోక్రాట్లు భిన్నమైన వైఖరిని వ్యక్తం చేసే అవకాశం ఉంది. అయితే వీసా విధానాలు, సుంకాలు తక్షణమే మారిపోతాయని భావించడం సరికాదు. వీటిపై అధ్యక్షుడికి కార్యనిర్వాహక అధికారాలు ఉన్నాయి. కాంగ్రెస్ చట్టాలు చేయగలదు, వాటిపై పర్యవేక్షణ చేపట్టగలదు. కానీ విధాన మార్పులకు ప్రత్యేక చట్టపరమైన ప్రక్రియలు అవసరం.

"డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా"... ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు రిపబ్లికన్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పారు. ఎన్నికల ఫలితాలకు ముందు వరకు డెమోక్రాట్లు ప్రవేశపెట్టే ప్రతీ బిల్లును వీటో చేస్తానని గర్జించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా స్వరం మార్చారు. దేశ శ్రేయస్సు కోసం డెమోక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ప్రకటించారు. "ఈ ఎన్నికల్లో నేను బ్యాలెట్‌పై లేను, ఒకవేళ ఉండుంటే మేము భారీ మెజారిటీతో గెలిచేవాళ్లం" అని వ్యాఖ్యానించారు ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు అంచనాలకు మించి ప్రతినిధుల సభ (హౌస్), సెనెట్ రెండింటినీ కైవసం చేసుకోవడంతో ట్రంప్ ఈ మేరకు దిగిరాక తప్పలేదు.ఎన్బీసీ న్యూస్ అంచనాల ప్రకారం, 435 స్థానాలున్న ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు 256 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. అదేవిధంగా, 100 మంది సభ్యులున్న సెనెట్‌లో కనీసం 54 స్థానాలు దక్కించుకుని స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. ధరలు తగ్గిస్తానని, ప్రజల జీవితాలను సులభతరం చేస్తానని 2024 ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆ తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారు. అమెరికాను గొప్పగా మార్చేందుకు టారిఫ్‌లు విధించడం, ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు కోసం యుద్ధానికి దిగడం, వైట్‌హౌస్ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇవే ఆయన పట్ల ప్రజాగ్రహానికి కారణమయ్యాయి.రిపబ్లికన్లకు కంచుకోటలైన టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి రాష్ట్రాల్లో పార్టీ ఓటమి పాలుకావడం ఆయన అంచనాలను తీవ్రంగా దెబ్బతీసింది. కాన్సాస్‌లో 95 ఏళ్ల రిపబ్లికన్ల గుత్తాధిపత్యానికి తెరదించుతూ డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ సెనెటర్‌గా గెలిచారు. టెక్సాస్ గవర్నర్‌గా హినా హినోజోసా ఎన్నికవడంతో 36 ఏళ్ల రిపబ్లికన్ పాలనకు ముగింపు పడింది. ట్రంప్ స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థులు సైతం ఓడిపోవడం ఆయనకు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ.ఈ ఓటమితో పార్టీపై ట్రంప్ పట్టు సడలుతుందని, ఆయనను వ్యతిరేకించే వారి సంఖ్య పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిగా మిగిలిన రెండేళ్లలో ఆయన దూకుడుకు కళ్లెం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితాల తర్వాత 'పొలిటికో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "రెండేళ్ల పాటు ప్రతీదాన్నీ వీటో చేస్తూ కూర్చోవాలని నేను అనుకోవడం లేదు. దేశానికి మంచి జరిగేలా చూసేందుకు డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తాం" అని తెలిపారు.అయితే, డెమోక్రాట్లు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినిధుల సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న హకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ, "మేము కీలకమైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న వ్యవస్థలు సరిగా లేవు. అమెరికా ప్రజలకే ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ కావాలి" అని స్పష్టం చేశారు. దీంతో రాబోయే రెండేళ్లలో ట్రంప్ పాలన ఎలా సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

అమెరికా సెనేట్‌కు తొలి ముస్లిం.. చరిత్ర సృష్టించిన అబ్దుల్

అమెరికా రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దేశంలో అత్యంత కీలకమైన స్వింగ్ స్టేట్‌గా పరిగణించే మిచిగన్‌లో సెనేట్ స్థానానికి జరిగిన హోరాహోరీ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి చెందిన అబ్దుల్ అల్-సయీద్ విజయం సాధించారు. తన సమీప రిపబ్లికన్ ప్రత్యర్థి మైక్ రోజర్స్‌పై గెలుపొందారు. దీంతో అమెరికా సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లిం వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు.ఈజిప్టు వలసదారుల కుమారుడైన అల్-సయీద్, గతంలో ప్రజారోగ్య అధికారిగా పనిచేశారు. ఇప్పటివరకు ఏ ఎన్నికల్లోనూ గెలవని ఆయన 'యూనివర్సల్ హెల్త్‌కేర్ (అందరికీ ఆరోగ్యం)', ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గింపు, ఇజ్రాయెల్ విధానాలపై తీవ్ర విమర్శలు వంటి ప్రగతిశీల అజెండాతో ప్రజల్లోకి వెళ్లారు. అయితే, అల్-సయీద్ విజయం అంత సులభంగా దక్కలేదు. ప్రైమరీ ఎన్నికలతో పాటు సాధారణ ఎన్నికల్లోనూ ఆయనకు వ్యతిరేకంగా ప్రత్యర్థి వర్గాలు భారీగా డబ్బు ఖర్చుపెట్టాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్‌కు అనుకూల సంస్థ అయిన 'అమెరికన్ ఇజ్రాయెల్ పబ్లిక్ అఫైర్స్ కమిటీ' (ఏఐపీఏసీ), ఆయన ఓటమి కోసం ఏకంగా 30 మిలియన్ డాలర్లు వెచ్చించింది. దీనికి తోడు రిపబ్లికన్లు ఆయనను ఉగ్రవాద సంస్థలతో ముడిపెడుతూ, దేశభక్తిని ప్రశ్నిస్తూ తీవ్ర ప్రచారం చేశారు.సొంత పార్టీలోనే అల్-సయీద్ తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రైమరీలో ఆయనపై పోటీ చేసిన హేలీ స్టీవెన్స్, ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అందరినీ ఆశ్చర్యపరుస్తూ రిపబ్లికన్ అభ్యర్థి మైక్ రోజర్స్‌కు మద్దతు ప్రకటించారు. యూదు సమాజం ఆందోళనలను అల్-



సయీద్ సరిగా పరిష్కరించలేదని ఆమె ఆరోపించారు. దీంతో డెట్రాయిట్‌లోని నల్లజాతీయులు, యూదు ఓటర్ల మద్దతు కూడగట్టడం ఆయనకు సవాలుగా మారింది. చివరికి బరాక్ ఒబామా, కమలా హ్యారిస్ వంటి అగ్రనేతలు ప్రచారం చేసి పార్టీ శ్రేణులను ఏకం చేయాల్సి వచ్చింది.ఈ గెలుపు డెమోక్రటిక్ పార్టీలోని అభ్యుదయ, ప్రగతిశీల వర్గానికి భారీ స్థైర్యాన్ని ఇచ్చింది. 2028 అధ్యక్ష ఎన్నికల ముందు, తమ అజెండాతో స్వింగ్ స్టేట్స్‌లో కూడా గెలవగలమని నిరూపించినట్లయింది.

దెబ్బకొట్టిన గూగుల్- అయిదు దేశాల టెక్కీలు ఇకపై.. !!



టెక్ జెయింట్ గూగుల్.. తన నిర్వహణ వ్యయాలను తగ్గించుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా కంపెనీకి చెందిన పలు కీలక విభాగాల్లోని వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్లు ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోసం భారీగా నిధులు కేటాయిస్తోన్న నేపథ్యంలో సంస్థాగత వ్యయాన్ని అదుపులో ఉంచుకోవడానికి గూగుల్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ లో ప్రారంభించిన ఈ పథకాన్ని కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, స్విట్జర్లాండ్ కు విస్తరించింది. ఆయా దేశాల్లో పని చేస్తోన్న గూగుల్ ఉద్యోగులకు ఇది అందుబాటులోకి వచ్చింది. ఈ వాలంటరీ ఎగ్జిట్ ప్యాకేజీ అనేది గూగుల్ లో ఉన్న అన్ని విభాగాలకు సమానంగా వర్తించట్లేదు. ఏఐ రీసెర్చ్ వింగ్ డీప్‌మైండ్ తో పాటు క్లౌడ్ కంప్యూటింగ్ విభాగం గూగుల్ క్లౌడ్ ను ఇందులో నుంచి మినహాయించారు. రాబోయే కాలంలో ఏఐ, క్లౌడ్ కు విపరీతంగా డిమాండ్ ఉంటుందని అంచనా వేసిన గూగుల.. ఈ రెండింట్లో కూడా నూతన నియామకాలను కొనసాగించనుంది. ఈ రెండు మినహా ఇతర విభాగాల్లో ఉద్యోగుల సంఖ్యను పునర్వ్యవస్థీకరించాలని భావిస్తోంది. వాలంటరీ ఎగ్జిట్ విధానం ఇప్పటికే స్విట్జర్లాండ్ లో మొదలైంది కూడా. జ్యూరిచ్ లో గూగుల్‌కు చెందిన ఇంజినీరింగ్ సెంటర్ లో సుమారు 5,000 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. జూన్ లోనే ఇక్కడి ఉద్యోగులకు ఈ ఆఫర్ అందింది. గూగుల్ అందించిన ప్యాకేజీ నిబంధనల ప్రకారం వాలంటరీగా సంస్థను వీడి వెళ్లే ఉద్యోగికి.. అతను పని చేసిన ప్రతి ఒక సంవత్సరానికి గాను ఒక నెల వేతనాన్ని పరిహారంగా చెల్లిస్తారు. దీనికి ఓ పరిమితి ఉంది. ఏ ఉద్యోగికైనా గరిష్టంగా 12 నెలల వేతనానికి సరిపడా మొత్తం మాత్రమే ప్యాకేజీగా లభిస్తుంది. గూగుల్ మాత్రమే కాకుండా ఇతర ప్రధాన టెక్ కంపెనీలు కూడా తమ మానవ వనరుల అవసరాలను పునఃపరిశీలిస్తోన్నాయి. మైక్రోసాఫ్ట్ కూడా ఇటీవల అమెరికా, కెనడా, బ్రిటన్ , భారత్‌లలోని దాదాపు 60,000 మంది ఉద్యోగులకు బైఅవుట్ ఆఫర్‌ను ప్రకటించింది. 2.23 లక్షల మంది మొత్తం ఉద్యోగుల్లో లెవెల్ 70 లేదా అంతకంటే తక్కువ స్థాయిలో పనిచేస్తున్న 27 శాతం మంది ఉద్యోగులు ఈ వాలంటరీ బైఅవుట్ ప్యాకేజీకి అర్హులు. =వషశీఎవఅనవ ళీశీతో శీబ దీపావళి వేళ.. బిగ్ షాక్: భారీగా పెరిగిన అమూల్ రేట్లు ఏఐ, డేటా సెంటర్ల నిర్మాణానికి మైక్రోసాఫ్ట్ బిలియన్ల కొద్దీ డాలర్లను కేటాయిస్తోంది. ఏప్రిల్‌లో స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని జూలైలో 4,800 మంది ఉద్యోగుల కోత పెట్టిన మైక్రోసాఫ్ట్.. ఇప్పుడు మరో దఫా వాలంటరీ బైఅవుట్ ను ప్రకటించింది. దీనికి అంగీకరించిన మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు డిసెంబర్ చివరి నాటికి కంపెనీని వీడాల్సి ఉంటుంది.

జాబ్ వదిలేస్తే బంపర్ ఆఫర్

భారత టెక్కీలకు మైక్రోసాఫ్ట్ కీలక ప్రకటన



క్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కీలక ప్రకటన చేసింది. భారత్, అమెరికా, బ్రిటన్, కెనడాల్లో పనిచేస్తోన్న 60,000 ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా వాలంటరీ ఎగ్జిట్ ప్రోగ్రామ్ ను అమలు చేయనున్నట్లు వెల్లడించింది. ఉద్యోగాల నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలని భావించే వారికి ఆర్థిక ప్యాకేజీతో పాటు కెరీర్ గైడెన్స్ కూడా అందించనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా భారత్ కు చెందిన ఉద్యోగులు తమ నిర్ణయాన్ని వెల్లడించడానికి ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ వరకు గడువు ఇచ్చింది మైక్రోసాఫ్ట్. భారత్ లో మైక్రోసాఫ్ట్ లో దాదాపు 23,000 మంది ఉద్యోగులు పనిచేస్తోన్నారు. వీరిలో ఎంతమందికి ఈ వాలంటరీ ఎగ్జిట్ కు అర్హత ఉందనే విషయంపై సంస్థ యాజమాన్యం పూర్తి స్పష్టత ఇవ్వలేదు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో కలిపి మొత్తం 60,000 మంది ఉద్యోగులు ఈ స్వచ్ఛంద నిష్క్రమణ ఆఫర్ పరిధిలోకి వస్తారని పేర్కొంది. ఏఐ ఎక్స్‌పీరియన్సెస్, కోపైలట్, సైనాప్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఎక్స్‌బాక్స్, విండోస్ + డివైసెస్ సహా ఇతర విభాగాలలోని ఉద్యోగులను దీని పరిధిలోకి తెచ్చిందా సంస్థ యాజమాన్యం. ఇందులో నుంచి మార్కెటింగ్, కమర్షియల్ బిజినెస్, సెక్యూరిటీ టీమ్ ను మినహాయించారు. స్వచ్ఛందంగా సంస్థను వీడేందుకు సిద్ధపడే ఉద్యోగులకు లేఆఫ్ పరిహారాల తరహాలోనే మంచి బెనిఫిట్స్ అందుతాయని మైక్రోసాఫ్ట్ తెలిపింది. ప్రతి సంవత్సరానికి ఒక నెల బేసిక్ శాలరీని పరిహారంగా ఇవ్వనున్నట్లు వివరించింది. దీనితో పాటు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పొడిగిస్తుందా సంస్థ. ఉద్యోగాలను వదులుకునే వారికి ఇతర కంపెనీల్లో నూతన అవకాశాలను దక్కించుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా కెరీర్ ట్రాన్సిషన్ సర్వీసులను కూడా అందుబాటులో తెస్తుంది. ఈ వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్ లెవెల్ 70, అంతకంటే తక్కువ స్థాయిలో ఉన్న ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుందని మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అమీ కోల్‌మన్ వెల్లడించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అడాప్టేషన్ అనంతరం చోటు చేసుకుంటోన్న మార్పులకు అనుగుణంగా వర్క్‌ఫోర్స్‌ను పునర్వ్యవస్థీకరించుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీనికి అర్హులైన 60,000 మంది ఉద్యోగులకు కూడా త్వరలోనే మెయిళ్లను పంపుతామని అన్నారు. ఉద్యోగుల సంఖ్యను కుదించుకుంటూనే భారత్ లో క్లౌడ్ ఇన్ ఫ్రా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మానవ వనరుల నైపుణ్యాభివృద్ధికి 20.5 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టనున్నామని అన్నారు. 2030 నాటికి భారత్ లో సుమారు రెండు కోట్ల మందికి ఏఐ బేస్డ్ ట్రైనింగ్ ఇవ్వాలనే తమ లక్ష్యమని వివరించారు.

మా ఓటమికి ఇరాన్ యుద్ధమే కారణం..

అయినా మళ్లీ అదే చేస్తా : ట్రంప్

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఎదుర్కొన్న ఎదురుదెబ్బలకు ఇరాన్‌తో జరిగిన యుద్ధమే ఒక ముఖ్య కారణమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. యుద్ధం కారణంగా స్వల్పకాలంలో పెట్రోల్ ధరలు పెరగడం, ఎన్నికల్లో పార్టీ పనితీరుపై ప్రభావం చూపిందని ఆయన అంగీకరించారు. అయినప్పటికీ, తాను తీసుకున్న సైనిక నిర్ణయాన్ని ఆయన బలంగా సమర్థించుకున్నారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.ఇరాన్‌ను అణ్వాయుధాలు సంపాదించకుండా నిరోధించడం అమెరికా జాతీయ భద్రతకు అత్యంత కీలకమని ట్రంప్ స్పష్టం చేశారు. "మళ్లీ ఆ పని చేయాల్సి వస్తే, కచ్చితంగా మళ్లీ అదే చేస్తాను" అని ఆయన అన్నారు. ఇరాన్‌తో యుద్ధానికి రాజకీయంగా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందా అని అడిగిన ప్రశ్నకు "అవును, చెల్లించుకున్నాం" అని సమాధానమిచ్చారు. ఉపాధ్యక్షుడు జె. డి. వాన్స్ కూడా ఎన్నికల ఫలితాలను యుద్ధంతో ముడిపెడుతూ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ సమర్థించారు. ఆ పోస్ట్ గురించి తనకు తెలుసని, అది సరైనదేనని అన్నారు.అమెరికా చేపట్టిన సైనిక చర్యల వల్ల ఇరాన్ నౌకాదళం, వాయుసేన, గగనతల రక్షణ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే, హర్ముజ్ జలసంధి ద్వారా చమురు రవాణా యుద్ధానికి ముందు కంటే పెరిగిందని చెప్పినప్పటికీ, అందుకు సంబంధించిన గణాంకాలను ఆయన వెల్లడించలేదు.తన ప్రచార ర్యాలీలు విఫలమయ్యాయన్న వాదనను కూడా ట్రంప్ తోసిపుచ్చారు. "బ్యాలెట్‌పై నా పేరు ఉండి ఉంటే, మేమే గెలిచేవాళ్లం" అని ధీమా వ్యక్తం చేశారు. తన ర్యాలీలకు వచ్చిన జనసందోహం, తనపై ఉన్న అభిమానం, ఇతర రిపబ్లికన్ అభ్యర్థులకు ఓట్ల రూపంలో బదిలీ కాలేదని ఆయన విశ్లేషించారు. ఎన్నికల ఫలితాల అనంతరం డెమోక్రాట్లతో కలిసి పనిచేయడం గురించి మాట్లాడుతూ, వారు విధ్వంసకర వైఖరిని అవలంబించనంత వరకు వారితో కలిసి పనిచేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అభిశంసన ప్రయోగానికి అవకాశం ఉందన్న ఆందోళనలను ఆయన కొట్టిపారేశారు. సరైన కారణాలు లేకుండా ఆ దిశగా ముందుకెళ్తే డెమోక్రాటిక్ పార్టీకే నష్టమని హెచ్చరించారు.

ఎన్నికల ఫలితాలు చెల్లుబాటే

ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ బుధవారం గత వారం జరిగిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలను చట్టబద్ధంగా ఆమోదించారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సంప్రదింపులు ప్రారంభించారు.ఎన్నికల ఫలితాలను తప్పుబట్టేందుకు ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు చేస్తున్న ప్రయత్నాలకు ఈ పరిణామం ఎదురుదెబ్బగా మారింది. ఎన్నికల్లో నెతన్యాహు, ఆయన మిత్రపక్షాలు పార్లమెంటులో మెజారిటీ కోల్పోయాయి. అదే సమయంలో అరబ్ పార్టీలకు చారిత్రక విజయం దక్కింది."ఎన్నికలు ముగిశాయి. ఇప్పుడు వాస్తవాలను అంగీకరించాల్సిన సమయం" అని హెర్జోగ్ అన్నారు.అరబ్ పార్టీల నేతృత్వంలోని కూటములు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని, విదేశీ సాయం తీసుకుని ఓట్లను దొంగిలించాయని నెతన్యాహు, ఆయన మద్దతుదారులు పదేపదే ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు వారు ఎలాంటి ఆధారాలు చూపలేదు.బుధవారం రాత్రి హెర్జోగ్ రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఎవరికి అవకాశం ఇవ్వాలన్నది నిర్ణయించేందుకు ఈ సంప్రదింపులు చేపట్టారు. ఈ ప్రక్రియ ద్వారా నెతన్యాహు ప్రత్యర్థులు అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది.

అగ్రరాజ్యంలో మనోళ్ల ప్రభంజనం.. ఎన్నికల్లో 30 మందికి పైగా ఘన విజయం



అగ్రరాజ్యం అమెరికా రాజకీయాల్లో భారత సంతతి అభ్యర్థులు తమ సత్తా చాటారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో సుమారు 30 మందికి పైగా భారతీయ అమెరికన్లు చట్టసభలకు ఎన్నికై తమ ప్రాబల్యాన్ని చాటుకున్నారు. ముఖ్యంగా రెండు కీలక రాష్ట్రాలైన మిచిగన్, అరిజోనాలలో శాసనసభలకు నాయకత్వం వహించే స్థాయికి ఎదిగి చారిత్రక విజయాలను నమోదు చేశారు. గెలిచిన వారిలో అత్యధికులు డెమోక్రాటిక్ పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం.మిచిగన్ రాష్ట్రంలో డెమోక్రాట్లు తిరిగి అధికారం కైవసం చేసుకోవడంలో రంజీవ్ పురి కీలక పాత్ర పోషించారు. ఆయన 24వ డిస్ట్రిక్ట్ నుంచి 66% ఓట్లతో ఘన విజయం సాధించారు.

డెమోక్రాటిక్ కాకస్ ఆయనను ఎన్నుకుంటే, మిచిగన్ ప్రతినిధుల సభకు స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టే తొలి భారతీయ అమెరికన్, తొలి సిక్కుగా రికార్డు సృష్టిస్తారు. మిచిగన్ ప్రజలు మార్పు కోరుకున్నారని, అందుకే డెమోక్రాట్లకు అధికారం అప్పగించారని రంజీవ్ పురి వ్యాఖ్యానించారు.అరిజోనాలోనూ ఇదే తరహాలో ప్రియా సుందరేశన్ సెనేట్‌కు తిరిగి ఎన్నికయ్యారు. 18వ డిస్ట్రిక్ట్ నుంచి 66% ఓట్లతో గెలిచిన ఆమె, రాష్ట్ర సెనేట్‌కు నాయకత్వం వహించే అవకాశాలున్నాయి. సెనేట్ ప్రెసిడెంట్ లేదా మెజారిటీ లీడర్ పదవికి ఆమె పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. జనవరి నాటికి తమ పార్టీ మూడు కీలక పదవులను (ట్రైఫెక్టా) దక్కించుకుంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ఇదే సమయంలో, పలువురు భారత సంతతి అభ్యర్థులు చారిత్రక విజయాలు నమోదు చేశారు. జార్జియాలో జ్యోత్ సింగ్ గెలుపొందీ, ఆ రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన తొలి భారతీయ, సిక్కు అమెరికన్‌గా నిలిచారు. టెక్సాస్‌లో పూజా సేథి విజయం సాధించి, టెక్సాస్ శాసనసభకు ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్ మహిళగా, తొలి ఆసియన్ అమెరికన్ డెమోక్రాటిక్ మహిళగా చరిత్ర సృష్టించారు.లాస్ ఏంజెల్స్‌లో నగర కౌన్సిల్ సభ్యురాలు నిత్యా రామన్, మేయర్ రేసులో ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

ఇల్లినాయిస్‌లో నబీలా సయ్యద్, న్యూయార్క్‌లో లీసా కౌల్ వంటి వారు రిపబ్లికన్ల సిట్టింగ్ స్థానాలను కైవసం చేసుకుని డెమోక్రాట్లకు అదనపు బలాన్నిచ్చారు.మొత్తం మీద ఈ ఎన్నికల్లో సిట్టింగులుగా పోటీ చేసిన భారతీయ అమెరికన్లందరూ తిరిగి గెలుపొందడం విశేషం. గెలిచిన 30 మందిలో 28 మంది డెమోక్రాట్లే కావడం, వారి గెలుపు శాతం 85%గా ఉండటం గమనార్హం. ఈ ఫలితాలు అమెరికా రాజకీయ క్షేత్రంలో భారతీయ సమాజం పెరుగుతున్న ప్రభావాన్ని, రాజకీయ నైతన్యాన్ని స్పష్టం చేస్తున్నాయి.

అమెరికా ఎన్నికల ఫలితాలతో ప్రపంచ నేతల్లో ఆశలు

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఓటమి ప్రపంచ నేతల్లో కొంత ఊరట కలిగించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో విభేదించిన పలువురు నేతలు.. అమెరికా విదేశాంగ విధానంలో దూకుడు తగ్గుతుందని ఆశిస్తున్నారు. అయితే ఈ ఫలితాలతో ఇరాన్‌తో యుద్ధం ఆగిపోతుందని, సుంకాల విధానంలో మార్పు వస్తుందని, ఉక్రెయిన్, ఐరోపా దేశాలకు అమెరికా మద్దతు పెరుగుతుందని వారు పూర్తిగా నమ్మడం లేదు.ప్రపంచవ్యాప్తంగా మితవాద ప్రజాకర్షక నేతలకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయని ప్రగతిశీల రాజకీయ నేతలు వ్యాఖ్యానించారు. ఇటీవల హంగరీ, బ్రెజిల్, స్లొవేకియాలో చోటుచేసుకున్న పరిణామాల తర్వాత అమెరికాలోనూ అదే ధోరణి కనిపిస్తోందన్నారు.స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ ఎక్స్‌లో స్పందిస్తూ.. అమెరికన్లు ద్వేషానికి, పురుషాధిక్య ధోరణికి, వాతావరణ మార్పులపై అవగాహన లేని మైఖరికి, ఉన్నత వర్గాల ప్రత్యేక హక్కులకు వ్యతిరేకంగా ఓటేశారని పేర్కొన్నారు."బ్రెజిల్‌లో ఇది జరిగింది. ఇప్పుడే అమెరికాలోనూ జరిగింది. త్వరలో స్పెయిన్‌లోనూ జరుగుతుంది" అని సాంచెజ్ రాశారు. స్పెయిన్‌లో నవంబరు 29న ఎన్నికలు జరగనున్నాయి.అమెరికన్లు 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా) విధానానికి విసిగిపోయారని, మార్పు కోరుకుంటున్నారని నార్వే విదేశాంగ మంత్రి ఎస్పెన్ బార్త్ ఐడె అన్నారు. దేశంలో విభజనరాజకీయాలకస్పష్టఫలకాలని వారు స్పష్టమైన సందేశం ఇచ్చారని చెప్పారు.

యుద్ధం ముగుస్తుందన్న ఆశ.. విధానాల్లో మార్పుపై సందేహాలు...

అమెరికా ఎన్నికల ఫలితాలతో ఇరాన్ యుద్ధం ముగించేందుకు వాషింగ్టన్‌తో పాటు ఇతర దేశాలూ దృష్టి సారిస్తాయని బ్రిటన్ ప్రధాని ఆండీ బర్న్‌హామ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ యుద్ధం వల్ల ఇంధన ధరలు పెరిగి, జీవన వ్యయం భారమైంది. ఇది అమెరికా ఓటర్ల అసంతృప్తికి ప్రధాన కారణాల్లో ఒకటిగా మారింది."ప్రపంచమంతా మనందరినీ ప్రభావితం చేస్తున్న జీవన వ్యయ సమస్యపై ఏకమయ్యే అవకాశం ఇప్పుడు వచ్చింది. మధ్యప్రాచ్యంలో ఘర్షణ ముగిసే వరకు ప్రజలపై జీవన వ్యయ భారం తగ్గించలేను" అని ఆంటీగ్వాలో జరిగిన కామన్వెల్త్ శిఖరాగ్ర సమావేశంలో బర్న్‌హామ్ అన్నారు.రష్యా ప్రారంభించిన ఉక్రెయిన్ యుద్ధంపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.అయితే ట్రంప్ మరో రెండేళ్లు అధికారంలో ఉండటంతో అమెరికా విదేశాంగ విధానంలో తక్షణ మార్పులు రావని ఐరోపా నేతలు హెచ్చరించారు. వలసలు, పవన విద్యుత్ కేంద్రాల నుంచి నాటో వరకు పలు అంశాలపై ట్రంప్ ఐరోపా నేతలపై విమర్శలు గుప్పించారు. సుంకాలతో ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీశారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలన్న ఆకాంక్షనూ వ్యక్తం చేశారు.అమెరికా ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా తమ భద్రత, సంపదను కాపాడుకోవాలని ఆస్ట్రియా విదేశాంగ మంత్రి బియాటే మైనల్-రైజింగర్ అన్నారు. "కాన్సాస్, ఐవా రాష్ట్రాల ప్రజలు ఎలా ఓటేస్తారన్న దానిపై మా భవిష్యత్తు ఆధారపడకూడదు. అందుకే మా రక్షణ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాం" అని చెప్పారు.అమెరికా-ఐరోపా సంబంధాల్లో తక్షణ మార్పులు రావని చాథమ్ హౌస్ పరిశోధనా సంస్థకు చెందిన లారెల్ రాప్ అభిప్రాయపడ్డారు. ఐరోపా నుంచి అమెరికాకు రక్షణ రంగంలో ఎంత ప్రయోజనం కలుగుతుందన్న దానిపై ట్రంప్ ప్రభుత్వానికి అనుమానాలు ఉన్నాయని తెలిపారు.అమెరికా పొరుగుదేశాలైన మెక్సికో, కెనడా కూడా ఎన్నికల ఫలితాలపై ఆచితూచి స్పందించాయి. అమెరికాతో సంబంధాలు మెరుగుపడతాయో లేదో వేచి చూడాలని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ అన్నారు.అమెరికాతో వాణిజ్య యుద్ధాన్ని ముగించే చర్చల్లో ఈ ఫలితాలు కెనడాకు బలాన్ని ఇస్తాయో లేదో ఇప్పుడే చెప్పలేమని ఆ దేశ వాణిజ్య మంత్రి డొమినిక్ లెబ్లాంక్ పేర్కొన్నారు. కొత్త కాంగ్రెస్ జనవరిలో బాధ్యతలు చేపడుతుందని, అప్పటి వరకు ట్రంప్ ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని చెప్పారు.అయితే అమెరికా సుంకాలతో తీవ్రంగా దెబ్బతిన్న అంటారియో ప్రావిన్స్ ముఖ్యమంత్రి డగ్ ఫోర్డ్ మాత్రం డెమోక్రాట్ల విజయాన్ని కెనడా, ప్రపంచానికి లాభంగా అభివర్ణించారు. దీనివల్ల కెనడాకు చర్చల్లో మరింత బలం వస్తుందని అన్నారు."వీధిలో గంతులు వేస్తూ సంబరాలు చేసుకున్నా" అని ఫోర్డ్ వ్యాఖ్యానించారు.

రష్యా దాడులతో ఉక్రెయిన్‌లో అంధకారం .. 40కి చేరిన మృతులు

రష్యా దాడులతో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో బుధవారం గంటల తరబడి విద్యుత్తు, నీటి సరఫరా నిలిచిపోయింది. మరోవైపు దక్షిణ ఉక్రెయిన్‌లోని ఓ గ్రామంపై రష్యా జరిపిన భీకర దాడిలో మృతుల సంఖ్య 40కి చేరిందని అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ వెల్లడించారు. దాదాపు ఐదేళ్ల యుద్ధకాలంలో ఆ ప్రాంతంలో చోటుచేసుకున్న అత్యంత ప్రాణాంతక దాడుల్లో ఇదొకటని పేర్కొన్నారు. సోమవారం జపోరిజియా ప్రాంతంలోని కొమిషువాఖా గ్రామంలో రష్యా ప్రయోగించిన పలు గైడెడ్ బాంబులు ఓ పాత పాఠశాల, దాని సమీపంలోని ఆశ్రయ కేంద్రంపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడి ప్రజలు మానవతా సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ దాడిలో చనిపోయిన వారితో పాటు మరో 30 మంది శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని జెలెన్స్కీ తెలిపారు."ఈ దారుణ దాడిపై ప్రపంచ దేశాల నుంచి పెద్దగా స్పందన రాలేదు. ఉక్రెయిన్, ఉక్రెయిన్ ప్రజలపై రష్యా ఇప్పటివరకు చేసిన వేలాది యుద్ధ నేరాల మాదిరిగానే దీనిపైనా గట్టిగా స్పందించాలి. చెడును అడ్డుకోకపోతే అది మరింత పెచ్చుమీరుతుంది" అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.రష్యా మైనాకి దాడులు మాత్రం ఆగడం లేదు. కీవ్‌లో నీరు, విద్యుత్తు సరఫరా పునరుద్ధరించే వరకు ప్రజలు బహిరంగ తాగునీటి కేంద్రాలను ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాల్లో అత్యవసర సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అక్కడ ప్రజలకు వేడి టీ అందించడంతో పాటు మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలకు ఛార్జింగ్ పెట్టుకునే సదుపాయం కల్పించారు.బుధవారం తెల్లవారుజామున రష్యా 310 డ్రోన్లతో దాడి చేసిందని ఉక్రెయిన్ మైనాక దళం వెల్లడించింది. వీటిలో 81 జెట్ ఇంజిన్లతో పనిచేసే డ్రోన్లు ఉన్నాయని తెలిపింది. వివిధ రకాల 272 డ్రోన్లను కూల్చివేసినట్లు లేదా వాటి దాడులను అడ్డుకున్నట్లు పేర్కొంది. 2024లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఇద్దరు రష్యా ఉన్నతాధికారులపై అరెస్టు వారెంట్లు జారీ చేసినప్పటికీ ఉక్రెయిన్‌లో పౌర మౌలిక సదుపాయాలపై దాడులు కొనసాగుతున్నాయి. పౌరులపై దాడులకు ప్రణాళికలు రూపొందించడంలో ఈ అధికారులు కీలక పాత్ర పోషించారని కోర్టు ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.

యుద్ధానంతర పునర్నిర్మాణంపై చర్చలు...

యుద్ధం ముగిసిన తర్వాత ఉక్రెయిన్‌ను పునర్నిర్మించేందుకు అవసరమైన భారీ నిధులు, సహాయంపై బుధవారం బ్రస్సెల్స్‌లో కీలక సమావేశం జరిగింది. యూరోపియన్ కమిషన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ భేటీకి అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, నాటో, ప్రపంచ బ్యాంకు, యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు హాజరయ్యారు. యుద్ధానంతరం ఉక్రెయిన్ ఆర్థిక అభివృద్ధి, సౌభాగ్యానికి సంబంధించిన ప్రణాళికలను మెరుగుపరచడంపై చర్చించినట్లు యూరోపియన్ కమిషన్ వెల్లడించింది.చర్చల్లో రష్యా నుంచి ఎలాంటి రాయితీలు కోరాలన్న అంశానికే ప్రాధాన్యం ఇవ్వాలని ఈయూ విదేశాంగ విధాన విభాగం అధిపతి కాజా కల్లాస్ అన్నారు. ఇప్పటివరకు జరిగిన చర్చల్లో ఉక్రెయిన్ ఏం వదులుకోవాలి? ఎలాంటి రాయితీలు ఇవ్వాలి? అనే అంశాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారని ఆమె వ్యాఖ్యానించారు.వచ్చేవారం అమెరికా మధ్యవర్తిత్వంలో మరో విడత శాంతి చర్చలు జరగనున్నాయి. రష్యా పూర్తిస్థాయి దండయాత్ర ప్రారంభించి నాలుగున్నరేళ్లకు పైగా గడిచిన నేపథ్యంలో ఈ చర్చలకు ప్రాధాన్యం ఏర్పడింది.

కెన్యాలో ఖనిజ తవ్వకాలపై ఆందోళన

కెన్యాలోని మ్రిమా హిల్ ప్రాంతంలో విలువైన ఖనిజాల తవ్వకాలకు ప్రభుత్వం సిద్ధమవుతుండటంతో స్థానిక రైతులు, గిరిజన పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తవ్వకాల వల్ల తమ పంట భూములు కోల్పోవాల్సి వస్తుందని రైతులు భయపడుతున్నారు. తమ పూర్వీకుల సమాధులున్న పవిత్ర అడవికి నష్టం వాటిల్లుతుందని డిగో గిరిజన పెద్దలు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలు వెల్లడించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మ్రిమా హిల్ అడవుల్లో నియోబియం, అరుదైన భూ మూలకాలు ఉన్నాయి. విద్యుత్ వాహనాల మోటార్లు, పవన విద్యుత్ టర్బైన్లు, రక్షణ రంగ సాంకేతికతల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ ఖనిజాల సరఫరాపై చైనా ఆధిపత్యాన్ని తగ్గించుకునేందుకు పలు దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కెన్యా ప్రభుత్వం తవ్వకాలకు సిద్ధమవుతోంది.కెన్యా హిందూ మహాసముద్ర తీర ప్రాంతంలో, టాంజానియా సరిహద్దుకు సమీపంలో నివసిస్తున్న ప్రజలకు తవ్వకాలు ఎక్కడ చేపడతారో, వాటి వల్ల తమ వ్యవసాయం, జీవనోపాధి, పవిత్ర స్థలంపై ఎలాంటి ప్రభావం ఉంటుందో తెలియడం లేదు.మ్రిమా రైతుల సంఘం అధ్యక్షుడు జస్టస్ మెవెరో మాట్లాడుతూ, తమకు ఇప్పటివరకు తవ్వకాల ప్రక్రియ గురించి ఎలాంటి సమాచారం అందలేదన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో, ఎలాంటి ప్రభావం ఉంటుందో తెలియడం లేదని చెప్పారు.

ఇటీవల ఓ ఉదయం రైతులు ప్రధాన రహదారి పక్కన సమావేశమయ్యారు. ఎదురుగా కనిపిస్తున్న అడవితో కూడిన కొండను చూస్తూ తవ్వకాల ప్రణాళికలపై చర్చించారు. ఏం జరుగుతుందో వేచి చూస్తున్నామని మెవెరో చెప్పారు.

ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది: రాహుల్ గాంధీ



పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. ఆయనకు మద్యపానం సేవించే అలవాటు ఉందని, అలాంటి వ్యక్తి రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్యను ఎలా పరిష్కరించగలరని ప్రశ్నించారు. సంగ్రూర్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో పాల్గొన్న రాహుల్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.గతంలో తాను, భగవంత్ మాన్ లోక్‌సభ సభ్యులుగా ఉన్నప్పటి సంఘటనను రాహుల్ గుర్తు చేసుకున్నారు. "ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది" అని సంచలన ఆరోపణ చేశారు. మద్యం సేవించడం ఆయన వ్యక్తిగత విషయం కావొచ్చని, కానీ ప్రతిరోజూ మత్తులో ఉండే ముఖ్యమంత్రి మాదకద్రవ్యాల వల్ల కలిగే బాధను ఎలా అర్థం చేసుకోగలరని నిలదీశారు. పంజాబ్‌కు డ్రగ్స్ సమస్యపై నిజంగా బాధపడే నాయకుడు అవసరమని అన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం పంజాబ్‌ను పాలించడం లేదని, రాష్ట్రాన్ని ఢిల్లీ నుంచి నడిపిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. "పంజాబ్ పాలనను సగం అరవింద్ కేజ్రీవాల్, మరో సగం కేంద్ర హోంమంత్రి అమిత్ షా నడుపుతున్నారు. భగవంత్ మాన్ కేవలం అక్కడ కూర్చుంటున్నారు అంతే" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పంజాబ్ నుంచే పాలన అందిస్తామని స్పష్టం చేశారు. మూడేళ్లలో డ్రగ్స్‌ను అంతం చేస్తానన్న అమిత్ షా వ్యాఖ్యలను కొట్టిపారేసిన రాహుల్, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకాలం కొనసాగకపోవచ్చని అన్నారు.గతంలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య పెరిగిపోతోందని తాను హెచ్చరించినప్పుడు బీజేపీ, అకాలీదళ్ తన మాటలను పట్టించుకోలేదని రాహుల్ గుర్తుచేశారు. రాష్ట్రంలో డ్రగ్స్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని నిర్మూలించాలంటే పరిశ్రమలు, ఫ్యాక్టరీలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ మరోసారి సవాల్ విసిరారు. మోదీతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, కేవలం ఐదు నిమిషాల్లోనే మోదీ ఒక "దేశద్రోహి" అని, ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో కీలుబొమ్మ అని నిరూపించగలనని అన్నారు.

రూ.2 కోట్ల లంచం ఆరోపణలు..

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో కేరళం ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అనుమతించింది. 2006లో కేరళం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ కాంట్రాక్టు బిల్లులు క్లియర్ చేసేందుకు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది.అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతించినట్లు రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితల బుధవారం వెల్లడించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతుందని చెప్పారు.మలేసియాకు చెందిన ఇంజినీర్ లీ సీ బిన్ నుంచి జ్ఞానేశ్‌కుమార్ రూ.2 కోట్లు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ వీ.ఓ. సాజన్ గతంలో ఆరోపించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు (కేఎస్‌టీపీ) పనులు చేపట్టిన పాథిబెల్ సంస్థకు లీ సీ బిన్ అనుబంధంగా పనిచేశారు. ఆ సంస్థకు సాజన్ సబ్ కాంట్రాక్టర్‌గా మెటీరియల్ సరఫరా చేసేవారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను జ్ఞానేశ్‌కుమార్ నిలిపివేసి, వాటిని విడుదల చేయడానికి రూ.2 కోట్లు అడిగారని సాజన్ మీడియాకు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో లీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, ఈ విషయాన్ని తనతో చెప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం లీ ఆత్మహత్య చేసుకుని మరణించారు.జ్ఞానేశ్‌కుమార్ ప్రస్తుతం సీఈసీగా ఉన్నప్పటికీ, గతంలో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని చెన్నితల స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా విచారణకు ఆటంకం లేదని చెబుతున్నారని అన్నారు. సీఈసీ పదవికి సంబంధించిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు.గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ జ్ఞానేశ్‌కుమార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకే ఉద్దేశించినట్లు సాజన్ ఆరోపించారు. తాజా అనుమతితో ఈ వ్యవహారంపై మరోసారి విచారణకు మార్గం సుగమమైంది.

వాంగ్‌చుక్ సంస్థకు లడఖ్ సర్కార్ షాక్.. స్కూల్ కార్యకలాపాలు నిలిపివేయాలని నోటీసు

భూ కేటాయింపుల వివాదం హైకోర్టులో ఉండగానే ఈ తాజా పరిణామం



లడఖ్‌లో ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు చెందిన హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్, లడఖ్ అధ్వర్యంలోని 'డెసర్ట్ ఫ్లవర్ స్కూల్' కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని లడఖ్ కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

అవసరమైన అనుమతులు లేకుండా పాఠశాలను ప్రారంభించారని ఆరోపిస్తూ లేహ్ తహసీల్దార్ ఈ నోటీసులు జారీ చేశారు.భూ కేటాయింపుల రద్దుపై ఇప్పటికే హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్, లడఖ్ న్యాయస్థానంలో పోరాడుతున్న నేపథ్యంలో ఈ కొత్త వివాదం తెరపైకి వచ్చింది. హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్, లడఖ్ వ్యవస్థాపకురాలు, వాంగ్‌చుక్ భార్య అయిన డాక్టర్ గీతాంజలి జె. అంగ్మోకు ఈ నోటీసులు అందజేశారు. జమ్మూకశ్మీర్, లడఖ్ హైకోర్టులో భూ వివాదంపై కేసు విచారణలో ఉన్నందున, దానిని ప్రభావితం చేసేలా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని, యథాతథ స్థితిని కొనసాగించాలని నోటీసులో స్పష్టం చేశారు. పాఠశాల మేనేజింగ్ కమిటీ కోసం నిరభ్యంతర పత్రం కోరుతూ సెప్టెంబర్ 22న గీతాంజలి దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఆ అనుమతులు రాకముందే తరగతులు ప్రారంభించారని ప్రభుత్వం ఆరోపించింది.ఈ వివాదం వెనుక 2018లో హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్, లడఖ్‌కు ఫ్యాంగ్ థాంగ్‌లో ప్రత్యామ్నాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం భూమిని కేటాయించారు. అయితే, లీజు నిబంధనలు పూర్తి చేయలేదని, విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తూ 2025 ఆగస్టులో ప్రభుత్వం ఆ కేటాయింపులను రద్దు చేసింది. దీనిపై ఎఱూూ కోర్టును ఆశ్రయించగా, ప్రస్తుతం కేసు విచారణలో ఉంది. ప్రభుత్వ తాజా నోటీసులు నిరాధారమైనవని, దీనికి తాము ఇప్పటికే సమాధానం ఇచ్చామని హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్, లడఖ్ సీఈఓ గీతాంజలి తెలిపారు.

విశాఖ డిప్యూటీ మేయర్ మీద బీజేపీ కర్చీఫ్?

విశాఖ ఏపీలో అతి పెద్ద కార్పొరేషన్ అన్నది తెలిసిందే. పైగా విశాఖలో కూటమిలోని మూడు పార్టీలకు సొంతంగా బలం ఉంది. టీడీపీకి కంచుకోట విశాఖ. అలాగే బీజేపీకి కూడా కొన్ని కీలక ప్రాంతాలలో బలం మొదటి నుంచి ఉంది. జనసేనకు సామాజిక రాజకీయ సమీకరణ పరంగా అండదండలు ఉన్నాయి. దాంతో ఈ మూడు పార్టీల కాంబినేషన్ ఎంతా విజయవంతం అయింది అంటే 120 ఉన్న విశాఖ కార్పొరేషన్ లో ఏకంగా 98 వార్డులు గెలుచుకున్నాయి. ఇక ఇండిపెండెంట్లుగా గెలిచిన 8 మంది కూడా కూటమి రెబెల్స్ కావడంతో ఆ బలం కూడా కలుపుకుంటే 106 మంది ఆ వైపే ఉన్నారు. 13 వార్డులను గెలుచుకుని వైసీపీ ప్రతిపక్షంగా ఉండనుంది. ఒక్క సీటులో సీపీఎం గెలిచింది.

డిప్యూటీ కోసం :

ఈ నేపథ్యంలో డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమిలో అతి పెద్ద చర్చ సాగుతోంది. విశాఖ తమకు కీలకమైనది కాబట్టి మేయర్ సీటు ఇవ్వాలని బీజేపీ మొదటి నుంచి కోరుతూ వచ్చింది. 2024 ఎన్నికల్లో ఎంపీ సీటు కూడా ఇవ్వలేదని బీజేపీ టీడీపీ పెద్దల దృష్టికి తీసుకుని వెళ్ళింది. అయితే డిప్యూటీ మేయర్ సీటు హామీ ఆనాడే లభించింది అని ప్రచారం సాగుతోంది. ఈ హామీ మేరకే విశాఖ బీజేపీ అధ్యక్షుడు పరశురాం రాజు కార్పోరేటర్ గా పోటీ చేశారు అని అంటున్నారు. ఇపుడు ఆయనే డిప్యూటీ మేయర్ రేసులో ఉన్నారు అని అంటున్నారు. ఆయనకి ఈ పదవి ఇప్పించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గట్టిగా కృషి చేస్తున్నారు అని అంటున్నారు.

జనసేన సైతం :

ఇక ఇదే డిప్యూటీ మేయర్ పదవి కోసం జనసేన కూడా ప్రయత్నం చేస్తోంది. ఆ పార్టీ అయితే 26 కార్పోరేటర్లతో బలమైన రెండవ పార్టీగా ఉంది. దాంతో తమకు ఈ కీలక స్థానం ఇవ్వాలని కోరుతోంది. ఇక బీజేపీ వైపు నుంచి చూస్తే ఆ పార్టీకి ఎనిమిది మంది కార్పోరేటర్లు మాత్రమే ఉన్నారు. దాంతో తమకు చాన్స్ ఇవ్వాలని జనసేన నుంచి డిమాండ్ గా ఉంది. అయితే ఇక్కడ సంఖ్యాబలం ప్రాధాన్యత కాదని బీజేపీకే అవకాశం ఉండొచ్చు అని ఆ పార్టీ ధీమాగా ఉంది. ఉత్తరాంధ్రాలో మూడు కార్పోరేషన్లు ఉన్నాయి. విశాఖ విజయనగరం టీడీపీ సొంతం అయ్యాయి. త్వరలో శ్రీకాకుళం కార్పోరేషన్ ఎన్నికలు ఉన్నాయి. అది జనసేనకు ఇచ్చారు. అలా జనసేనకు ఉత్తరాంధ్రాలో మేయర్ సీటు ఉంటుందని అంటున్నారు. అవసరం అయితే విజయనగరం డిప్యూటీ మేయర్ పీఠం ఇస్తారని చెబుతున్నారు. అలా మూడు పార్టీలూ కూటమిలో సమ న్యాయం చేసుకుంటాయని చెబుతున్నారు.

ఏడాది ముందే ఎల్‌నినో ముప్పు పసిగట్టొచ్చు.. శాస్త్రవేత్తల కొత్త పరిశోధన

ప్రపంచ వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపే ఎల్‌నినో, లానినా పరిణామాలను ఏడాది ముందుగానే అంచనా వేసేందుకు శాస్త్రవేత్తలు కొత్త మార్గాన్ని గుర్తించారు. పసిఫిక్ మహాసముద్రంలో ముందుగా ఉన్న పరిస్థితులను విశ్లేషించడం ద్వారా 12 నెలల ముందే వాతావరణ మార్పులను అంచనా వేయవచ్చని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ విధానం అందుబాటులోకి వస్తే కరువులు, వరదలు, తీవ్ర ఉష్ణోగ్రతలపై ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకునేందుకు ఎక్కువ సమయం లభించనుంది.

ఎల్‌నినో–సదరన్ ఆసిలేషన్ (ఈఎన్ఎస్ఓ) అనేది పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితుల్లో ఏర్పడే మార్పులకు సంబంధించిన సహజ ప్రక్రియ. ఇందులో ఎల్‌నినో, లానినా, తటస్థ పరిస్థితులు అనే మూడు దశలుంటాయి. వీటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, కరవులు, వరదలు, పడగాలులు, తుపానులపై ఉంటుంది. సాధారణంగా ఈ పరిణామాలు దిసెంబరు సమయంలో గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయి. ఇప్పటివరకు వీటిని సుమారు ఆరు నెలల ముందుగా అంచనా వేయగలుగుతున్నారు. ఏడాది ముందే కచ్చితంగా చెప్పడం మాత్రం సవాలుగా ఉంది. ఆస్ట్రేలియాకు చెందిన సీఎస్ఐఆర్ఓ, మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయ పరిశోధకులు తొమ్మిది దేశాల వాతావరణ నమూనాల ద్వారా రూపొందించిన 7,500కు పైగా పాత అంచనాలను విశ్లేషించారు. ఈ పరిశోధనలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. అంచనా ప్రారంభించే సమయంలో పసిఫిక్ మహాసముద్రంలో లానినా పరిస్థితులు ఉంటే, ఏడాది తర్వాత వాతావరణ పరిస్థితులను కూడా నమూనాలు మెరుగ్గా అంచనా వేస్తున్నాయి. అదే తటస్థ పరిస్థితుల నుంచి అంచనా మొదలుపెడితే ఫలితాలు అంత విశ్వసనీయంగా ఉండటం లేదని గుర్తించారు. ఈ పరిశోధన వివరాలు 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.లానినా పరిస్థితులు ఉన్నప్పుడు దీర్ఘకాలిక అంచనాలు మెరుగ్గా పనిచేస్తున్నాయని పరిశోధకురాలు డాక్టర్ మాండీ ఫ్రాయండ్ తెలిపారు. తటస్థ పరిస్థితుల్లో సంప్రదాయ భౌతిక శాస్త్ర ఆధారిత నమూనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అలాంటి సందర్భాల్లో మెషీన్ లెర్నింగ్, గణాంక పద్ధతులు ఉపయోగపడే అవకాశం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు.అయితే ఈ విధానాన్ని వాతావరణ అంచనా వ్యవస్థల్లో వెంటనే అమలు చేయలేమని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. మరిన్ని పరీక్షలు అవసరమని తెలిపారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రైతులు పంటల ప్రణాళిక, నీటి నిర్వహణ, సాగునీటి వినియోగంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు ఇది ఉపయోగపడనుంది.

ఏఐ ఖర్చులపై యాపిల్ కోత .... ఉద్యోగుల బడ్జెట్‌లో భారీ తగ్గింపు

టెక్ దిగ్గజం యాపిల్ తన ఉద్యోగులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగంపై కేటాయించే రోజువారీ బడ్జెట్‌లో కోతలు విధిస్తోంది. సంస్థ ఖర్చుల నియంత్రణ చర్యలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏఐ వినియోగాన్ని ఒకవైపు ప్రోత్సహిస్తూనే, మరోవైపు దానివల్ల పెరుగుతున్న వ్యయాలను అదుపు చేసేందుకు యాపిల్ ఈ చర్యలు చేపట్టింది.'బ్లూమ్‌బెర్గ్' కథనం ప్రకారం, గత నెలలో కొంతమంది ఇంజనీర్ల రోజువారీ ఏఐ వినియోగ పరిమితిని 300 డాలర్ల నుంచి 200 డాలర్లకు తగ్గించారు. కొన్ని ఇంజనీరింగ్ బృందాలకు ఈ పరిమితిని 100 డాలర్లకు తగ్గించే ఆలోచనలో యాజమాన్యం ఉన్నట్లు సమాచారం. ఇంజనీరింగేతర విభాగాలకు ఇప్పటికే 100 డాలర్ల పరిమితి ఉండగా, దానిని కొన్ని బృందాలకు 25 డాలర్లకు తగ్గించే ప్రతిపాదనలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే, తమ ప్రాజెక్టులకు అధిక పరిమితి అవసరమైన వారు ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక అనుమతి పొందవచ్చు.ఉద్యోగులు ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, గూగుల్ జెమిని, ఆంత్రోపిక్ క్లాడ్ వంటి ఏఐ మోడళ్లను ఉపయోగించినప్పుడు అయ్యే ఖర్చును 'టోకెన్ల' రూపంలో లెక్కిస్తారు. కోడింగ్, డీబగ్గింగ్ వంటి పనులకు ఎక్కువ టోకెన్లు అవసరం కావడంతో ఇంజనీర్లకు ఇప్పటివరకు అధిక బడ్జెట్ ఉండేది.ఈ నిర్ణయంపై కంపెనీలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. గతంలో ఉన్న 300 డాలర్ల పరిమితిని చాలామంది ఉద్యోగులు పూర్తిగా ఉపయోగించుకోలేదని, కాబట్టి ఈ కోత సహజమేనని కొందరు భావిస్తున్నారు. అయితే, సెప్టెంబర్‌లో సీఈవోగా బాధ్యతలు చేపట్టిన జాన్ టర్నస్, సంస్థను తక్కువ ఖర్చుతో నడపాలని భావిస్తున్నారని, ఈ చర్యలు అందులో భాగమేనని మరికొందరు విశ్లేషిస్తున్నారు. 2026 ఆర్థిక సంవత్సరంలో యాపిల్ పరిశోధన, అభివృద్ధి ఖర్చులు 32 శాతానికి పెరగడానికి ఏఐ మౌలిక సదుపాయాల వ్యయం కూడా ఒక కారణం.ఏఐ ఖర్చులను నియంత్రించడం కేవలం యాపిల్‌కు మాత్రమే పరిమితం కాలేదు. గతంలో ఉద్యోగులను ఏఐ ప్రయోగాలకు విస్తృతంగా ప్రోత్సహించిన యాక్సెంచర్, మైక్రోసాఫ్ట్, మెటా, టెస్లా వంటి సంస్థలు కూడా ఇప్పుడు టోకెన్ ఖర్చులు పెరగడంతో అంతర్గత వినియోగంపై పరిమితులు విధిస్తున్నాయి. కాగా, ఈ నివేదికపై స్పందించేందుకు యాపిల్ ప్రతినిధి నిరాకరించారు.

భూమి వైపు దూసుకొస్తున్న నాసా స్పేస్ టెలిస్కోప్.. భారత్‌లోనూ శకలాలు పడే అవకాశం



దాదాపు 22 ఏళ్లుగా అంతరిక్ష రహస్యాలను ఛేదించిన నాసా స్పేస్ టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించేందుకు సిద్ధమైంది. దాని కక్ష్యను పెంచి మరికొంతకాలం సేవలు అందించేలా చేసేందుకు చేపట్టిన ప్రయత్నం విఫలమవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. టెలిస్కోప్‌లోని అధిక భాగం వాతావరణంలోకి ప్రవేశించే సమయంలోనే కాలిపోతుందని అంచనా వేస్తున్నారు. అయితే, కొన్ని భాగాలు మాత్రం శకలాల రూపంలో భూమిని చేరే అవకాశం ఉంది. 2004లో ప్రయోగించిన ఈ అబ్జర్వేటరీ విశ్వంలో అత్యంత శక్తిమంతమైన పేలుళ్లుగా భావించే గామా కిరణాల విస్ఫోటనాలను అధ్యయనం చేసేందుకు రూపొందించారు. తొలుత రెండేళ్లపాటు పనిచేసేలా దీన్ని రూపొందించినప్పటికీ, రెండు దశాబ్దాలకు పైగా సేవలందించింది. ఈ కాలంలో 2,000కు పైగా గామా కిరణాల విస్ఫోటనాలను గుర్తించి, వాటి సమాచారాన్ని శాస్త్రవేత్తలకు అందించింది. సూపర్‌నోవాలు, బ్లాక్‌హోల్స్, ఇతర ఖగోళ వస్తువుల అధ్యయనంలోనూ కీలక పాత్ర పోషించింది. సూర్యుడిపై పెరిగిన కార్యకలాపాల కారణంగా భూమి ఎగువ వాతావరణం విస్తరించింది. దీంతో కక్ష్యలో ఉన్న స్విఫ్ట్ టెలిస్కోప్‌పై వాతావరణ ఘర్షణ ప్రభావం పెరిగి, అది క్రమంగా కిందికి దిగడం ప్రారంభించింది. దాని కక్ష్యను పెంచేందుకు నాసా 'లింక్' అనే రోబోటిక్ అంతరిక్ష నౌకను పంపించింది. అయితే, ఆ నౌకలో తలెత్తిన నియంత్రణ సమస్యలతో టెలిస్కోప్‌ను పై కక్ష్యకు చేర్చే ప్రయత్నం విఫలమైంది. నాసా, అమెరికా అంతరిక్ష దళం అంచనాల ప్రకారం.. టెలిస్కోప్ భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించే సమయం మారే అవకాశం ఉంది. దాని కక్ష్యను బట్టి శకలాలు పడే అవకాశం ఉన్న ప్రాంతం భూమధ్యరేఖకు ఉత్తర, దక్షిణ దిశల్లో 20.6 డిగ్రీల అక్షాంశాల మధ్య ఉంటుంది. ఈ పరిధిలో దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయి. అయితే, ఏ ప్రాంతంలో శకలాలు పడతాయన్నది ముందుగానే కచ్చితంగా చెప్పలేము. నాసా అంచనా ప్రకారం.. భూమిపై ఎవరికైనా హాని కలిగే ప్రమాదం చాలా తక్కువగా ఉంది. ఒకరికి హాని కలిగే అవకాశం సుమారు 2,100 మందిలో ఒకరికి మాత్రమే ఉంటుందని అంచనా వేసింది. శకలాలు సముద్రంలో పడే అవకాశమే ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ ప్రక్రియను నాసా, అమెరికా అంతరిక్ష దళం నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.

ఆదోనిలో జనసేన రెబల్ సంచలనం..



మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఆదోని రాజకీయ పరిణామం ఆసక్తికరంగా మారింది. జనసేన పార్టీకి చెందిన రెబల్ అభ్యర్థి స్వప్న నాయకర్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఓడించి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఆదోని చైర్‌పర్సన్ స్థానం టీడీపీకి కేటాయించారు. దీంతో జనసేనకు చెందిన స్వప్న నాయకర్ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు. ఉంగరం గుర్తుపై పోటీ చేసిన ఆమెకు ఓటర్లు పట్టం కట్టారు. టీడీపీ అభ్యర్థి పి. నాగమణి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జి. ప్రణీతపై 2,061 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ ఫలితం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేనకు చెందిన అభ్యర్థి, అధికార కూటమి నిర్ణయానికి భిన్నంగా స్వతంత్రంగా పోటీ చేసి గెలవడం ప్రత్యేకతను సంతరించుకుంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని ఆదోనిలో ఈ విజయం సాధించడం జనసేన స్థానిక శ్రేణుల్లో ఆసక్తిని పెంచింది. పార్టీ అధికారిక అభ్యర్థిగా కాకుండా రెబల్‌గా పోటీ చేసినప్పటికీ ప్రజల మద్దతు పొందడం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా నిలిచింది. మొత్తంగా ఆదోని మున్సిపల్ ఎన్నికల ఫలితం స్థానిక రాజకీయ సమీకరణాలపై కొత్త చర్చకు తెరలేపింది.

బస్సులో మహిళా ఎంపీ చెంపపై కొట్టిన కాంగ్రెస్ ఎంపీ



కాంగ్రెస్ ఎంపీ శ్యామ్‌కుమార్ బర్వే. తన సహచర మహిళా ఎంపీ ప్రతిభా ధనోర్కర్‌ను చెంపదెబ్బ కొడుతున్నట్లుగా ఉన్న ఒక వీడియో దుమారం రేపుతోంది. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన ఇండియా కూటమి ర్యాలీకి బస్సులో వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీనిపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే, శివసేన నేత సంజయ్ నిరుపమ్ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు.అయితే, ఈ వివాదంపై ఎంపీ ప్రతిభా ధనోర్కర్ స్పందించారు. తన సోదరుడి లాంటి సహచర ఎంపీతో చాలా తేలికగా, సరదాగా జరిగిన సంభాషణను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం వైరల్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. "నా ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకే ప్రత్యర్థులు ఈ ఘటనను వాడుకుంటున్నారు. దివంగత మాజీ ఎంపీ బాలుభౌ ధనోర్కర్ వారసురాలిని, ఆడపులిని నేను. ఇలాంటి దుష్ప్రచారాలకు భయపడను, మరింత ధైర్యంగా నిలబడతాను" అని ఆమె సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే తీవ్రంగా స్పందించారు. ఒక మహిళపై చేయి చేసుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. "కాంగ్రెస్ పార్టీ మహిళలను గౌరవించాలి. కానీ వారి చర్యలు అలా కనిపించడం లేదు. మహిళపై చేయి ఎత్తడం తప్పు. ఆ ఎంపీ వెంటనే క్షమాపణ చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు.శివసేన నేత సంజయ్ నిరుపమ్ కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ వీడియో చాలా అభ్యంతరకరంగా ఉందని, ఇది చూశాక కాంగ్రెస్ నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. "ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలంటూ ర్యాలీకి వెళుతూ.. ఒక మహిళా ప్రజాప్రతినిధి గౌరవానికి భంగం కలిగించడం సిగ్గుచేటు" అని అన్నారు.మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతానికి చెందిన బర్వే, ధనోర్కర్ ఇద్దరూ కాంగ్రెస్ ఎంపీలు. తన భర్త, మాజీ ఎంపీ బాలుభౌ ధనోర్కర్ మరణం తర్వాత ప్రతిభ చంద్రపూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో చుట్టూ రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి.

కూటమికుట్రలకు,అరాచకాలకు చెంపపెట్టుఅనంతపురంమేయర్ విజయం:అనంత వెంకట్రామిరెడ్డి

నగరంలో ప్రశాంతత,అభివృద్ధికి పెద్దపీట వేస్తా :చిట్టూరి రమేష్ గౌడ్



అనంతపురం: అనంతపురం మేయర్ ఎన్నికలో వైయస్సార్‌సీపీ సాధించిన విజయం నగర ప్రజల ఆత్మగౌరవానికి, ప్రజాస్వామ్యానికి దక్కిన విజయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ అనంత వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. మేయర్‌గా ఎన్నికైన చిట్టూరి రమేష్ గౌడ్‌తో కలిసి పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ అనేక ఒత్తిళ్లు, ప్రలోభాలు, కుట్రలకు పాల్పడినా కార్యకర్తలు వెనక్కి తగ్గకుండా పార్టీ విజయానికి కృషి చేశారని అభినందించారు. అనంతపురం నగర ప్రజలు ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపుల మధ్య కూడా వైయస్సార్‌సీపీని ఆదరించడం తమపై మరింత బాధ్యత పెంచిందని మేయర్‌గా ఎన్నికైన రమేష్ గౌడ్ అన్నారు.

రెండేళ్లుగా నగరంలో అవినీతి రాజ్యమేలుతోంది:అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం మేయర్ ఎన్నికల్లో గెలిచింది వైఎస్సార్‌సీపీ మాత్రమే కాదు.. నగర ప్రజల ఆత్మగౌరవం. రెండున్నరేళ్లుగా కూటమి పాలనలో అనంతపురంలో ప్రశాంతత కరువైంది. భూదందాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, అధికార పార్టీ నాయకుల అవినీతి పెరిగిపోయాయి. వీటికి అడ్డుకట్ట వేయాలనే ప్రజలు మైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారు. ఎన్నికల సమయంలో మైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ ఎన్నో ఒత్తిళ్లు, ప్రలోభాలు, కుట్రలకు పాల్పడినా బెదరకుండా, అదరకుండా పార్టీ గెలుపు కోసం పని చేశారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు జరిగిన ఎన్నికల తీరును ప్రజలంతా గమనించారు. తాడిపత్రిలో మైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు పంపించి, ప్రచారానికి కూడా అవకాశం లేకుండా చేసినా 16,400 ఓట్లు వచ్చాయి. ప్రజాభిప్రాయం ఏమిటో చంద్రబాబు ఇకనైనా గుర్తించాలి. అనంతపురం ఎన్నికల్లో కలెక్టర్, ఎస్పీ సహా అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించి, నిబంధనలకు విరుద్ధంగా బూతుల్లోకి వెళ్లే అధికార పార్టీ ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన అధికారులకు వైఎస్సార్‌సీపీ తరపున ధన్యవాదాలు.

ఎమ్మెల్యేలు, మంత్రులు నగర అభివృద్ధికి సహకరించాలి:చిట్టూరు రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్ చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా ఈ ఎన్నికలు జరిగాయి. నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేశారు. ఇన్ని ఒత్తిళ్ల మధ్య కూడా వైయస్సార్‌సీపీని ఆదరించిన ప్రజలకు శిరసు వంచి కృతజ్ఞతలు చెబుతున్నా. అధికార పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజల మద్దతుతో వైయస్సార్‌సీపీ విజయం సాధించింది.

ఇందుకు పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలతో పాటు, నగర ప్రజలకు కృతజ్ఞతలు. ఎన్నికల్లో గెలిచిన, ఓడిన కార్పొరేటర్ అభ్యర్థులందరం ఒకే తాటిపై నిలబడి ప్రజలకు అందుబాటులో ఉంటాం. ప్రజలకు జవాబుదారీతనంతో, పారదర్శకంగా సేవలందిస్తూ ఇచ్చిన హామీలను కార్యాచరణతో అమలు చేస్తాం. కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను మేము అడిగేది ఒక్కటే. అనంతపురం అభివృద్ధికి సహకరించండి. రాజకీయాలు, కుట్రలు పక్కన పెట్టి ప్రజాభిప్రాయాన్ని గౌరవించండి. నగరానికి ఏది అవసరమో గుర్తించి అభివృద్ధికి తోడ్పడండి. అనంతపురం కార్పొరేషన్‌లో అవినీతికి తావు లేకుండా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం. ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటాం.

పదవి కోసం హడావిడిగా పెళ్లి... ప్లాన్ అదిరింది.. కానీ ఏమైందంటే...



సాలూరు మున్సిపల్ చైర్ పర్సన్ స్థానం కోసం టీడీపీ యువ నేత కేవలం 24 గంటల్లోనే పెళ్లి చేసుకున్నారు. కానీ ఫలితం మాత్రం దిమ్మ తిరిగేలా వచ్చింది. నిజానికి ఆ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించడంతో.. ఆ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలని తెలుగు దేశం పార్టీ నాయకుడు హర్షవర్ధన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా తన ప్రియురాలు మంజీరను ఎవరినీ పిలవకుండా గుడిలో అత్యంత హడావిడిగా వివాహం చేసుకున్నారు. ఆమెను మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా పోటీ చేయించి గెలిపించుకోవాలనే లక్ష్యంతో ఆయన ఈ పెళ్లి చేసుకున్నారు.

ఊహించని ట్విస్ట్‌లు...

తీరా కళ్యాణం అయ్యాక.. ఒక ట్విస్ట్ ఎదురైంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సీట్ల పంపకాల్లో భాగంగా సాలూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానం అనూహ్యంగా జనసేన పార్టీకి దక్కింది. దీంతో పార్టీ నుంచి తన భార్యకు టికెట్ దక్కలేదు. అయినా హర్షవర్ధన్ వెనక్కి తగ్గలేదు. భార్య మంజీరను ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దించి ఎన్నికల ప్రచారం చేశారు. అయితే ఎన్నికల ఫలితాల్లో ఆమె ఓటమిపాలయ్యారు. కానీ ఈ ఎన్నికల్లో 21వ వార్డు కౌన్సిలర్‌గా హర్ష వర్ధన్ విజయం సాధించారు. కానీ చైర్‌పర్సన్ రేసులో భార్య ఓడిపోవడంతో ఆయనకు తీవ్ర నిరాశ మిగిలింది.

బలమైన పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్...

స్థానికంగా హర్షవర్ధన్‌కు బలమైన రాజకీయ నేపథ్యం ఉంది. ఆయన 2019లో సాలూరులో టీడీపీ కౌన్సిలర్‌గా కూడా గెలిచారు. అలాగే మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి విధేయుడిగా ఆయనకు మంచి గుర్తించి, గౌరవం ఉన్నాయి. స్థానికంగా మంచి గౌరవ మర్యాదలున్నాయి. ఆయన తండ్రి వైకుంఠపు పంచముఖి కూడా గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. దీంతో హర్షవర్ధన్ తమ కుటుంబానికి సాలూరు మున్సిపల్ పీఠం దక్కుతుందనే బలంగా అంచనా వేసుకున్నారు. దానికోసం పట్టుదలగా ప్రయత్నించారు. కానీ ఊహించని క్లైమాక్స్ ఎదురైంది. అయితే కేవలం మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి కోసమే హడావిడిగా పెళ్లి చేసుకుని, ఆ స్థానం వేరే పార్టీకి వెళ్లడంతో పాటు పోటీలో కూడా ఓడిపోవడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది.

పవన్ ఇలాకాలో ఏంటీ తేడా...బిగ్ నంబర్ తోనే

ఏకంగా పదిమంది రెబెల్స్ గెలిచి మరీ తమ సత్తా చాటుకున్నారు. దాంతో మూడవ వంతు క్యాండిడేట్లు పార్టీ ఎంపిక చేసిన వారు ఓటమి చవి చూశారు.



పిఠాపురం అంటే పవన్ కళ్యాణ్ అన్నంతగా గుర్తింపు వచ్చింది. దానికి కారణం పవర్ స్టార్ గా వెండి తెరను ఏలుతూ రియల్ స్టార్ గా రాజకీయాల్లో తనకంటూ స్థానం సంపాదించుకున్న పవన్ కళ్యాణ్ 2024 ఎన్నికల్లో ఏరి కోరి ఈ సీటు నుంచి పోటీ చేశారు. అక్కడ ఆయన బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇక స్థానిక సంస్థలలో భాగంగా పిఠాపురం మునిసిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో కూటమి చైర్ పర్సన్ కే జనాలు జై కొట్టారు.

అలా జనసేనకు చెందిన దానం లాజర్ బాబు మంచి మెజారిటీతో గెలిచారు. కానీ వార్డులలో కౌన్సిలర్ల దగ్గరే తేడా వచ్చింది. ఏకంగా పది మంది రెబెల్స్ గెలిచి మరీ తమ సత్తా చాటుకున్నారు. దాంతో మూడవ వంతు క్యాండిడేట్లు పార్టీ ఎంపిక చేసిన వారు ఓటమి చవి చూశారు.

మరి ఈ తేడా ఎలా జరిగింది, ఎక్కడ లోపం ఉంది అన్నది రాజకీయంగా వాడిగా వేడిగా సాగుతోంది. జనాలకు నచ్చలేదా : చైర్మన్ గా జనసేన ఎంపిక చేసిన అభ్యర్థికి ఓటేసి పట్టం కట్టిన జనాలే వార్డుల దగ్గరకు వచ్చేసరికి గాజు గ్లాస్ కి షాక్ ఇచ్చేశారు. తమకు నచ్చిన అభ్యర్థులు రెబెల్స్ అని అంటూ వారినే గెలిపించుకున్నారు. దాంతో జనసేన ఎంపిక జనాలకు నచ్చలేదా అన్నది అంతా ఆలోచిస్తున్నారు.

అలాగే బలమైన అభ్యర్థులను వార్డులలో ఎంపిక చేసి అభ్యర్థులుగా నిలబెట్టడంలో జనసేన తడబాటు పడిందా అని కూడా అంతా చర్చించుకుంటున్నారు. పిఠాపురం అంటే ముందే చెప్పినట్లు ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ సొంత సీటు. అక్కడ ఏమి జరిగినా రాష్ట్రవ్యాప్తంగా చర్చకు ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం దీని మీదనే అంతా డిస్కషన్ చేస్తున్నారుమరో వైపు చూస్తే చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం మునిసిపాలిటీలో మొత్తానికి మొత్తం వార్డులు చైర్మన్ సహా అన్నీ కూటమి ఖాతాలోకి వెళ్లాయి.

అంతే కాదు రెబెల్స్ కూడా ఎవరూ రంగంలో లేరు, ఇక ఏపీ అంతా కూటమి పెద్దన్నగా టీడీపీ అభ్యర్థుల ఎంపిక విషయంలో మధింపు చేసింది అని అంటున్నారు. కానీ పిఠాపురం పవన్ సొంత సీటు కాబట్టి అక్కడ నిర్ణయం అంతా జనసేనకే వదిలేసింది అని అంటున్నారు.

అలా 36 వార్డులు ఉన్న పిఠాపురంలో ముందే మూడు వార్డులు ఏకగ్రీవం కాగా మిగిలిన 33 సీట్లకు ఎన్నికలు నిర్వహిస్తే ఫలితాలలో పది మంది రెబెల్స్ గెలిచి వచ్చారు. ఆ విధంగా వారు కూటమికే ఎదురు నిలిచారు. అఫ్ కోర్స్ వారు గెలిచినా కూడా కూటమికి విరుద్ధంగా రంగంలో ఉండటం మాత్రం పార్టీలను ఇబ్బంది పెట్టడమే కాదు సొంత అభ్యర్థుల ఓటమికి కారణం అయ్యారు అని అంటున్నారు.

తిరుమలలో అంతంత మాత్రంగానే భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొంత తక్కువగానే ఉంది. గురువారం కావడంతో భక్తుల రద్దీ అంతంత మాత్రంగానే ఉందని, రేపటి నుంచి మళ్లీ భక్తుల రద్దీ పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం నుంచి సహజంగా భక్తుల రద్దీ మొదలయి సోమవారం వరకూ తిరుమలలో కొనసాగుతుది. అయితే ప్రస్తుతమున్న వాతావరణ పరిస్థితులు, ఎన్నికలు జరుగుతుండటంతో ఈసారి తిరుమలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండకపోవచ్చని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు. అయినా భక్తులు ఎంత మంది వచ్చినా వారికి సులువుగానే దర్శనం కల్పిస్తామని అధికారులు తెలిపారు. సులువుగానే దర్శనం లభిస్తుందని, గత మూడు రోజుల నుంచి భక్తుల రద్దీ తక్కువగా ఉంది. అనేక కారణాలతో గత వారం నుంచి భక్తుల రద్దీ తక్కువగా ఉంది. అయినా అక్టోబరు నెలలో రికార్డు స్థాయిలో శ్రీవారికి ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. అలాగే హుండీ ఆదాయంతో పాటు లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం కూడా అంతే ఎక్కువగా ఉంది. ఇక వసతి గృహాల ద్వారా, భక్తులు అందించే విరాళాలు కూడా అధికంగానే ఉన్నాయి. అందుకే ఏడుకొండల వాడిని వడ్డీకాసుల వాడు అంటాడు. ప్రపంచంలోనే అత్యంత ఆదాయం కలిగిన ఆలయంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఇప్పటికే ప్రసిద్ధి గాంచింది. ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని ఎనిమిది కంపార్ట్ మెంట్ల లోనే భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. సర్వ దర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం ఆరు గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శీఘ్రదర్శనం టోకెన్లున్న భక్తులకు రెండు గంటల్లో దర్శనం పూర్తవుతుంది. నిన్న తిరుమల శ్రీవారిని 68,004 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో తీవం : 25,964 మంది భక్తులు తమ తలనీలాలను సమర్పించు కుని మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం 3.91 కోట్ల రూపాయలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి ప్రసాదమైన లడ్డూ విక్రయాలు 3.31 లక్షలు జరిగాయి. నిన్న తిరుమలలో అన్న ప్రసాదాన్ని స్వీకరించిన భక్తుల సంఖ్య 1.51 లక్షల మందిగా ఉంది. రేపు మరింత రద్దీ పెరిగే అవకాశముంది.

బీరాలు ఎందుకు బాబాయ్...

నేల మీదకు చూడు..నిజం తెలుస్తుంది



కూటమిలో ఉన్న బీజేపీకి తన బలమేంటో ఇప్పుడు తెలిసి వచ్చింది. ముఖ్యంగా బీరాలు పలికే మంత్రి సత్యకుమార్ కు అనంతపురం కార్పొరేషన్ కోల్పోవడం కోలుకోలేని దెబ్బ అని చెప్పాలి. తాను ధర్మవరంలో ఎమ్మెల్యేగా ఉంటూ అనంతపురం కార్పొరేషన్ లో కనీసం అభ్యర్థిని గెలిపించుకోలేక పోవడం మంత్రి సత్యకుమార్ పై పార్టీ నాయకత్వం కూడా గుర్రుగా ఉంది. కూటమి పార్టీల నేతలు, ఓటు బ్యాంకును సమన్వయం చేసుకోవడంలో సత్యకుమార్ ఘోరంగా విఫలమయ్యారన్న వాదన బలంగా వినిస్తుంది. సత్యకుమార్ యాదవ్ కు తన బలమేంటో తనకు తెలియదు. గాలి వాటాన గెలవడం కాదు. ప్రజల తీర్పు ఎలా ఉంటుందో అనంతపురం ప్రజలు ఇప్పుడు రుచి చూపించారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయినంత మాత్రాన లీడర్ అయపోరు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఇప్పటికైనా సత్యకుమార్ వాస్తవాలు తెలుసుకుని నేల మీద నడిస్తే వచ్చే ఎన్నికల నాటికి కొంతైనా పార్టీ మెరుగుపడుతుంది

ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా...

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల ఫలితాల్లో వైసీపీ విజయం సాధించడం కూటమి తరపున ప్రచార బాధ్యతలు మోసిన మంత్రి సత్యకుమార్‌కు పెద్ద ఎదురుదెబ్బగా నిలిచింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ, మేయర్ పీఠాన్ని వైసీపీ కైవసం చేసుకుంది.ఎగ్జిక్యూటివ్ చూడండి రాష్ట్రంలోని అన్ని చోట్ల గెలిచిన కూటమి అనంతపురంలో మాత్రం చతికలపడటానికి సత్యకుమార్ నాయకత్వమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వాదనను ఆయనను అంగీకరించకపోవచ్చు. కుంటిసాకులు చెప్పొచ్చు. కానీ బీజేపీ ఓటమికి నైతిక బాధ్యతను మాత్రం సత్యకుమార్ తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఓట్ల బదిలీ చేయించడంలో మంత్రిగా సత్యకుమార్ యాదవ్ సక్సెస్ కాలేకపోయారు. కూటమిలో ఉంటే గెలుస్తామన్న గుడ్డి నమ్మకం ఉంటే చాలదు. దానికి కావాల్సిన సోషల్ ఇంజినీరింగ్ తో పాటు అభ్యర్థి ఎంపిక, ప్రచారం వంటివి కూడా కీలకంగా మారతాయన్నది ఆయన గ్రహించాలి.

అంతా తానే అయి...

అనంతపురం కార్పొరేషన్ లో మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ తన సమీప బీజేపీ అభ్యర్థి అజేష్ యాదవ్‌పై 5,981 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ విజయాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని మేయర్ పీఠంపై కూర్చోబెట్టడమే లక్ష్యంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ నగరంలో స్వయంగా ఉండి ముమ్మర ప్రచారం నిర్వహించారు. సినీ నటుడు సాయికుమార్‌తో రోడ్ షోలు కూడా చేయించారు. అయితే, తీవ్ర పోటీ నడుమ ఫలితం భిన్నంగా రావడంతో రాజకీయంగా ఇది ఆయనకు గట్టి షాక్‌గా మారినట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. మేయర్ స్థానాన్ని కోల్పోయినప్పటికీ, కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో కూటమి మెరుగైన స్థానాలను సాధించింది. మొత్తం స్థానాల్లో కూటమి 37 స్థానాలను దక్కించుకుంది. టీడీపీ 30, జనసేన 6, బీజేపీ ఒక స్థానం గెలుచుకోగా, వైసీపీ 21 స్థానాల్లో విజయం సాధించింది.కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య మేయర్ అభ్యర్థిత్వం మరియు సీట్ల సర్దుబాటు విషయంలో ఆశావహుల అంచనాలను సమతుల్యం చేయడంలో ఎదురైన సవాళ్లు, అంతర్గత విభేదాలు కూటమి మేయర్ అభ్యర్థి ఓటమికి దారితీశాయని విశ్లేషకులు భావిస్తున్నారు

ఏబీవీ తనకు తాను అతిగా ఊహించుకున్నారా?



అలివికాని చోట అధికులమనరాదు.. అన్న సామెత ఏబీ వెంకటేశ్వరరావుకు వర్తిస్తుంది. ఆయన చంద్రబాబు 2014లో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ గా, తర్వాత ఏపీ ఇంటలిజెన్స్ అధికారిగా పనిచేశారు. వైసీపీ హయాంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సస్పెన్షన్ కు గురయ్యారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయనకు మంచి పదవి లభిస్తుందని ఆశించారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ వస్తుందని భావించారు. కానీ ఆయనకు పోలీస్ హౌసింగ్ బోర్డు కమిటీ ఛైర్మన్ గా నామినేటెడ్ పదవి ఇవ్వడంతో దానిని ఆయన తిరస్కరించారు. అప్పటి నుంచి చంద్రబాబు ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేస్తూ వస్తున్నారు. దీంతో ఆయన విజయవాడ మేయర్ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించారు

స్వతంత్ర అభ్యర్థిగా...

విజయవాడ నగరపాలక సంస్థ యర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఓటమి పాలయ్యారు. డిపాజిట్ కూడా కోల్పోయారు. సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ మద్దతుతో ఏబీ వెంకటేశ్వరరావు విజయవాడ మేయర్ బరిలోకి దిగారు. మూడు నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేసినా ఓట్ల రూపంలో ప్రభావం కనిపించలేదు. గతంలో సీపీఎం అభ్యర్థి బాబూరావుకు వచ్చిన 29,333 ఓట్లతో పోలిస్తే ఏబీవీకి గణనీయంగా ఓట్ల సంఖ్య తగ్గింది. వామపక్షాల మద్దతు ఓట్లుగా ఎందుకు మారలేదన్నదే ప్రశ్న.ఏబీవీ ప్రచారానికి ప్రజల నుంచి ఆశించిన స్పందన కరువైంది. ఆయన చంద్రబాబును వ్యక్తిగతంగా విమర్శించడం ఒక వర్గం ఓటర్లను దూరం చేసిందంటున్నారు. ఏబీవీని ఓన్ చేసుకునే ప్రయత్నం ఆ సామాజికవర్గం చేయలేదు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం ఉమ్మడి మద్దతుతో ఆయన బరిలోకి దిగినప్పటికీ, ఆయా పార్టీల సాంప్రదాయ ఓట్లు ఏబీవీకి పూర్తిగా బదిలీ కాలేదు. ఏబీవీకి కేవలం 12,642 ఓట్లు మాత్రమే వచ్చాయి.

టీడీపీ వ్యూహాత్మక నియంత్రణతో...

అధికార కూటమి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను గెలిపించుకోవడంతో పాటు, తమ కూటమి మద్దతుదారులు లేదా తటస్థ ఓటర్లు ఏబీవీ వైపు మళ్లకుండా టీడీపీ క్షేత్రస్థాయిలో వ్యూహాత్మకంగా వ్యవహరించి ఓట్లను నియంత్రించగలిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యంత కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్ లో ఏబీవీ ప్రచార బృందం వెనుకబడింది.విజయవాడలో ఓటింగ్ శాతం ఆశించిన స్థాయిలో నమోదు కాకపోవడం కూడా స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న ఏబీవీ ఓట్ల శాతాన్ని దెబ్బతీసింది. మరొక వైపు వైసీపీ కి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంక్ స్థిరంగా అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి వైపే నిలిచింది. దీనివల్ల ప్రతిపక్ష ఓట్లు చీలిపోయే అవకాశం ఏబీవీకి దక్కలేదు.ఎన్నికల ముందు ఏబీవీకి అనుకూలంగా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం, చర్చలు నడిచాయి. అయితే, ఆ డిజిటల్ హడావుడి క్షేత్రస్థాయిలో ఓట్లుగా మారడంలో పూర్తిగా విఫలమైంది.నగర సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఏబీ వెంకటేశ్వరరావు రాజకీయాలకు అతీతంగా విస్తృత ప్రచారం చేసినప్పటికీ, ప్రధాన పార్టీల సంస్థాగత బలం, కూటమి సమీకరణాల ముందు ఆయన నిలవలేకపోయారు. మరో అధికారి రాజకీయాల్లోకి అడుగుపెట్టి తొలి అడుగులోనే విఫలమయ్యారు.